నిజాల నిగ్గు తేల్చే

# చర్చ

తెలుగు దిన పత్రిక


**జీవితంలో**

మనం మాత్రమే ఎదగాలి అనుకున్నప్పుడు, మనం పడిపోతే పట్టుకోవడనికి ఎవ్వరూ ఉండరు. మనతో పాటు మన చుట్టూ ఉన్నవాళ్ళు కూడ ఎదగాలి అనుకున్నప్పుడు మనం పడిపోతే పట్టుకోవడానికి, పది చేతులు వస్తాయి.


**విలేకరులు కావలెను**

ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు అక్షర రూపమిచ్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే చర్చ ఎదురుచూస్తోంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ వ్యాప్తంగా చర్చ దినపత్రికలో రాష్ట్రం, జిల్లాలు, నియోజకవర్గ, మండలాల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతి, యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 99666 41155



తెలంగాణ , సంపుటి : 28 సంచిక : 68 బుధవారం, డిసెంబర్ 03, 2025 , పేజీలు - 12 వెల : 2/-


## పార్లమెంటులో సర్ ఆందోళనలు

- ఉభయసభల్లో చర్చకు పట్టు
- గందరగోళం మధ్య లోక్‌సభ నేటికి వాయిదా



2లో

## 50 రోజుల్లో 2వేల మంత్రాల పఠనం


- కాశీ కుర్రాడు వేదమూర్తికి మోడీ ప్రశంసలు



న్యూఢిల్లీ, 2 : ఏళ్ల పండితుడు వేదమూర్తి దేవ్రవ్రత్ మహేశ్ రేఖేపై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. దండక్రమ పారాయణాన్ని పూర్తి చేసిన క్రమంలో ఆ కుర్రాడిని ప్రధా ని మెచ్చు కున్నారు. శుక్ల యజు ర్వేదంలోని మధ్యాంధినిలో ఉన్న సుమారు 2000 మంత్రాలను ఆ యువకుడు పారాయణం చేశారు. మిగతా2లో...

## ఖమ్మం జిల్లా అభివృద్ధి బాధ్యత నాది

- తెలంగాణ ఏర్పాటుకు పునాది పడింది ఇక్కడే
- తెలంగాణ ఇచ్చిన మన్మోహన్ పేరుతో ఎర్త్ వర్సిటీ
- గ్రామాల్లో మంచి సర్పంచ్‌నే ఎన్నుకోండి
- మంత్రులతో కలిసి పనిచేసే వారినే ఆదరించండి
- కొత్తగూడెంలో ఎర్త్ సైన్సెస్ వర్సిటీకి సిఎం రేవంత్ శంకుస్థాపన



కొత్తగూడెం,డిసెంబర్ 2 : ఖమ్మం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపే బాధ్యత తనదేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కొత్తగూడెంలో డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ వర్సిటీని ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. 60 ఏళ్ల స్వరాష్ట్ర కలను తీర్చింది ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్.. అందుకే దేశంలో ఉన్న ఏకైక ఎర్త్ సైన్స్ వర్సిటీకి ఆయన పేరు పెట్టామని తెలిపారు. మిగతా2లో...

## పవన్ వ్యాఖ్యలను వక్రీకరించవద్దు

- జనసేన పార్టీ ప్రకటన విడుదల



అమరావతి,డిసెంబర్ 2 : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై వస్తోన్న విమర్శలపై జనసేన పార్టీ స్పందించింది. రైతులతో ముచ్చటిస్తూ చెప్పిన మాటలను వక్రీకరిస్తున్నారు. ఇరు రాష్ట్రాల మధ్య సుహృద్భావ వాతావరణం దృష్ట్యా పవన్ కల్యాణ్ మాటలను వక్రీకరించవద్దని మిగతా2లో...

## అమిత్ షాతో లోకేశ్ తదితరుల భేటీ

- మొంథా తుఫాన్ నష్టంపై వివరణ
- త్వరగా సాయం కోరిన లోకేశ్
- ఏవియేషన్ సిటీపై జిఎంఆర్ అధికారులతో చర్చ



2లో

## రోహింగ్యాలకు రెడ్ కార్పెట్ ఆహ్వానం పలకాలా?

అదృశ్యంపై కేసులో సుప్రీం ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు



న్యూఢిల్లీ,డిసెంబర్ 2 : రోహింగ్యా శరణార్థులను వెనకేసుకుని వచ్చేలా పిటిషన్ దాఖలు చేయడంపై సుప్రీం ఆగ్రహం వ్యక్తం చేసింది. రోహింగ్యాల అదృశ్యంపై దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్ విచారణ సందర్భంగా.. సుప్రీంకోర్టుకీలక వ్యాఖ్యలు చేసింది. దేశంలోకి అక్రమంగా ప్రవేశించే వారికి.. మిగతా2లో...

## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు

- నేడు ప్రధానిని ఆహ్వానించనున్న సిఎం రేవంత్
- వివిధ రాష్ట్రాల బాధ్యతలు మంత్రులకు అప్పగింత




హైదరాబాద్,డిసెంబర్ 2 : తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సుకు ప్రధాన మంత్రి మోదీ సహా అన్ని రాష్ట్రాల సీఎంలను ఆహ్వానించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించా రు. ఢిల్లీ వెళ్తోన్న సీఎం రేవంత్‌రెడ్డి.. బుధవారం ఉదయం 11 గంటలకు ప్రధాని మోదీతో భేటీ కానున్నారు. 'తెలంగాణ రైజింగ్-2025' సదస్సుకు రావాలని ప్రధానిని ఆహ్వానించను న్నారు. అనంతరం పలువురు కేంద్రమంత్రు లనూ సదస్సుకు ఆహ్వానించాను న్నారు. అలాగే కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్, మల్లికార్జున ఖర్గే సహా ఇతర కేంద్రమంత్రులను ఆహ్వానించనున్నారు. మిగతా2లో...



## పవన్ జీ క్షమాపణలు చెప్పండి

- లేదంటే తెలంగాణలో మీ సినిమాలు ఆడవ్
- సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి హెచ్చరిక

హైదరాబాద్,డిసెంబర్ 2 : ఏపి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు రాజకీయాలు తెలియవని తెలంగాణ రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. పవన్ కల్యాణ్ తెలిసీ తెలియకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. డిప్యూటీ సీఎం కాగానే ఆయన ఏదేదో మాట్లాడుతున్నారని తెలిపారు. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కోనసీమలో పర్యటించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలంటూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ఆయన డిమాండ్ చేశారు. పవన్ క్షమాపణ చెబితే.. తెలంగాణలో ఆయన సినిమా ఒకటి, రెండు రోజులు ఆడుతుందన్నారు. లేకుంటే సినిమాలు ఆడవని మంత్రి కోమటిరెడ్డి చెప్పారు. పవన్ కల్యాణ్ మిగతా2లో...

## హిల్ట్ పాలసీపై బిఆర్ఎస్ పోరుబాట

- ఎనిమిది బృందాలతో ఆయా ప్రాంతాల్లో పరిశీలన
- నేటి నుంచి రెండ్రోజులు ఎనిమిది బృందాల పర్యటన
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ వెల్లడి



హైదరాబాద్,డిసెంబర్ 2 : గ్రేటర్ పరిధిలోని రూ.5లక్షల కోట్ల విలువైన పారిశ్రామిక భూములను హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ హిల్ట్ పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకు నేందుకు బీఆర్ఎస్ సిద్ధమైంది. ఇందులో భాగంగా పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు మిగతా2లో...

## నేషనల్ హెరాల్డ్ కేసులకు భయపడేది లేదు

- సోనియా, రాహులలకు అండగా మనమంతా ఉన్నాం
- రాష్ట్రాన్ని బిఆర్ఎస్ పదేళ్లు పాలించినా ఒక్క ఎయిర్‌పోర్ట్ రాలే
- అభివృద్ధి,సంక్షేమంతో ముందుకు దూసుకెళ్తున్నాం
- పిసిసి సమావేశంలో సిఎం రేవంత్ కీలక ప్రసంగం

2లో



## అధిష్ఠానం ప్రకటిస్తే డీకే శివకుమార్ సీఎం అవుతాడు : సిద్ధరామయ్య



కర్ణాటక,డిసెంబర్ 2 : కర్ణాటకలో సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డికే శివకుమార్ మధ్య సీఎం కుర్చీ కోసం రాజుకున్న వివాదం దేశవ్యాప్తంగా చర్చనీయాంశం కావడంతో.. కాంగ్రెస్ పార్టీ నష్ట నివారణ చర్యలకు పూనుకుంది. బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ ఏర్పాటు చేసి ఐక్యతను చాటుకోవాలని సూచించింది. దాంతో ఇప్పటికే సిద్ధరామయ్య ఇంట్లో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ ముగిసింది. ఇవాళ డీకే శివకుమార్ రెండో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ కూడా నిర్వహించారు.ఆ సమావేశం అనంతరం సిద్ధరామయ్య మీడియా తో మాట్లాడుతూ.. పార్టీ అధిష్ఠానం ప్రకటిస్తే డీకే శివకుమార్ సీఎం అవుతాడని అన్నారు. మా ఇద్దరి మధ్య ఎలాంటి విభేదాలు లేవని, ఇద్దరం కలిసికట్టుగా రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేస్తున్నామని చెప్పారు. ఇద్దరికీ హైకమాండ్ ఆదేశాలే శిరోధార్యమని, ఎవరు మిగతా2లో...

నిజాలు నిగ్గు తేల్చే
చర్చ
తెలుగు దిన పత్రిక



# అమిత్ షాతో లోకేశ్ తదితరుల భేటీ

**న్యూఢిల్లీ, డిసెంబర్ 2 :** మొంథా తుఫాన్ ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర నష్టాన్నే మిగిల్చింది.. ఇప్పటికే ప్రాథమిక అంచనాలపై కేంద్రానికి నివేదిక చేరగా.. ఢిల్లీ పర్యటనలో ఉన్న మంత్రి నారా లోకేష్, హోంమంత్రి అనిత.. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతో సమావేశమయ్యారు. మొంథా తుపాను కారణంగా ఆంధప్రదేశ్‌లో భారీ నష్టం జరిగిందని వివరించారు. ఈ నేపథ్యంలో తుపాను నష్టాలపై మంత్రి నారా లోకేష్ పూర్తి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో మంత్రి లోకేష్, రాష్ట్ర హోంమంత్రి అనిత ఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తుపాను ప్రభావం, పునరావాస చర్యలు, నష్టపరిహారం అవసరాలపై సమగ్ర వివరాలు లోకేష్ అందించారు. తుపాను వల్ల మొత్తం రూ.6,352 కోట్ల నష్టం జరిగినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నివేదికలో పేర్కొంది.మొంథా తుపాను మొత్తం 3,109 ప్రభావిత గ్రామాల్లో ప్రభావం చూపించింది.. తుపాను తీరం దాటి సమయం: అక్టోబర్ 28 రాత్రి, కాకినాడ సమీపంలో గాలి వేగం గంటకు 100 కి.మీ వేగంతో ఉంది. అయితే, పునరావాస చర్యల్లో 1.92 లక్షల మందిని 2,471 శిబిరాలకు తరలించాం. తుఫాను అనంతరం ప్రభావిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున వెంటనే రూ.3,000 చొప్పున తక్షణ ఆర్థిక సాయం పంపిణీ చేసింది. అదేవిధంగా, కూలిన చెట్ల తొలగింపు, విద్యుత్ పునరుద్ధరణ, తాగునీటి సరఫరా వంటి అత్యవసర చర్యలు చేపట్టినట్లు లోకేష్ వివరించారు. అత్యవసర అవసరాల నిమిత్తం రూ.60 కోట్లు ప్రభుత్వ ఖజానా నుంచి విడుదల చేసినట్లు తెలిపారు. ఇదిలావుంటే దిల్లీలో ఏపీ మంత్రి లోకేశ్ పర్యటన కొనసాగుతోంది. విమానాశ్రయాల రూపకల్పన, నిర్మాణం, నిర్వహణలో అంతర్జాతీయంగా పేరున్న జీఎంఆర్ సంస్థకు చెందిన సీనియర్ అధికారులతో మంత్రి లోకేశ్ మంగళవారం భేటీ అయ్యారు. ఏపీలోని విశాఖపట్నం వద్ద దేశంలోనే తొలి ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ అభివృద్ధిపై విస్తృతంగా చర్చించారు. ఎడ్యుసిటీని జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేయనున్నారు. విశాఖ ప్రాంతంలో ఏవియేషన్ ఎడ్యుసిటీ అభివృద్ధి ద్వారా విమానయాన, అంతరిక్ష, రక్షణ రంగాల.. విద్య, శిక్షణకు హబ్‌గా మారుతుంది. ఇందుకోసం ప్రత్యేక నైపుణ్యం కలిగిన అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలను తీసుకురానున్నారు. ఏవియేషన్ ఎడ్యుసిటీ ఏర్పాటు ఉత్తరాంధ్ర ప్రాంతానికి గేమ్ ఛేంజర్‌గా మారడంతో పాటు ఏపీ ఏవియేషన్ క్లస్టర్ అభివృద్ధిని వేగవంతం చేయనుంది. ఈ సమావేశంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లా అభివృద్ధి బాధ్యత నాది

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ ఉద్యమానికి పునాది రాయి పడింది కూడా పాల్వలంచోలనే అని అన్నారు. రాష్ట్ర ప్రజల చిరాకాల వాంఛ నెరవేర్చిన మన్మోహన్‌సింగ్ పేరుతో ఎర్త్ సైన్స్ వర్సిటీ ఏర్పాటు చేసుకోవడం గర్వకారణం అన్నారు. ఎడ్యుకేషన్, ఇరిగేషన్ రంగాలే ప్రపంచపటంలో తెలంగాణను నిలబెడుతున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేస్తాం. భద్రాచలం రాముల వారి సాక్షిగా చెబుతున్నా.. అన్ని జిల్లాలతో పాటు ఖమ్మం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యత నాది. పాలనకు ఆయువుపట్టయిన శాఖలన్నీ ఖమ్మం జిల్లా మంత్రుల చేతుల్లోనే ఉన్నాయి. రెండేళ్ల క్రితం మీరంతా ఓట్లేసి గెలిపిస్తేనే.. ప్రజలకు మంచి పాలన అందిస్తున్నాం అన్నారు. మంచి ప్రభుత్వం ఉంటేనే ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం, ఉచిత కరెంట్, రేషన్ కార్డులు వస్తాయి. గ్రామాల్లో సర్పంచ్‌లు కూడా మంచోళ్లు ఉండాలి. మంత్రులతో కలిసి పనిచేసే మంచి సర్పంచి మీ ఊళ్లో లేకపోతే.. గ్రామాలు దెబ్బతింటాయని అన్నారు. రాజకీయ కక్షలు మాని పదేళ్లు అండగా నిలబడండి. తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలబెడదాం. సర్పంచ్ ఎన్నికల్లో మంత్రులు, తుమ్మల, భట్టి, పొంగులేటితో కలిసి గ్రామాలను అభివృద్ధి పథం వైపు నడిపించే వారిని ఎన్నుకోండని సీఎం విజ్ఞప్తి చేశారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కు కంచుకోట అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా మొత్తం కాంగ్రెస్ కు అండగా నిలబడిందన్నారు. 1969లో తెలంగాణ ఉద్యమానికి పునాదులు పడ్డవే పాల్వంచలోనేనని చెప్పారు. 60 ఏండ్లు ఉద్యమం నడవడానికి కారణం ఈ పాల్వంచనే అని చెప్పారు. కొత్తగూడెం థర్మల్ పవర్ ప్లాంట్ కోసం వేలాది ఎకరాలు భూమి ఇచ్చారని చెప్పారు. దేశంలో వ్యవసాయం అభివృద్ధికి కారణం కాంగ్రెస్ అన్నారు రేవంత్. నాగార్జున సాగర్,శ్రీశైలం, ఎస్సారెస్పీ ప్రాజెక్టులు నెహ్రూ కట్టినవేనని తెలిపారు. ఈ పదేళ్లలో ఖమ్మం జిల్లాలోని ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. కృష్ణా,గోదావరి జలాలతో ఖమ్మం జిల్లా తడవాలన్నారు. ఎడ్యుకేషన్ కు సంబంధించి ప్రతీ అవకాశాన్ని జిల్లాకు ఇస్తున్నామన్నారు. పదేండ్లు పాలించినోళ్లు అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. ఖమ్మం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యత తనదన్నారు. సర్కార్ ఏ సంక్షేమ పథకం మొదలు పెట్టినా..ఖమ్మం జిల్లా నుంచే ప్రారంభించామని.. సన్నబియ్యం,రేషన్ పంపిణీ ఈ జిల్లా నుంచే ప్రారంభించామన్నారు. మీ ఓటే ఆయుధంగా మారి ప్రజాపాలన అందిస్తుందన్నారు. మంచోడినే సర్పంచ్ గా ఎన్నుకోవాలని.. మందుకో..డబ్బుకో ఓటేస్తే ఊరు మునుగుతుందని సూచించారు.ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల పొంగులేటి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎంపిలు పాల్గొన్నారు.

# నేషనల్ హెరాల్డ్ కేసులకు భయపడేది లేదు

**హైదరాబాద్,డిసెంబర్ 2 :** కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలపై కేసులు పెడితే భయపడేది లేదని తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా టీపీసీసీ సమావేశంలో పలు అంశాలపై మాట్లాడారు. పార్టీ నేతలు, కార్యకర్తలకు కీలక సందేశం పంపిస్తూ పలు రాజకీయ, పరిపాలనా అంశాలపై తన అభిప్రాయాలు వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా ప్రధాని మోదీ వైఖరి పై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తూ.. కాంగ్రెస్ నాయకత్వానికి మద్దతుగా నిలబడాలని పిలుపుని చ్చారు. సీఎం మాట్లాడుతూ.. గాంధీని హత్య చేసిన పార్టీ బీజేపీ అని అన్నారు.. నేషనల్ హెరాల్డ్ కేసు పేరుతో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను వేధించడం మోదీ ప్రభుత్వ లక్ష్యపూర్వక చర్యే అని విమర్శించారు. ఓటు చోరీపై పార్లమెంట్‌లో చర్చ జరగకుండా విచ్చలవిడిగా కేసులు తెరపైకి తీసుకువచ్చారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ విలువలను కాపాడే బాధ్యత అందరిదినని, రాహుల్ గాంధీ, సోనియా గాంధీలకు మద్దతుగా నిలబడే తీర్మానం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నేషనల్ హెరాల్డ్ సిబ్బందికి వీరు ఆర్థిక సహాయం అందించారన్నారు. ప్రైవేట్ సంస్థల్లో పని చేసిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఉండవని.. ఈ నేపథ్యంలో ఎప్పుడో మూతపడిన నేషనల్ హెరాల్డ్ సిబ్బందిని మంచి ఆలోచనతో వీరు ఆర్థికంగా ఆదుకున్నారని గుర్తు చేశారు. పత్రికను తిరిగి నడిపించాలనే ఉద్దేశ్యంతో బోర్డు ఆఫ్ డైరెక్టర్లుగా కొంత మంది కాంగ్రెస్ పార్టీ నేతలను తీసుకున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఒక పత్రిక ఉండాలని నిర్ణయించి.. నేషనల్ హెరాల్డ్ పత్రిక పునరుద్ధరించే ప్రక్రియను వారు చేపట్టారని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. దేశం కోసం గాంధీ కుటుంబం త్యాగం చేసిందని ఆయన పునరుద్ఘాటించారు. మంగళవా రం హైదరాబాద్‌లో టీపీసీసీ కార్యవర్గ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. దేశంలో కోసం గాంధీ కుటుంబం చేసిన త్యాగాలను ఆయన సోదాహరణంగా వివరించారు. డిసెంబర్ 7వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్తామని చెప్పారు. ఈ యూనివర్సిటీ అభివృద్ధికి ఎంత ఖర్చు అయినా నిధులు కేటాయిస్తామన్నారు. ఓయూను ప్రపంచ స్థాయిలో నిలబెడతామని ఆయన ప్రకటించారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నామన్నారు. 9వ తేదీన తెలంగాణ – 2047 పాలసీ డాక్యుమెంట్ ఆవిష్కరణ చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి దిగ్గజ నేతల సలహాలు సైతం తీసుకున్నామని పేర్కొన్నారు. కోర్ అర్బన్‌ను క్యూర్ చేయాలని తాము నిర్ణయించామన్నారు. కాలుష్య కారక పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తరలిస్తున్నామని స్పష్టం చేశారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, పరిశ్రమల తరలింపు తదితర అంశాలు తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని వివరించారు. కొన్ని పరిశ్రమలు నడిచే పరిస్థితి లేక మూతపడ్డాయన్నారు. మరికొన్ని పరిశ్రమల ఊరు, నగరం నడిబొడ్డున ఉన్నాయని.. ఆయా పరిశ్రమల ను తరలిస్తే కొంత భూమి అందుబాటులోకి వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే అభివృద్ధి ప్రణాళికలపై మాట్లాడుతూ.. నాచారం ప్రాంతంలోని పరిశ్రమలను పట్టణం వెలుపలకు మార్చాలని, ఇందుతో మధ్యతరగతి కుటుంబాలు భూములు కొనుగోలు చేయగలవని, పేదలకు అవకాశాలు పెరుగుతాయని చెప్పారు.తాను సీఎం అయ్యే ముందు కొంతమంది పై కోపం ఉన్నా, ఇప్పుడు పనిపై దృష్టి పెట్టి సైలెంట్‌గా ముందుకు సాగుతున్నానని చెప్పారు. కాంగ్రెస్‌లో విభిన్న మనస్తత్వాలు ఉన్నప్పటికీ, మంచి అభిప్రాయం, మంచి ఉద్దేశాలు మాత్రం ఏకం గా ఉండాలని సూచించారు. ఇక చివరలో.. రాహుల్ గాంధీని ప్రధాని చేయాల్సిన బాధ్యత మనదే. నేను సీఎం కావచ్చు, కానీ ఆ పదవులు పొందడం నిజమైన కష్టమే. ఆ విలువ మీకు తెలుసు. అందరం కలిసే పని చేసినప్పుడే కాంగ్రెస్ బలపడుతుందని అన్నారు. టిపిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# హిల్ట్ పాలసీపై బిఆర్ఎస్ పోరుబాట

(మొదటి పేజీ తరువాయి)

వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రవ్యాప్తంగా సీనియర్ నాయకులతో కూడిన నిజనిర్ధారణ బృందాలను నియ మించారు. ఈ మేరకు పార్టీ ముఖ్య నేతలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేటీఆర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, క్షేత్రస్థాయి పర్యటనలపై దిశానిర్దేశర చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లా డుతూ.. రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తా రు. గత ప్రభుత్వాలు పరిశ్రమల స్థాపన కోసం, ఉపాధి కల్పన కోసం అతి తక్కువ ధరకే కేటాయించిన భూము లను, ఇప్పుడు 'మల్టీ యూజ్ జోన్' పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి మారుస్తున్నారని ఆరోపించారు. సుమారు 9,300 ఎకరాల భూములను మార్కెట్ విలు వ కంటే అతి తక్కువకు, కేవలం ఎస్ఆర్ఓ రేటులో 30 శాతానికే రెగ్యులరైజ్ చేసి, సుమారు రూ. 5 లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టే కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టడానికి, కనీసం స్మశాన వాటికలకు కూడా స్థలాలు లేవని చెబుతున్న ప్రభుత్వం, వేల కోట్ల విలువైన భూములను మాత్రం ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నదని మండిపడ్డారు.ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు హైద రాబాద్ చుట్టుపక్కల ఉన్న పారిశ్రామిక వాడలను 8 క్లస్టర్లుగా విభజించి, పార్టీ సీనియర్ నాయకుల ఆధ్వర్య ంలో బృందాలు పర్యటించనున్నాయి. అక్కడ స్థానిక నాయకులను, ప్రజలను కలుపుకొని వాస్తవ మార్కెట్ విలువకు, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఉన్న భారీ వ్యత్యాసాన్ని ప్రజల ముందు ఉంచనున్నారు. వీటితో పాటు అక్కడి పారిశ్రామిక వాడల ద్వారా ప్రజా ఉపయోగ కార్యక్రమాలు ఏమేమి చేయవచ్చు, అక్కడి స్థానిక ప్రజల సుదీర్ఘకాలం డిమాండ్లను ఆకాంక్షలను కూడా పార్టీ నేతలు తెలుసుకోనున్నారు. ఒకప్పుడు అక్కడ పారిశ్రామిక వాడల ఏర్పాటు కోసం ప్రజలు భూములు ఇచ్చిన తీరును ప్రభుత్వం కేటాయించిన తీరును వాటిని అత్యంత చవకగా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వాలు కట్టబెట్టిన అంశాన్ని, వాటి ఉద్దేశాలను పార్టీ నేతల బృందాలు ప్రస్తావించనున్నాయి.డిసెంబర్ 3, 4 తేదీల్లో హిల్ట్ పాలసీ స్కామ్‌పై నిజనిర్ధారణ కోసం బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన ఎనిమిది బృందాలు ఆయా ప్రాంతాల్లో పర్యటించనున్నాయి. ఇందులో భాగంగా..క్లస్టర్–1లో సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు నేతృత్వంలో మాజీమంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మెదక్ ఎమ్మెల్యేల బృందం పాశమైలారం, పటాన్ చెరువు, రామచంద్రాపురం ప్రాంతాలను సందర్శించనున్నారు.క్లస్టర్–2లో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి నేతృత్వంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ సురభి వాణీ దేవి, ఉప్పల్ నాయకులు కలిసి నాచారం, మల్లాపూర్, ఉప్పల్, చర్లపల్లి ప్రాంతాల్లో పర్యటిస్తారు.క్లస్టర్–3లో శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనా చారి నేతృత్వంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావుతో కూడిన బృందం మౌలాలి, కుషాయిగూడ పారిశ్రామిక వాడల్లో పర్యటిస్తారు. క్లస్టర్–4లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానందతో కలిసి జీడిమెట్ల, కూకట్‌పల్లి ప్రాంతాల్లో పర్యటించనున్నారు.

# పార్లమెంటులో సర్ ఆందోళనలు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 2 :** ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ వ్యతిరేకంగా విపక్షాలు ఆందోళనకు దిగడంతో పార్లమెంట్ ఉభయసభలు దద్దరిల్లాయి. ఓట్ చోరీ, గద్దీ చోరీ అంటూ ప్రతిపక్ష పార్టీల ఎంపీలు నినాదాలు చేశారు. ఫలితంగా ఉభయసభల్లో గందరగోళం నెలకొన్నది. లోక్‌సభ ను కంట్రోల్ పెట్టేందుకు స్పీకర్ ఓంబిర్లా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దాంతో స్పీకర్ ముందుగా సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. మధ్యాహ్నం 12 గంటలకు సభ తిరిగి ప్రారంభమైనా సేమ్ సీన్ రిపీట్ అయ్యింది. దాంతో మధ్యాహ్నం 2 గంటల వరకు సభ వాయిదా పడింది. మధ్యాహ్నం రెండు గంటలకు సభ పునఃప్రారంభ మైనా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు. గందరగోళం కొనసాగింది. దాంతో స్పీకర్ సభను బుధవారానికి వాయిదా వేశారు. అంతకుముందు ప్రతిపక్ష సభ్యులు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ ఈ ఆందోళనల్లో పాల్గొన్నారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం బీజేపీకి ఓట్లు దోచిపెట్టే పని చేస్తున్నదని విమర్శించారు.

# 50 రోజుల్లో 2వేల మంత్రాల పఠనం

(మొదటి పేజీ తరువాయి)

వరుసగా 50 రోజుల్లో ఆ మంత్రాలను అతను వల్లించాడు. ఇదో గొప్ప ఘనత అని ప్రధాని మోదీ తన ప్రశంసలో పేర్కొన్నారు. రాబోయే తరాలు ఈ అద్భుత ఘనతను గుర్తుంచుకుంటాయని అన్నారు. భారతీయ సంస్కృతి పట్ల ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ ఆ కుర్రాడు సాధించిన ఘనతను గర్విస్తారన్నారు. ఎటువంటి అవరోధాలు లేకుండా శుక్ల యుజుర్వేదంలోని 2 వేల మంత్రాలను ఆ యువకుడు పఠించినట్లు చెప్పారు. కాశీ నియోజకవర్గానికి చెందిన ఆ కుర్రాడు ఆ పవిత్ర పట్టణంలో అసాధారణ ఫీట్‌ను సాధించడం పట్ల సంతోషంగా ఉందని ప్రధాని అన్నారు. తన ఎక్స్ అకౌంట్‌లో మోదీ మెసేజ్ చేశారు. ఆ కుర్రాడికి సపోర్టు ఇచ్చిన కుటుంబసభ్యులకు, పండితులుకు, సంస్థలకు ప్రధాని థ్యాంక్స్ తెలిపారు. మరో వైపు హర్యానాలోని జాజర్‌లో ఉన్న సిద్ధ బాబా పాల్‌నాథ్ ఆశ్రమాన్ని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సందర్శించారు. ప్రాణ ప్రతిష్ట, ఆత్మ భండార కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. సనాతన సంస్కృతి, మానవ పరిణామ క్రమంలో దాని ప్రభావాన్ని ఆయన తన ప్రసంగంలో తెలిపారు.

# పవన్ వ్యాఖ్యలను వక్రీకరించవద్దు

(మొదటి పేజీ తరువాయి)

జనసేన పార్టీ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఇటీవల కోనసీమ జిల్లాలో దెబ్బతిన్న కొబ్బరి చెట్లను పరిశీలించేందుకు అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..గోదావరి జిల్లాలు అన్నపూర్ణగా భాసిల్లుతున్నాయి. రాష్ట్రం విడిపోవడానికి కారణం వీటి పచ్చదనమే. నిత్యం పచ్చగా ఉంటుందని తెలంగాణ నాయకులంతా అంటారు. ఇప్పుడు కొబ్బరికి దిష్టి తగిలినట్లుంది అని పవన్ వ్యాఖ్యానించారు.

# రోహింగ్యాలకు రెడ్ కార్పెట్ ఆహ్వానం పలకాలా?

(మొదటి పేజీ తరువాయి)

న్యాయస్థానం అసాధారణ రక్షణలు కల్పించాలా అని ప్రశ్నించింది. రోహింగ్యాలు అదృశ్యమవుతున్నారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌పై భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా 'వారికి రెడ్‌కార్పెట్ వేసి.. ఆహ్వానించాలని మీరు కోరుకుంటున్నారా' అని పిటిషనర్‌ను సూటిగా ప్రశ్నించింది. రోహింగ్యాలు సొరంగ మార్గాల ద్వారా భారత్‌లోకి వచ్చి.. ఆహారం, ఆశ్రయం వంటి హక్కులను డిమాండ్ చేస్తున్న విషయాన్ని ప్రస్తావించింది. 'ఉత్తర భారతదేశంలో మనకు చాలా సున్నితమైన సరిహద్దు ఉంది. చొరబాటుదారులు చట్టవిరుద్ధంగా ప్రవేశిస్తే.. వారిని ఇక్కడ ఉంచాల్సిన బాధ్యత మనకు ఉందా?' అని వ్యాఖ్యానించింది.

# తెలంగాణ....

(మొదటి పేజీ తరువాయి)

సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు పలువురు మంత్రులు గురువారం వివిధ రాష్ట్రాలకు వెళ్లి సీఎంలను ఆహ్వానించనున్నారు. రాష్ట్ర ఎంపీల బృందం.. దిల్లీ సీఎం, కేంద్రమంత్రులు, గవర్నర్లను ఆహ్వానించనుంది. ఈ మేరకు మంత్రులకు ఆహ్వాన బాధ్యతలను అప్పగించారు. ఇందులో భాగంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి – జమ్ముకశ్మీర్, గుజరాత్ రాష్ట్రాలకు వెళ్లి సిఎంలను ఆహ్వానిస్తారు. దామెదర్ రాజనర్సింహ – పంజాబ్, హరియాణాలకు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి – ఆంధ్రప్రదేశ్ శ్రీధర్‌బాబు – కర్ణాటక, తమిళనాడు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి – ఉత్తర్‌ప్రదేశ్, పొన్నం ప్రభాకర్ – రాజస్థాన్ కొండా సురేఖ – ఛత్తీస్‌గఢ్, సీతక్క – పశ్చిమ బెంగాల్, తుమ్మల నాగేశ్వరరావు – మధ్యప్రదేశ్, జూపల్లి కృష్ణారావు – అస్సాం, వివేక్ – బిహార్, వాకిటి శ్రీహరి – ఒడిశా, అడ్లూరి లక్ష్మణ్ – హిమాచల్‌ప్రదేశ్, మహ్మద్ అజారుద్దీన్ –మహారాష్ట్ర సీఎంను ఆహ్వానించనున్నారు.

# పవన్ జీ క్షమాపణలు చెప్పండి

(మొదటి పేజీ తరువాయి)

సోదరుడు చిరంజీవి సూపర్ మ్యాన్ అని ఈ సందర్భంగా అభివర్ణించారు. ఆయనకు రాజకీయా లతో సంబంధం లేదని గుర్తు చేశారు. అన్ని తెలుసుకుని మాట్లాడితే మంచిదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు మంత్రి హితవు పలికారు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యల వల్ల తెలంగాణ ప్రజలు బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధప్రదేశ్‌లో తాము ఎంతో నష్టపోయామని మంత్రి కోమటిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధప్రదేశ్‌లో హైదరాబాద్ ఆదాయాన్ని విశాఖపట్నం, కాకినాడ, తిరుపతికే వాడుకున్నారని వివరించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ వల్ల నష్టపోయామని గుర్తు చేసుకున్నారు. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నామని మంత్రి కోమటిరెడ్డి చెప్పుకొచ్చారు. కోనసీమ ప్రాంతంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటించారు.

# అధిష్ఠానం ప్రకటిస్తే డీకే శివకుమార్ సీఎం అవుతాడు : సిద్ధరామయ్య

(మొదటి పేజీ తరువాయి)

ఎప్పుడు ఏ పదవిలో ఉండాలనే విషయాన్ని అధిష్ఠానమే నిర్ణయిస్తుందని సిద్ధరామయ్య తెలిపారు.సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య సీఎం పదవి కోసం విభేదాలు నెలకొన్నాయని గత కొన్ని రోజులుగా ప్రచారం జరిగింది. ఒక దశలో సీఎం, డిప్యూటీ సీఎం సోషల్ మీడియాలో పోటీపోటీగా పోస్టులు పెట్టుకునే స్థాయికి గొడవ చేరింది. ఈ క్రమంలో రంగంలోకి దిగిన హైకమాండ్ ఆదేశాలతో నేతలిద్దరూ వెనక్కి తగ్గారు. హైకమాండ్ సూచన మేరకు బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లు నిర్వహించారు.

చర్చ
తెలుగు దిన పత్రిక
బుధవారం, డిసెంబర్ 03, 2025



# చొప్పదండి జాగృతిలో చేరికలు



చర్చ :- బ్యూరో కరీంనగర్ :చొప్పదండి మండలంలో ఈరోజు చొప్పదండి మండల ఇంచార్జ్ రంగరవేణి లక్ష్మణ్ ఆధ్వర్యంలో జాగృతిలో మండల కేంద్రానికి చెందిన డాక్టర్ మమత రెడ్డి మరియు రాంచంద్రారెడ్డిలపాటుమ్యాకల అరుణ్,గోగులకొండ మధు,గోగులకండ మహేందర్,గొల్లపల్లి రమేష్,బోడ రాకేష్ రెడ్డి తదితరులు చేరినారు. వారికి జాగృతి జిల్లా అధ్యక్షులు గుంజ పడుగు హరిప్రసాద్ కండువా కప్పి జాగృతిలోకి ఆహ్వానించడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ చొప్పదండి నియోజకవర్గంలో జాగృతి బలోపేతంలో భాగంగా పలువురు నాయకులు కవితక్క నాయ కత్వంలో పనిచేస్తామని ముందుకు రావడం ఆహ్వానించదగ్గ విషయమని వారు అన్నారు. చొప్పదండి నియోజకవర్గం లో జాగృతి బలోపేతం చేసి త్వరలోనే అన్ని స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందని గత ఇరవై సంవత్సరాలుగా జాగృతి తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాల కాపాడడం కోసం పనిచేస్తుందని చొప్పదండి నియోజకవర్గంలో జాగృతికి బలమైన నిర్మాణం ఉందని. కవితక్క చేపట్టిన జనం బాట కార్యక్రమ అనంతరం ప్రజల నిర్ణయానికి అనుగుణంగా కవితక్క జాగృతిని రాజకీయ పార్టీలతో సమానంగా ప్రజా సమస్యల పరిష్కార వేదికగా నిర్మాణం చేస్తుందని జాగృతి దృష్టికి ప్రజలు ఇప్పటికే అనేక సమస్యలను తీసుకు వస్తున్నారని కవితక్క వాటన్నిటికీ పరిష్కారానికి ప్రత్యేకమైన కార్యాచరణతో సంబంధిత శాఖల దృష్టికి, జిల్లా కలెక్టర్ దృష్టికి అధికారుల దృష్టికి తీసుకుపోయి వాటిని పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నారని ఈ రాష్ట్రానికి కవితక్క నాయకత్వం వహిస్తే ప్రజా సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ప్రజలు భావిస్తున్నారని జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, ఆదివాసి విభాగం జిల్లా అధ్యక్షులు కుతాడు శ్రీనివాస్, జిల్లా సీనియర్ నాయకులు చంటి శ్రీనివాస్, చొప్పదండి మండల అధ్యక్షులు పిట్టల సత్యం తదితరులు పాల్గొన్నారు

# మున్సిపల్ కార్మికులకు ప్రత్యేక వైద్య కేంద్రం

- కార్మికులు, సిబ్బందికి రూ.30 లక్షల జీవిత బీమా
- ఆరోగ్య జాగ్రత్తలు తప్పక పాటించాలి
- పిపీఈ కిట్ల పంపిణీ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి పమేలా సత్పతి







చర్చ :- బ్యూరో కరీంనగర్ : మున్సిపల్ కార్మికుల ఆరోగ్యం, సంక్షేమం దృష్ట్యా వారి కోసం ప్రత్యేక వైద్య కేంద్రం ఏర్పాటు చేసి సేవలు అందిస్తామని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు.వారధి సొసైటీ సహకారంతో మున్సిపల్ కార్మికులకు పిపిఈ కిట్ల పంపిణీ కార్యక్రమం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం జరిగింది.ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయితో కలిసి కార్మికులకు రక్షణ కిట్లను అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు విధిగా పిపిఈ కిట్లను ధరించాలని, ఆరోగ్య జాగ్రత్తలను తప్పక పాటించాలని సూచించారు. ఇప్పటికే మునిసిపల్, పంచాయతీ కార్మికులకు జిల్లా యంత్రాంగం తరఫున ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లిస్తున్నామని అన్నారు. ప్రస్తుతం కార్మికులతో సహా జవాన్లు ఇన్స్పెక్టర్లు, శానిటేషన్ వర్కర్లు ఎలక్ట్రిసిటీ కార్మికులతో సహా ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న సిబ్బందికి రూ.30 లక్షల ప్రమాద బీమా చేయించామని వివరించారు. కార్మికుల శ్రేయస్సు కోసం ప్రత్యేక వైద్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కేంద్రంలో వైద్యుడు సహా మందులు అందుబాటులో ఉంటాయని, కార్మికులతో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా ఈ సేవలు వినియోగించుకోవచ్చని తెలిపారు.మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ అనేక కార్యక్రమాలు చేపడుతోందని అన్నారు. కార్మికులు వారి కేవైసీ వివరాలు సమర్పించాలని సూచించారు. కార్మికుల కోసం ప్రతి నెలా ఈఎస్ఐ చెల్లిస్తున్నామని, అనారోగ్య రీత్యా సెలవులు అవసరమైన వారు ఈఎస్ఐ ద్వారా జీతాలు పొందవచ్చని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ లో ప్రతి కార్మికునికి బీమా, వైద్య సదుపాయం కల్పిస్తున్నామని అన్నారు. అనారోగ్యంతో ఉన్న కార్మికులు మెడికల్ ఇన్ వాల్యుయేషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కార్మికుల ఏ సమస్య అయినా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు.
ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు ఖాదర్ మొహినుద్దీన్, వేణుమాధవ్, మెడికల్ ఆఫీసర్ సుమన్, వారధి సొసైటీ మెంబర్ సెక్రటరీ ఆంజనేయులు పాల్గొన్నారు.

# అరెపల్లి వాగులో (ఒర్రె లో ) నిర్మించే శ్మశానవాటికను మరో ప్రాంతానికి మార్చండి

- స్మశానవటికకు కేటాయించిన రూ.49.50లక్షలు నిధులు వృథా కాకుండా చూడాలి





చర్చ :- కరీంనగర్ నోట్ : నగరపాలక సంస్థ కమీషనర్ గారితో ఫోన్ లో మాట్లాడి పిర్యాదు చేసిన జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్. సానుకూలంగా స్పందించిన కమీషనర్, అధికారులను పంపించి విచారణ చేపిస్తామని తెలిపారు.
ఈ రోజు అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆరెపల్లి వాగులో ఒర్రెలో నిర్మించే వాగునా పార్టీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు కోమటి రెడ్డి తేజ్ దీప్ రెడ్డి, బండారి శేఖర్ బృందం సందర్శన చేయడం జరిగింది. స్మశానవటిక నిర్మాణం చేస్తున్న ప్రాంతాన్ని పూర్తిగా పరిశీలిన చేయడం జరిగింది. అనంతరం కోమటి రెడ్డి తేజ్ దీప్ రెడ్డి, బండారి శేఖర్ లు మాట్లాడుతూ ఆరెపల్లి ప్రజలకు ఉపయోగపడేలా స్మశానవటికను నిర్మించాలని అన్నారు. ఆరెపల్లి (ఒర్రెలో) వాగులో నిర్మించడం వలన కాంట్రాక్టర్ ను బతికాంచడం తప్ప ఎవ్వరికి ఉపయోగం ఉండదని అన్నారు. నగరపాలక సంస్థ ఇంగినిర్ లు , కాంట్రాక్టర్ కుమ్మకాయి వాగులో నిర్మిస్తున్నారని ఆరోపించారు. స్మశానవటిక నిర్మాణానికి నగరపాలక సంస్థ నుండి రూ.49.50లక్షలు నిధులు కేటాయించినరాని అన్నారు. ఒక్క వర్షం గట్టిగా పడితే కొత్తపల్లి చెరువు నుండి వాగు ఒర్రె ద్వారా వచ్చే నీటి ప్రవాహానికి పెద్ద ఎత్తున వాగు ఉప్పొంగి వాగులో నిర్మించిన స్మశానవాటిక కొట్టుకుపోతుందని అన్నారు. స్మశానవాటిక కోసం నిర్మించిన ప్రజాధనం 59.50లక్షలు వృధా అవుతాయి. ప్రజాధనం పూర్తిగా నీటిలో పోసిన పన్నీరు లాగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరెపల్లి గ్రామంలో మరొక ప్రాంతంలో స్మశాన వాటి నిర్మాణానికి ప్రభుత్వ స్థలం ఉన్నది. ఆ ప్రభుత్వ స్థలానికి వెళ్ళుటకు అవసరమైతే రైతులు 30 ఫీట్ల రోడ్డు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కావున ఆరెపల్లి స్మశాన వాటికను వాగులో కాకుండా మరో ప్రాంతానికి నిర్మించాలని డిమాండ్ చేశారు. లేదంటే మా పార్టీ ఆధ్వరంలో నగరపాలక సంస్థ ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

# బాలికలు చదువుతో పాటు క్రీడల్లోనూ ముందుండాలి..

- ఏమైనా ఇబ్బంది ఎదురైనప్పుడు హెల్ప్ లైన్ కు కాల్ చేయండి..
- బాలికలు భయపడవద్దు..
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే
- బాలికలు చదువుతోపాటు క్రీడల్లోనూ ముందుండాలని అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని స్థానిక సంస్థల కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే పేర్కొన్నారు.





చర్చ :- కరీంనగర్ :స్నేహిత 2 అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకాడే కేజీబీవీ తిమ్మాపూర్ కేజీబీవీ గన్నేరువరం పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ స్నేహిత కార్యక్రమం ప్రాముఖ్యతను, గ్రీవెన్స్ బాక్స్ గురించి పాఠశాల బాలికలకు అవదగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బాలికలు చదువు తో పాటు క్రీడల్లోనూ ముందుండాలని అన్ని రంగాల్లో ప్రతిభ చూపాలని సూచించారు. అంతే కాకుండా ఏదైనా ఇబ్బంది ఎదురైనప్పుడు నిర్భయంగా హెల్ప్ లైన్ నెంబర్లకు కాల్ చేయాలనీ సూచించారు. బాలికలు భయపడకుండా ధైర్యంగా ముందుకెళ్లాలని ఏదైనా ఇబ్బంది ఉంటే సంబంధిత ఉపాధ్యాయులకు వివరించాలని పేర్కొన్నారు. నేషనల్ లెవెల్ కలోత్సవ్ కు సెలక్ట్ అయినా కేజీబీవీ తిమ్మాపూర్ విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందించారు ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస్, పాఠశాల స్పెషల్ ఆఫీసర్స్ పడాల కిరణ్ జ్యోతి, కాచగాని మధులత శ్రీలత రమేష్ అర్చన( జావేరియా పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# అక్కన్నపేట్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నుండి బిజెపిలో చేరికలు





చర్చ:- అక్కన్నపేట్ : బుధవారం రోజున అక్కన్నపేట మండల కేంద్రంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి గారి ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు రామంచ మహేందర్ రెడ్డి గారి అధ్యక్షతన బిజెపిలో చేరిన కాంగ్రెస్ పార్టీ నుంచి దాసరి కృష్ణ జంగంపల్లి రాంబాబు బండి నవీన్ జంగపల్లి శివ మల్లంపల్లి గ్రామానికి చెందిన గిరిమల రాజు కాంగ్రెస్ నుండి బిజెపిలో చేరినారు వారు బిజెపి పార్టీ చేస్తున్న అభివృద్ధి పట్ల ఆకర్షితులై దేశ భవిష్యత్తు కోసం ఎన్నో కార్యక్రమాలను శ్రీ కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గారి అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ఈరోజు బిజెపిలో చేరడం మాకు ఎంతో సంతోషం గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఎంతగానో అభివృద్ధి పనులను అందిస్తున్న పార్టీ అని వారు ఆశ బావ వ్యక్తపరుస్తూ సంతోషంగా ఈరోజు బిజెపిలో చేరడం జరిగింది ఈ కార్యక్రమంలో అక్కన్నపేట మండల ప్రధాన కార్యదర్శులు చెరుకు సంపత్ మడక రవికుమార్. బిజెపి నాయకులు మాజీ సర్పంచ్ కర్నాకంటీ శ్రీశైలం. నూనావత్ మోహన్ నాయక్. గూగులోతు తిరుపతి నాయక్ .తీగల చంద్రం. సలేంద్ర తిరుపతి. బత్తిని జీవను. కోమటి శ్రీనివాస్ వేముల శ్రీనివాస్ ఇటుకల రాజశేఖర్. జన్నారపు విష్ణు. జంగపల్లి యాదగిరి. మిట్టపల్లి కుమార్. జిల్లా కనుకయ్య.
దూలం మల్లేశం. మిట్టపల్లి సత్యనారాయణ తంగళ్ళపల్లి రాహుల్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## కొత్త జిల్లా వద్దు- పాత కరీంనగర్ జిల్లా ముద్దు



చర్చ:- హుస్నాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు హుస్నాబాద్ పర్యటనలో వారు హుస్నాబాద్ ప్రాంత ప్రజలను కరీంనగర్ లో కలుపుతానని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలను కోరుతూ రేపు హుస్నాబాద్ రానున్న సందర్భంగా హుస్నాబాద్ ప్రజల ఆకాంక్షను మరోసారి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకె వెళ్లేందుకు గాను ఈరోజు రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ పొన్నం ప్రభాకర్ గారిని కలిసి వినతి పత్రం సమర్పించడం జరిగింది ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రివర్యులు గౌరవ ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకొని వెళ్తానని హామీ ఇవ్వడం జరిగింది వినతి పత్రం సమర్పించిన వారిలో హుస్నాబాద్ పురపాలక సంఘం మాజీ కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, హుస్నాబాద్ మండల బిజెపి అధ్యక్షుడు భూక్య సంపత్ నాయక్, అక్కన్నపేట మండల అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి, ఎస్టీ మోర్చామాజీ జిల్లా అధ్యక్షుడు నునావత్ మోహన్ నాయక్ హుస్నాబాద్ పట్టణ మాజీ అధ్యక్షులు గుత్తికొండ విద్యాసాగర్, హుస్నాబాద్ మండల మాజీ అధ్యక్షుడు వెల్దండ రాజేంద్రప్రసాద్, హుస్నాబాద్ పట్టణ మాజీ ప్రధాన కార్యదర్శి తగరం లక్ష్మణ్, సీనియర్ బిజెపి నాయకులు పోలోజు రవీందర్ , బాలరాజు, వినతి పత్రం పై సంతకాలు చేసిన వారిలో స్ఫూర్తి స్వచ్ఛంద అధ్యక్షులు పందిళ్ళ శంకర్, వడ్డేపల్లి మల్లేశం తదితరులు వున్నారు

## నామినేషన్ కేంద్రాల ఏర్పాట్లు, రికార్డుల నిర్వహణను పరిశీలించిన జిల్లా సాధారణ పరిశీలకుడు సర్వేశ్వర్ రెడ్డి



చర్చ, భద్రాద్రి కొత్తగూడెం :గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియను పరిశీలించేందుకు జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు వి. సర్వేశ్వర్ రెడ్డి మంగళవారం ముల్కలపల్లి, అన్నపురెడ్డిపల్లి మండలాలలోని పలువురు నామినేషన్ కేంద్రాలను సందర్శించారు. సంబంధిత మండలాల్లో నామినేషన్ల స్వీకరణ పద్ధతి, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు వంటి అంశాలను ఖచ్చితంగా పరిశీలించిన పరిశీలకుడు, అభ్యర్థులు మరియు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిష్పక్షపాత వాతావరణంలో నామినేషన్ కార్యక్రమాలను కొనసాగించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన ముల్కలపల్లి మండలం పరిధిలోని సీతారాంపురం, ముల్కలపల్లి, జగన్నాథపురం గ్రామ పంచాయతీలను, అలాగే అన్నపురెడ్డి పల్లి మండలంలోని అన్నపురెడ్డిపల్లి, నరసాపురం, పెద్దిరెడ్డిగూడం గ్రామ పంచాయతీలను సందర్శించి నామినేషన్ కేంద్రాల్లో జరుగుతున్న పనితీరును సమీక్షించారు. ప్రజాస్వామ్య ప్రక్రియను మరింత బలోపేతం చేసే దిశగా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఈ పరిశీలనలో సంభంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అందరి చూపు కాకులమర్రి వైపే

ఏటూరునాగారం బిఆర్ఎస్ అభ్యర్థి కాకులమర్రి శ్రీలతకు ఘన స్వాగతం పలుకుతున్న ప్రజలు




చర్చ ములుగు జిల్లా బ్యూరో డిసెంబర్ 2: (ఏటూరు నాగారం) :మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబుకు ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు ప్రకటిస్తున్నారు. బిఆర్ఎస్ మండల అధ్యక్షులు గడదాసు సునీల్ కుమార్, టౌన్ అధ్యక్షుడు కాజా పాషా ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం జరుగుతోంది. 3వ వార్డు సభ్యుడు బట్టు మానస, 9వ వార్డు సభ్యుడు గోపి పర్వతాలు ఎల్లయ్యతో కలిసి శ్రీలత ఇంటింటికి ప్రచారంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటికెళ్లినా, గడపదాటినా, కాకులమర్రి కుటుంబం గతంలో అందించిన సేవలను ప్రజలు కృతజ్ఞతగా స్మరించారు.మా బాబుకు చికిత్స చేయించారు మా ఇళ్ల సమస్య తీర్చారు మాకు స్థలాలు ఇచ్చారు ఎల్లప్పుడూ అండగా నిలిచారు అని ప్రజలు స్వయంగా చెబుతూ, శ్రీలతక్కను భారీ మెజారిటీతో గెలిపించాలనే సంకల్పాన్ని వ్యక్తం చేస్తున్నారు.గ్రామపంచాయతీని రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు శ్రీలతకు అవకాశం ఇవ్వాలని ప్రజల ఆకాంక్ష.గెలుపు సునాయాసమేనని బిఆర్ఎస్ కార్యకర్తలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.ఈ ప్రచార కార్యక్రమంలో:తుమ్మ మల్లారెడ్డి, కాకులమర్రి ప్రదీప్ రావు, కూనూర్ అశోక్, ఎండి వలీ బాబా, కోనేరు నాగేష్, తాడూరి రఘు, తూరం పద్మ, ప్రమీల, లలిత, సఫియా, సర్దార్ పాషా, వెంకట్రావు, నరసయ్య, కుమ్మరి చంద్రబాబు, గండేపల్లి నరసయ్య, బాస పుల్లయ్య, బాలకృష్ణ, బాసాని శేఖర్, బట్టు గోపి, పర్వతాలు ఎల్లయ్య, జాడి భోజరాజు, యలవర్తి శ్రీనివాసరావు, గుండారపు శీను, గుండారపు రాజు, తాండ్ర విజయ్ తదితరులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పాఠశాలు పరిసరాలు ఆరోగ్య వంతంగా ఉండాలి నాగరాజు మున్సిఫల్ కమీషనర్





చర్చ, అశ్వరావుపేట :ప్రపంచంలోనే ఉన్నతమైనది విద్య అటువంటి విద్యాను భోదించే పాఠశాలలు, కళాశాలలు ముఖ్యంగా ప్రవేటు పాఠశాలలు, కళాశాలల తరగతి గదులతో పాటు పాఠశాల, కళాశాల ప్రాంగణాలు కూడా ఎల్లప్పుడు ఆరోగ్యవంతంగా అహ్లాదకరంగా ఉండాలకి అప్పుడే విద్యార్థులు నాణ్యమైన విద్యాను అందుకోగలరని అశ్వారావుపేట మున్సిఫల్ కమీషనర్ నాగరాజు సూచించారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని పెరాయిగూడెం లో ఉన్న ఏ 1 కిడ్స్ ప్రైవేట్ పాఠశాలను ఆకస్మిక సందర్శన చేసి పాఠశాలలోని టాయిలెట్స్, తరగది గదులు, పాఠశాల ఆవరణ, మంచినీటి సదుపాయం ఇలా అన్నిటి గురించి యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి విద్యా బుద్ధులు బాగా నేర్చుకోవాలని సూచించారు. ప్రవైట్ పాఠశాలలు కాని కళాశాలలు కాని నియమ నిబంధనలు పాటిస్తూ విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని ఎవ్వరైనా అతిక్రమిస్తే సంబంధిత సంస్థల గుర్తింపును రద్దు చెయ్యాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## కోతులు బాబోయ్ కోతులు



చర్చ, సత్తుపల్లి: సత్తుపల్లి పట్టణంలో గల మారుతి నగర్ వాసులు కోతుల బెడద తట్టుకోలేక సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు.గత కొన్ని నెలలుగా కోతులు మారుతీ నగర్ లో నివసిస్తున్న మహిళలు, పిల్లలు, పెద్దలు అందరిపై దాడులు చేస్తూ భయాందోళనను సృష్టిస్తున్నాయి. కోతులు బారి నుంచి మమ్మల్ని రక్షించాలని మారుతీ నగర్ వాసులు పిల్లలు పెద్దలు మహిళలతోపాటుభారీ ర్యాలీ నిర్వహించి మున్సిపల్ కమిషనర్ నరసింహ కు వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ కమిషనర్ నరసింహ స్పందిస్తూ వెంటనే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

# మున్సిపాలిటీ కార్మికులు వేతనాల కొరకు నిరవధిక సమ్మె నోటీస్







చర్చ, సత్తుపల్లి:కల్లూరు మున్సిపాలిటీ కార్మికులు వేతనాలు కొరకు సమ్మె నోటీసులు మున్సిపాలిటీ కమిషనర్ కు మంగళవారం అందించారు. గత ఆరు నెలలుగా మున్సిపాలిటీ నూతనంగా ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ఆరు నెలలు పూర్తయిన కూడా వేతనాలు అందక పోవటంతో సమ్మె నోటీసును మున్సిపాలిటీ కార్యాలయంలో మేనేజర్ నాగేశ్వరరావుకు కార్మికులు అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు మాట్లాడుతూ మున్సిపాలిటీ కార్మికులకు గత ఆరు నెలలుగా పెండింగ్ 79 లక్షలు ఉండగా ఒక్కొక్కరికి 87000 రావాల్సి ఉంది కార్మికులు వేతనాలు రానందున అప్పుల పాలై కుటుంబాలు భారంగా మారాయని గతంలో జిల్లా కలెక్టర్ ,సబ్ కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే లకు, వినతి పత్రాలు ద్వారా తెలియపరచిన కూడా స్పందన లేకపోవడంతో మంగళవారం నిరవధిక సమ్మెకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేయడం జరిగిందని సుమారుగా 100 మంది కార్మికులు గత ఆరు నెలలుగా పస్తులు ఉంటూ కుటుంబం గడవక అప్పుల పాలై ఇబ్బందులు పడుతున్నారని 18వ తేదీ నుండి విధులు పూర్తిగా బహిష్కరిస్తూ సమ్మెకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. గత్యంతరం లేక నిరవధిక సమ్మెలోకి వెళ్ళటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దామాల దయాకర్ రావు జిల్లా నాయకులు మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఊడల కృష్ణమూర్తి కార్యదర్శి వజీర్మియా, ప్రకాష్, చింత పంటి శ్రీను, సుధాకర్, ప్రవీణ్ ,నరసింహారావు యశోద ,సీతమ్మ, చింతపల్లి శీను బాబు గౌడ్ మణిరాజు చార్లెస్సి చిన్న లతోపాటు తదితరులు కార్మికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సీపీఎం అభ్యర్థులను గెలిపించండి

- మోరంపూడి పాండురంగారావు(సిపిఎం జిల్లా కమిటి సభ్యులు)





చర్చ, సత్తుపల్లి:వేంసూరు మండలంలో వివిధ గ్రామాలలో గ్రామ పంచాయతీ ఎన్నికలలో పోటీ చేస్తున్న సీపీఎం అభ్యర్థులను ప్రజలు పార్టీలకతీతంగా గెలిపించాలని సీపీఎం జిల్లా కమిటి సభ్యులు మోరంపూడి పాండురంగారావు కోరారు.మంగళవారం వేంసూరు లోని ఎర్ర రామయ్య భవన%శీ%లో ఎలిగినేని రామారావు అధ్యక్షతన జరిగిన సీపీఎం మండల కమిటి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పాండురంగారావు మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే,కేరళ తరహా సుపరిపాలన,పేదరిక నిర్మూలన జరగాలంటే గ్రామస్థాయి నుండి కమ్యూనిస్టులను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని ఆ దిశగా ప్రజలు ఆలోచించాలని కోరారు.ఈ సమావేశంలో:మండల కార్యదర్శి అర్వపల్లి జగన్మోహన్ రావు,మండల కమిటి సభ్యులు మల్లూరు చంద్రశేఖర్,
మోరంపూడి వెంకటేశ్వరరావు,సీనియర్ నాయకులు కొత్తా సత్యనారాయణ,అర్వపల్లి వెంకటేశ్వరరావు,డంకర శ్రీను, కొత్తా అప్పారావు,ఎండిమండల వెంకటేశ్వరరావు,గడిపర్తి మోహన్ రావు,ఎలిగినేని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం (మాక్ డ్రిల్)



చర్చ, సత్తుపల్లి:సత్తుపల్లి పట్టణంలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించే కార్యక్రమములో బాగంగా మంగళవారం స్థానిక గుడిపాడు రోడ్డులో ఉన్నా మైనారిటీ గురుకుల కళాశాల యందు సత్తుపల్లి అగ్నిమాపక స్టేషన్ అధికారి వై.వెంకటేశ్వర్ రావు అధ్వర్యంలో విద్యార్థులకు, కళాశాల బోధన, బోధనేతర సిబ్బందికి మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ కార్యక్రమంలో ప్రమాదాలకు కారణాలు, నివారణ ప్రతిస్పందన ఏదైనా అగ్నిప్రమద అత్యవసర పరిస్థితిలో అప్రమత్తంగా,బాధ్యతాయుతంగా ఎలా వ్యవహరించడం అలాగే వంట గదిలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో కూడా ఈ కార్యక్రమంలో నొక్కి చెప్పారు.అగ్నిమాపక భద్రతా నియమ నిబంధనలపై ప్రజెంటేషన్, అగ్నిమాపక పరికరాలు కళాశాలలో ఉన్నా ఫైర్ సేఫ్టీ సెలెండర్స్ యొక్క ఉపయోగం ఇతర పరికరాల ప్రదర్శన,వాటి తరలింపులను మాక్ డ్రిల్ లో విద్యార్థులకు వివరించిచారు అనంతరం ఈ కార్యక్రమాం గురించి కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకటరామయ్య మట్లాడుతు అగ్ని భద్రతపై జ్ఞానం మరియు నైపుణ్యాలు విద్యార్థులు జీవితంలో ఎంతో సహాయపడుతుందని ప్రజలను రక్షించడానికి ప్రమాదాలను లెక్క చేయని అగ్నిమాపక సిబ్బంది నిస్వార్థ సేవకు సెల్యూట్ అని ప్రశంసించారు.ఈ కార్యక్రమములో అగ్నిమాపక సిబ్బంది ఇ.రమేష్ బాబు, ఎం. మోషేబాబు , వై. అనిల్‌కుమార్, కె. బాబురావు పాల్గొన్నారు .

# తల్లాడ గ్రామానికి గర్వకారణం కర్నాటి అనూషకు గోల్డ్ మెడల్



చర్చ ఖమ్మం :తల్లాడ, కీర్తిశేషులు నన్నపనేని వెంకటయ్య పెద్ద కూతురు, కర్నాటి అనూష, మైసూరు దత్తపీఠం నిర్వహించిన భగవద్గీత లోని 18 అధ్యాయాలు, 700 శ్లోకాల కంఠస్థ పోటీ పరీక్షలో అత్యున్నతమైన ఉత్తమశ్రేణి స్థానాన్ని దక్కించుకుని, అవధూత పూజ్య శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి చేతుల మీదుగా గోల్డ్ మెడల్ (బంగారు పతకం) అందుకున్నారు.
ఈ గొప్ప కృషికి పలువురు స్థానిక ప్రముఖులు, బిజెపి నాయకులు ఆపతి వెంకట రామారావు సహా ఇతరులు అనూష ని అభినందించారు. కార్యక్రమంలో భర్త కర్నాటి కిషోర్, తల్లి నన్నపనేని శారద హాజరాయినారు.
భగవద్గీత అధ్యయనం వృత్తిలో ప్రతిభ చూపిన ఈ యువతీ పట్టుదల, నిబద్ధత తల్లాడ గ్రామం పట్ల అదే గర్వకారణం కావడమే కాక, యువతకు మంచి ఆదర్శం చేయడం కూడా విశేషం.

# జిల్లా కలెక్టర్ ను సన్మానించిన టీఎన్జీవో



చర్చ : కరీంనగర్ :ప్రజాసేవ, పరిపాలన, వినూత్న కార్యక్రమాల రూపకల్పనలో చేసిన విశిష్ట కృషిని గుర్తిస్తూ కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రతిష్ఠాత్మక భారత్ గౌరవ్ అవార్డు ను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, చిన్నజీయర్ స్వామి చేతుల మీదుగా అందుకున్న సందర్భంగా టీఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టీఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పేదలు, అనాథలు, బలహీన వర్గాల కోసం కృషి చేస్తున్నాం జిల్లా కలెక్టర్ కు ఈ అవార్డు రావడం సంతోషకరమైన విషయమని అన్నారు.కరీంనగర్ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అనాధ బాలికకు వివాహం నిర్వహించడం మానవత్వానికి నిలువెత్తు ఉదాహరణగా నిలిచిందన్నారు.
“ శుక్రవారం సభ” పేరిట ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమం మహిళల అభ్యున్నతికి ఎంతో దోహదం చేస్తుందని తెలిపారు. మహిళ ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందనే భావనతో ఆరోగ్య మహిళా కార్యక్రమం ద్వారా మహిళలందరికీ 50 వేల ఖరీదైన ఉచిత వైద్య పరీక్షలు చేయించడం గొప్ప విషయమని అన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు నూతన ప్రోత్సాహం ఇస్తూ, మళ్లీ బడిబాట పట్టించే ప్రత్యేక మార్గదర్శక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. పనిచేసే ప్రాంతపు భాష, సంస్కృతులను స్వయంగా నేర్చుకుంటూ ప్రజల మనసుల్లో స్థానం సంపాదించిన అరుదైన అధికారిణి పమేలా సత్పతి గారేనని అన్నారు. బధిర విద్యార్థుల అవసరాలను అర్థం చేసుకోవడానికి స్వయంగా సైన్ లాంగ్వేజ్ నేర్చుకుని దివ్యాంగుల కోసం విశేష సేవలు అందిస్తున్నారని తెలిపారు.
కార్యక్రమంలో టీఎన్జీవోల జిల్లా అధ్యక్షకార్యదర్శులు దారం శ్రీనివాస్ రెడ్డి, సంఘం లక్ష్మణరావు, కోశాధికారి కిరణ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాగి శ్రీనివాస్, కార్యదర్శి సర్దార్ ఆర్మిందర్ సింగ్, తిరుమల శారద, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులుకార్యదర్శులు కోట రామస్వామి, శంకర్, లవ్ కుమార్, కమలాకర్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారులతో సమీక్ష సమావేశం మంత్రి పొన్నం ప్రభాకర్


- మున్సిపాలిటీ రాష్ట్రానికి ఆదర్శంగా తీర్చిదిద్దాలి.
- మున్సిపాలిటీ లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు,కమ్యూనిటీ హాల్ లు , ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులు వేగవంతం చేయాలి
- పనులు ప్రారంభించుకొని నెలలు గడుస్తున్న పూర్తి కాకపోవడం పై అసంతృప్తి.
- పెండింగ్ పనులు ,పూర్తయిన పనులు,ప్రతిపాదనలు చేసే పనులపై అధ్యాయానికి త్రిసభ్య కమిటీ
- మున్సిపాలిటీ అధికారులతో సమీక్ష సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్.





చర్చ:- హుస్నాబాద్ :
హుస్నాబాద్ రాష్ట్రంలోని ఆదర్శ మున్సిపాలిటీ గా నిలపడానికి అందరూ కష్టపడి పని చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పట్టణంలో పెండింగ్ పనులు, పూర్తయిన పనులు ఇతర అంశాలపై హుస్నాబాద్ మున్సిపాలిటీ కార్యాలయంలో అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.పట్టణంలో జరుగుతున్న సీసీ రోడ్లు , డ్రైనేజీ నిర్మాణాలు,కమ్యూనిటీ హాల్ లు , ఎల్లమ్మ చెరువు సుందరీకరణ , డివైడర్ ల మధ్య సెంట్రల్ లైటింగ్ ,మొక్కల పెంపకం ,జంక్షన్ ల సుందరీకరణ పనుల పురోగతి పై ఆరా తీశారు. పెండింగ్ పనుల ఆలస్యం పై మంత్రి పొన్నం ప్రభాకర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు పనులు ఆలస్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీసీ రోడ్ల పెండింగ్ పనులు డిసెంబర్ 31 లో పూర్తి చేయాలని గడువు విధించారు. ఎల్లమ్మ చెరువు సుందరీకరణ అభివృద్ధి పనులు మార్చ్ 31 లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. సిద్దేశ్వర ఆలయం వద్ద సీసీ రోడ్డు పనులకు టెక్నికల్ ఇష్యూ లేకుండా సమస్య పరిష్కారం చేయాలన్నారు. పద్మశాలి , గౌడ , బంజారా , మైనార్టీ , వైశ్య, విశ్వ బ్రాహ్మణ, రెడ్డి , మున్నూరు కాపు ,రజక, యాదవ కమ్యూనిటీ హాల్ లో పెండింగ్ లో ఉన్నాయని ఎస్సీ కమ్యూనిటీ హాల్ పనులు ప్రారంభం కావాల్సి ఉందని వాటి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రస్తుతం పట్టణంలో పూర్తయిన పనులు,ఇంకా పెండింగ్ లో ఉన్న పనులు,ప్రతిపాదనలు చేయాల్సిన వాటిపై త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేశారు.ఇందులో మున్సిపల్ అధికారితో పాటు ,రెవెన్యూ శాఖ నుండి ఒకరు ,ఆర్ అండ్ బి నుండి ఒకరు ఉంటారు. ఈ కమిటీ డిసెంబర్ 15 లోపు ఇచ్చే నివేదిక ద్వారా భవిష్యత్ లో చేయాల్సిన పనులు ఇంకా పెండింగ్ పనులు వేగవంతం చేయవచ్చని అధికారులకు మంత్రి దిశా నిర్దేశం చేశారు.మల్లె చెట్టు నుండి ఎల్లమ్మ చెరువు రోడ్డు పనులు ప్రారంభం కావాల్సి ఉందని తెలిపారు. హైవే మీద డివైడర్ల మీద సెంట్రల్ లైటింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. డివైడర్ల పై చెట్లు,జంక్షన్ ల వద్ద విగ్రహాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నెహ్రూ విగ్రహం వద్ద ఎత్తు పెంచి ఎత్తైన కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేసి సుందరీకరణ చేయాలని ఆదేశించారు. చిల్డ్రన్స్ పార్క్ ఏర్పాటు చేసి అందులో ఇన్నోవేటివ్ గేమ్స్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. హుస్నాబాద్ లో ఎక్కడ ఖాళీ ప్రదేశం ఉన్న పూల మొక్కలు నాటాలని సూచించారు. గతంలో భారీ వర్షాలు టౌన్ ముంపుకు గురయ్యేదని ఈసారి అంత భారీ వర్షం కురిసిన పట్టణంలో వచ్చిన నీరు వచ్చినట్టు వెళ్లేలా తీసుకున్న చర్యల ద్వారా ముంపుకు గురికాలేదని సిబ్బందిని అభినందించారు. స్టేడియంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని సూచించారు .పల్లె చెరువు బ్యూటిఫికేషన్ పూర్తి చేసి వాకింగ్ ట్రాక్ ,అలంకరణ మొక్కలు నాటాలని తెలిపారు. త్వరలోనే హుస్నాబాద్ మున్సిపాల్టీ కి రింగ్ రోడ్డు మంజూరు అవుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆశాభావం వ్యక్తం చేశారు.సమీక్షా సమావేశంలో ఆర్డీవో రామ్మూర్తి , మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్ ,ఇతర అధికారులు పాల్గొన్నారు.

# డిసెంబర్ 6, శనివారం రోజున శ్రీ మహాశక్తి దేవాలయంలో అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవం

- కావేటి పరమేశ్వర్ గురుస్వామి ఆధ్వర్యంలో వైభవంగా జరిగే పడిపూజకు ఏర్పాట్లు ప్రారంభం
- పడిపూజలో పాల్గొననున్న కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్.







చర్చ :- బ్యూరో కరీంనగర్ :కరీంనగర్ లోని ముగ్గురు అమ్మవార్లు శ్రీ మహాదుర్గ, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతిల మహిమాన్విత దివ్య క్షేత్రం లో ఈనెల (డిసెంబర్) 6వ తేదీన శ్రీ అయ్యప్ప స్వామి పడిపూజ ను నిర్వహించనున్నారు. శ్రీ శ్రీ శ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ విద్యారణ్య భారతి స్వామి దివ్య ఆశీస్సులతో ఇట్టి పడిపూజ మహోత్సవ వేడుకలను కావేటి పరమేశ్వర్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించడానికి ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. 6 వ తేదీ శనివారం సాయంత్రం 6 గం.లకు జరిగే పడిపూజ కార్యక్రమంలో కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ పాల్గొననున్నారు. పడిపూజ అనంతరం స్వాములకు అల్పాహారం అందించడానికి తగిన ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. సమస్త జీవకోటిలో మానవజన్మ శ్రేష్టమైనది. తన జన్మను సార్థకత చేసుకోవాలంటే, ముక్తిని సాధించాలనే ఉద్దేశంతో తీసుకునే దీక్ష "అయ్యప్ప స్వామి" దీక్ష. కలియుగంలో ఉత్తమమైన దీక్షగా భావించి కఠిన నియమాలను అనుసరిస్తూ బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ నియమనిష్ఠలతో దీక్షను కొనసాగిస్తూ స్వామిని దర్శించే గొప్ప దీక్ష , గురు స్వామి మాటపై గురి కలిగి ఉండే దీక్ష , గురువుపై భక్తిని కలిగి ఉండే దీక్ష , బ్రహ్మ, విష్ణు, శివుల ప్రతిరూపముగా భావించి గురువు పైన విశ్వాసం కలిగి ఉండే దీక్ష "అయ్యప్ప స్వామి దీక్ష" , కులము, మతము, జాతి అనే భేదం లేకుండా తీసుకునే ఏకైక దీక్ష "అయ్యప్ప దీక్ష". శ్రీ అయ్యప్ప స్వామి కరుణాకటాక్షాలు సమస్త భక్తజనులు, అయ్యప్ప దీక్షపరుల పట్ల ఉండాలనే సంకల్పంతో శ్రీ మహాశక్తి దేవాలయంలో చేపట్టనున్న ఈ పడిపూజ మహోత్సవ వేడుకకు హిందూ బంధువులందరూ తరలివచ్చి ఆ స్వామి కృపకు పాత్రులు కాగలరని ఆలయ నిర్వాహకులు కోరారు.

# డబుల్ బెడ్ రూమ్ లను పరిశీలించిన బి ఆర్ ఎస్ నాయకులు

- ఈ రోజున హుస్నాబాద్ పట్టణంలోని డబుల్ బెడ్ రూమ్ లను బి ఆర్ యస్ పార్టీ ఆధ్వర్యంలో పరిశీలించి నిరసన చేయడం జరిగింది
- డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించాలి
- డబుల్ బెడ్ రూమ్ కాలనీ లో విధి దీపాలను ఏర్పాటు చేయాలి డబుల్ బెడ్ రూమ్ కాలనీ సమస్య లను పట్టించుకొని మున్సిపల్ అధికారులు
- పెండింగ్ నిర్మాణం లో ఉన్న డబల్ బెడ్ రూమ్ పనులను ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలి.
- బి ఆర్ యస్ పార్టీ హుస్నాబాద్ నియోజకవర్గ అధికార ప్రతినిధులు సూద్దాల చంద్రయ్య అయిలేని మల్లికార్జున రెడ్డి





చర్చ:- హుస్నాబాద్:హుస్నాబాద్ పట్టణం లోని డబుల్ బెడ్ రూమ్ కాలనీ లబ్ధిదారుల సమస్యలను మున్సిపల్ అధికారులు వెంటనే పట్టించుకోని పరిష్కారించాలని బి ఆర్ యస్ పార్టీ కోరుతుంది కాలనీ లో డ్రైనేజి వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారు అవడం తో కాలనీ వాసులు మురుగునీరుతో దుర్వాసనతో బాధ పడుతున్నారు హుస్నాబాద్ పట్టణానికి దాదాపు రెండు కిలోమీటర్ల దూరం లో డబుల్ బెడ్ రూమ్ కాలనీ ఉంది కాలనీ ను%శీ%డి ప్రజలు పట్టణానికి రాత్రి వేళలో వెళ్ళాలి అంటే చిమ్మని చీకటిగా ఉండడం వలన కాలనీ వాసులు భయపడుతున్నారు అదేవిధంగా కాలనీ లో పారిశుద్ధం పూర్తిగా పడకేసింది పారిశుద్ధాన్ని పట్టించుకునే పరిస్థితిలో మునిసిపల్ అధికారులు లేరు కనీసం కాలనీ వైపు కన్నెత్తి చూడని పరిస్థితి ఉంది పెండింగ్ లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ల నిర్మాణం పనులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి గా విస్మరించింది లబ్ధిదారులు ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్న కనికరించే పరిస్థితి కనీసం హుస్నాబాద్ నియోజకవర్గం లో ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్ర మంత్రివర్గంలో ఉన్న గౌరవ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గారు పెండింగ్లో ఉన్న నిర్మాణ పనులు పూర్తి చేయించలేకపోతున్నారు ఇల్లు లేని నిరుపేదలకు నీడ అందించడానికి బి ఆర్ యస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ పథకం తీసుకొస్తే కాంగ్రెస్ ప్రభుత్వం డబుల్ బెడ్ పథకాన్ని పట్టించుకుండా రద్దు చేసింది కనీసం పెండింగ్ లో నిర్మాణం పనులను కూడా పూర్తి చేయలేకపోతుంది డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో చివరికి లబ్దిదారులే సొంత డబ్బులు పెట్టుకొని పెండింగ్ పనులను పూర్తి చేసుకొని డబుల్ బెడ్ రూమ్ లలో ఉండే పరిస్థితి కి వచ్చింది అంటే కాంగ్రెస్ ప్రభుత్వనికి పేద ప్రజలపై ఎంత ప్రేమ ఉందో స్పష్టంగా కనబడుతుంది అధికారం ఉన్నదని ఇష్టారాజ్యంగా వ్యవహరించి పేద ప్రజలను పట్టించుకోకపోతే అవసరం వచ్చినప్పుడు తప్పకుండా ప్రజలు తగిన తీర్పు చెప్పుతారు ఈ కార్యక్రమం లో బి ఆర్ యస్ పార్టీ అధికార ప్రతినిధులు సుద్దాల చంద్రయ్య అయిలేని మల్లికార్జున రెడ్డి బి ఆర్ఎస్ పార్టీ యూత్ విభాగ పట్టణ అధ్యక్షులు మేకల వికాస్ యాదవ్ నాయకులు జెరిపోతుల లక్ష్మణ్ సునీత మరియు డబుల్ బెడ్ రూమ్ కాలనీ వాసులు పాలుగోన్నారు.

# నూతన జాతీయ కార్యవర్గ సభ్యులుగా బోడ లక్ష్మణ్



చర్చ:- హుస్నాబాద్:అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 71వ జాతీయ మహాసభలు భగవాన్ బిర్సా ముండా నగర్, డెహ్రాడూన్, ఉత్తర?ండ్ రాష్ట్రంలో నవంబర్ 28 నుండి 30 తేదీలలో విజయవంతంగా పూర్తి చేసుకోవడం జరిగింది.

ఈ సందర్భంగా ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు బోడలక్ష్మణ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కూడా ఇలాంటి మహాసభలు విద్యార్థి పరిషత్ దేశవ్యాప్తంగా ఒక్కొక్క రాష్ట్రంలో నిర్వహించడం జరుగుతుంది. ఈసారి ఈ జాతీయ మహాసబలకు 1,500 మంది ప్రతినిధులు దేశవ్యాప్తంగా పాల్గొనడం జరిగింది. ఈ సభలో జాతీయస్థాయిలో విద్యారంగం పైన జరుగుతున్న అవినీతి అక్రమాలపై తీర్మానం చేయడం జరిగింది. అదేవిధంగా నూతన జాతీయ కమిటీని కూడా ఎన్నుకోవడం జరిగింది. నాకు ఈ కమిటీలో బాధ్యత ఇచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. నేను మహబూబాబాద్ జిల్లాకు చెందిన విద్యార్థిని. 2014 నుండి నాకు పరిచయం నేను పూర్తి చేశాను2014 నుండి కార్యకర్త 2019 నుండి పూర్తి సమయ కార్యకర్తగా పనిచేస్తున్నాను.

గతంలో నిర్వహించిన బాధ్యతలు.వరంగల్ మహానగర కార్యాలయ కార్యదర్శిగా, వాగ్దేవి నగర్ సహజోనల్ ఇన్చార్జిగా, జోనల్ ఇన్చార్జిగా,రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, వరంగల్ మహానగర కార్యదర్శిగా, నల్గొండ నగర,జిల్లా సంఘటన మంత్రిగా, నల్గొండ,సూర్యపేట రెండు జిల్లాల సంఘటన మంత్రిగా, నల్గొండ విభాగ్ సంఘటన మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం మెదక్ విభాగ్ సంఘటన మంత్రి గా పని చేస్తున్నారు.కేంద్రం సంగారెడ్డిఈ 71 వ జాతీయ మహాసభలలో నాపై నమ్మకం ఉంచి నాకు జాతీయ కార్యవర్గ సభ్యులు బాధ్యత ఇచ్చిన జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ రఘురాజ్ కిషోర్ తివారి, బాలకృష్ణ జీ,శివకుమార్ జీ,డాక్టర్ మాసడి బాబురావు, రాష్ట్ర అధ్యక్షులు జానారెడ్డి, తోట లవన్, విష్ణు, రాజశేఖర్ గారికి, తెలంగాణ రాష్ట్ర కమిటీకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది.

# పార్క్ లో జింకల పై కాల్పులు జరిపిన వేటగాళ్లు అరెస్ట్







● వన్యప్రాణుల వేటగాళ్ల అరెస్టు రిమాండ్ తరలింపు

చర్చ, సత్తుపల్లి:సత్తుపల్లి నీలాద్రి అర్బన్ పార్కులో అటవీ ప్రాంతంలో అక్రమ వేట కార్యకలాపాలు జరుగుతున్నాయనే విశ్వసనీయ సమాచారం ఆధారంగా, జిల్లా టాస్క్ ఫోర్స్ సత్తుపల్లి అటవీ శాఖ అధికారులు సిద్ధార్థ విక్రమ్ సింగ్, మంజుల, నేతృత్వంలో సంయుక్తంగా ప్రత్యేక దాడి నిర్వహించారు. ఈ దాడులలో, అధికారులు నేరస్థులను గుర్తించి అరెస్టు చేశారు. అక్రమ వేటకు సంబంధించిన కీలక ఆధారాలను పొందారు.

అరెస్టు కేసుల నమోదుఈ కేసులో ఇప్పటివరకు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ఫారెస్ట్ యాక్ట్1967, వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్1972లోని సంబంధిత విభాగాల కింద వారిపై కేసులు నమోదు చేయబడ్డాయి.

**తదుపరి రిమాండ్ తరలింపు..**

ప్రాథమిక దర్యాప్తులో, ఈ అక్రమ వేట సంఘటన లో మరికొంతమంది పాల్గొన్నట్లు తేలింది. వారిని గుర్తించి అరెస్టు చేయడానికి తదుపరి, కొనసాగుతున్న విచారణ జరుగుతోంది. అరెస్టు చేసిన నిందితులను సత్తుపల్లి ఎఫ్‌డిఓ కార్యాలయంలో హాజరుపరిచి, చట్టపరమైన విధానాల ప్రకారం కోర్టులో హాజరుపరిచారు.ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, సత్తుపల్లి ఆదేశాల మేరకు నిందితులను 12.12.2025 వరకు రిమాండ్‌కు తరలించారు.ఈ కేసు లో అటవీ శాఖ సిబ్బంది టాస్క్‌ఫోర్స్ సభ్యులు పాల్గొన్నారు,...

డిఎఫ్ఓ హెచ్చరికఅక్రమ వేట, అడవి జంతువులను చంపడం, అటవీ వనరులను నాశనం చేయడం వంటి చర్యలపై అటవీ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని డిఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్ సింగ్, ఐఎఫ్ఎస్, ఖమ్మం తెలిపారు.

అటవీ ప్రాంతాల్లో ఇలాంటి అనుమానాస్పద లేదా చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే అటవీ శాఖ సిబ్బంది కి తెలియజేయాలని ప్రజలకు తెలిపారు....

# హుస్నాబాద్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన





చర్చ:- హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలో బుధవారం రోజున బహిరంగ సభలో పాల్గొననున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.కార్యక్రమంలో పాల్గొననున్న మంత్రులు , ఎమ్మెల్యేలు , ఎమ్మెల్సీలు ,కార్పొరేషన్ చైర్మన్లు , డీసీసీ అధ్యక్షులు ,పార్టీ ముఖ్య నేతలు.ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా హుస్నాబాద్ లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు .ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసే అభివృద్ధి కార్యక్రమాలు హుస్నాబాద్ లో శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ కి ,(అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్), యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్,గిరిజన గ్రామాలకు కనెక్టివిటీ రోడ్లు , హుస్నాబాద్ మున్సిపాలిటీ పలు అభివృధి కార్యక్రమాలకు, అధునాతన డ్రైవింగ్ ట్రాక్ తో కూడిన ఆర్టీఏ కార్యాలయానికి , ఇందిరా మహిళా శక్తి బజార్ కు ,ఉమ్మాపూర్ లో అర్బన్ ఫారెస్ట్ పార్క్ ,హుస్నాబాద్ టూ అక్కన్నపేట వరకు 4 లేన్ రోడ్డుకు , రాజీవ్ రహదారి నుండి కొత్తపల్లి , హుస్నాబాద్ వరకు 4 లేన్ రోడ్డుకు శంకుస్థాపన చేస్తారు.అనంతరం హుస్నాబాద్ అక్కన్నపేట రోడ్డులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి .బహిరంగ సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఇప్పటికే హుస్నాబాద్ పట్టణంలో కాంగ్రెస్ జెండాలు , కటౌట్ల తో అందంగా అలంకరణ.బహిరంగ సభకు భారీ %ూజుణ% స్క్రీన్ లు ,పార్కింగ్ ప్రదేశాలు .సభకి తరలి వచ్చే జనాలకు మంచి నీటి సౌకర్యం, మొబైల్ టాయిలెట్స్ వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు.

# సోదరుడి హత్య: ఇన్సూరెన్స్ డబ్బుల కోసం ఘోరం

● రోడ్డు ప్రమాదంలా చిత్రీకరించేందుకు యత్నం ముగ్గురు నిందితుల అరెస్ట్

● కరీంనగర్ పోలీసు కమీషనర్ గౌష్ ఆలం







చర్చ,:- బ్యూరోలికరీంనగర్ :ఆర్థిక ఇబ్బందుల ఊబిలో కూరుకుపోయిన ఓ వ్యక్తి, ఏకంగా తన అన్ననే అత్యంత కిరాతకంగా హత్య చేసి, దాన్ని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి, పెద్ద మొత్తంలో ఇన్సూరెన్స్ డబ్బులు కొట్టేయాలని పన్నిన కుట్రను కరీంనగర్ జిల్లా పోలీసులు ఛేదించారు. రామడుగు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ కేసులో, ప్రధాన నిందితుడితో సహా ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

■ రూ. 1.50 కోట్ల అప్పులు, రూ. 4.14 కోట్ల ఇన్సూరెన్స్

రామడుగు గ్రామానికి చెందిన మామిడి నరేష్ (30) వ్యాపారాల్లో, ముఖ్యంగా షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి సుమారు రూ. 25 లక్షలు నష్టపోయాడు. టిప్పర్ వాహనాల %జువీ×%లు సహా మొత్తంగా రూ. 1.50 కోట్ల అప్పుల్లో చిక్కుకున్నాడు. ఈ అప్పుల నుంచి బయటపడేందుకు నరేష్ దుర్మార్గమైన ప్లాన్ చేశాడు.

నరేష్ తన అన్న, మానసిక పరిపక్వత లేని మామిడి వెంకటేష్ (37) పేరుపై ఏకంగా రూ. 4 కోట్ల 14 లక్షల విలువైన పలు ఇన్సూరెన్స్ పాలసీలు తీసుకున్నాడు. ఇందులో ఐసీఐసీఐ, ఆదిత్య బిర్లా, టాటా ఏఐజీ, ఎస్‌బీఐ లైఫ్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ వంటి సంస్థల నుంచి ఒక్కొక్కటి కోటికి పైగా విలువైన పాలసీలు ఉన్నాయి. దీంతో పాటు, అన్న పేరుపై రూ. 20 లక్షల గోల్డ్ లోన్ కూడా తీసుకున్నాడు. వెంకటేష్ చనిపోతే ఇన్సూరెన్స్ డబ్బులు వస్తాయి, లోన్ మాఫీ అవుతుంది అనే దురుద్దేశంతో ఈ ఘాతుకానికి తెగబడ్డాడు.

■ ప్లాన్ అమలు టిప్పర్‌తో హత్య

ఈ కుట్రలో తన స్నేహితుడు నముండ్ల రాకేశ్ (సహాయం చేసిన వ్యక్తి), టిప్పర్ డ్రైవర్ మునిగాల ప్రదీప్‌ను భాగం చేశాడు. ఈ ప్లాన్‌కు సంబంధించిన చర్చల వీడియోను రాకేశ్ తన ఫోన్‌లో భద్రపరిచాడు.

■ తేదీ 29-11-2025 రాత్రి, ప్లాన్ ప్రకారం...

డ్రైవర్ ప్రదీప్ టిప్పర్ మట్టి లోడ్‌తో రామడుగు శివారులోని భారత్ పెట్రోల్ పంప్ వద్దకు తీసుకొచ్చాడు.

ముందుగా అనుకున్నట్లుగా, బ్రేక్ డౌన్ అయినట్లు నటించి, నరేష్‌కు ఫోన్ చేశాడు. నరేష్ తన అల్లుడు సాయి ద్వారా వెంకటేష్‌ను జాకీ ఇచ్చి టిప్పర్ వద్దకు "జాకీ పెట్టాలి" అనే సాకుతో పంపాడు. నరేష్ అక్కడికి చేరుకున్నాక, టిప్పర్ స్టార్ట్ చేసి ఉంచి, జాకీని టైర్ కింద పెట్టి తిప్పమని తన అన్న వెంకటేష్‌కు చెప్పాడు. వెంకటేష్ సెల్ ఫోన్ లైట్ పెట్టుకొని జాకీ తిప్పుతుండగా, నరేష్ స్వయంగా టిప్పర్‌ను నడిపి, జాకీ తిప్పుతున్న అన్న వెంకటేష్ పైకి ఎక్కించాడు. దీంతో వెంకటేష్ అక్కడికక్కడే మరణించాడు.డ్రైవర్ ప్రదీప్‌ను పారిపోవాలని చెప్పి, నరేష్ దీన్ని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు.

■ అల్లుడి సాక్ష్యంతో ఛేదన

వెంకటేష్ మృతిపై నరేష్ కుటుంబ సభ్యులకు, పోలీసులకు డ్రైవర్ యాక్సిడెంట్ చేశాడని చెప్పగా, నరేష్ అల్లుడు సాయి... టిప్పర్‌ను నడిపింది నరేషే అని తన తండ్రి మామిడి నర్సయ్యకు చెప్పాడు. దీంతో నర్సయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేశారు. మృతదేహ పంచనామా, స్థల పరిశీలన, సాక్ష్యాల సేకరణ అనంతరం, ప్రమాద ఘటనపై అనుమానాలు కలగడంతో పోలీసులు విచారణను వేగవంతం చేశారు. ఈ రోజు (02-12-2025) ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా, వారు నేరాన్ని అంగీకరించారు.

నిందితుల నుంచి హత్య కుట్ర వీడియో ఉన్న మొబైల్ ఫోన్, ఇన్సూరెన్స్ పాలసీలు, బ్యాంకు పాస్ బుక్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఏ.సి.పి శ్రీ విజయ కుమార్ గారి ఆధ్వర్యంలో, ఇన్స్ పెక్టర్ శ్రీ ప్రదీప్ కుమార్, ఎస్.ఐ. శ్రీ రాజు మరియు సిబ్బంది ఈ కేసును ఛేదించడంలో కృషి చేశారు. వీరిని కరీంనగర్ కమిషనర్ ఆఫ్ పోలీస్ అభినందించారు. నిందితులపై సంబంధిత సెక్షన్లలో కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించారు. మరిన్ని సాంకేతిక ఆధారాల కోసం దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

## గ్రామ పంచాయతీ ఎన్నికలలో సీపీఎం పోటీ





చర్చ, సత్తుపల్లి:వేంసూరుమండల పరిధి లోని మర్లపాడు,వేంసూరు గ్రామాలలో గ్రామ పంచాయతీ ఎన్నికలలో సీపీఎం పోటీ చేస్తుందని సీపీఎం మండల కమిటి సభ్యులు మల్లూరు చంద్రశేఖర్ తెలిపారు మంగళ వారం జరిగిన ఆయా గ్రామాల సీపీఎం శాఖల సమావేశాలలో పాల్గొన్న మల్లూరు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం అవిశ్రాంతంగా రాజీలేని పోరాటం చేసేది సీపీఎం అనుబంధ సంఘాలేనని ప్రజలు గుర్తించాలని కోరారు. ఈ సమావేశాలలో:దంకర శ్రీను,మోరంపూడి వెంకటే శ్వరరావు, సాధు శరత్ బాబు,బొందల యాకోబు,మల్లూరు వెంకటేశ్వరీ,రాణిరుద్రమ్మదేవి,బూరుగు శ్రీదేవి,బంక ఏసు తదితరులు పాల్గొన్నారు.

## రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు : ఎస్ఐ



చర్చ:- అశ్వారావుపేట :స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎవ్వరైనా సోషల్ మీడియా ద్వారా వివాదాస్పదంగా రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సోషల్ మీడియాలో ప్రత్యర్థులపై రెచ్చ గొట్టే వ్యాఖ్యలు చేస్తూ పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా దుష్ప్రచారం చేసే వ్యక్తులపై చట్టపరంగా చర్యలు ఉంటాయని ఏదైనా ఇతరులకు హాని కలిగించే పోస్టులు షేర్ చేసిన నేరంగా పరిగణించి గ్రూప్ అడ్మిన్ కూడా బాధ్యులనుగా చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కనుక సోషల్ మీడియా లో ప్రచారం చేసే వ్యక్తులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సూచించారు. ప్రస్తుతానికి సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న వాటిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎవ్వరుకూడా నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా జాగ్రత్తలు పాటించాలని అశ్వారావుపేట ఎస్ఐ యాయతిరాజు పేర్కొన్నారు.

అదే విధంగా గ్రామాల్లో గొలుసుకట్టు దుకాణాలు నిర్వహించే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

## 9 న జరిగే ఐక్య క్రిస్మస్ సంబరాలకు రండి

● మంత్రి పొంగులేటి కు ఆహ్వానం...

● ఏఐసిసి రాష్ట్ర అధ్యక్షులు ఎనోష్ కుమార్...



చర్చ, సత్తుపల్లి:కల్లూరు లో డిసెంబర్ 9న జరిగే ఐక్య క్రిస్మస్ సంబరాలకు తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని రావాలని నారాయణపురం తన నివాస గృహంలో ఏఐసిసి రాష్ట్ర అధ్యక్షులు ఎనోష్ కుమార్ తన బృందముతో ఆహ్వానాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎనోష్ కుమార్ మాట్లాడుతూ ఐక్య క్రిస్మస్ సంబరాలకు అంతర్జాతీయ సువార్తికులు యంగ్ హెూలీ టీం వ్యవస్థాపకులు డాక్టర్ జాన్ వెస్లీ రానున్నారనీ తెలిపారు. ఏఐసీసీ నాయకులు ప్రేమ పూర్వక ఆహ్వానాన్ని అందించడంతో వారు సానుకూలంగా స్పందించి క్రిస్మస్ సంబరాలకు వస్తానని వారు చెప్పడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రేయర్ సెల్ జిల్లా అధ్యక్షులు టి నిర్మల్ కుమార్, మీడియా సెల్ జిల్లా అధ్యక్షులు దాసరి డేవిడ్ రాజు, మండల అధ్యక్షులు టి ఎబినేజర్, ఉపాధ్యక్షులు పెరుమాళ్ళ దయాకర్, ప్రధాన కార్యదర్శి మోదుగు జాన్ పరంజ్యోతి, సలహాదారులు తేల్లూరి సంజీవరావు, సుందర్ రాజు, సమర్పణ పాల్, జీవన్ కుమార్, ఐక్య క్రిస్మస్ సంబరాల కోశాధికారి ఆదూరి రాజశేఖర్ పలువురు పాల్గొన్నారు.

## గెలుపుని తలపించిన ఎన్నికల ప్రచారం

### నంద తండాలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మంగీలాల్ భారీ ర్యాలీ





చర్చ, చుంచుపల్లి :చుంచుపల్లి మండలం నంద తండ గ్రామపంచాయతీ ఎన్నికల వేళ రాజకీయ రంగం వేడెక్కింది. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి అజ్మీరా మంగీలాల్ భారీ ర్యాలీతో ప్రచారానికి నాంది పలికారు. గ్రామంలోని ముఖ్య వీధులంతా జనసంద్రంగా మారాయి. మహిళలు, యువత, పెద్దలు అందరూ కలిసి మంగీలాల్ కు మద్దతుగా ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ చివర్లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన అజ్మీరా మంగీలాల్, ఒక్కసారి గెలిపించండి అభివృద్ధి ఎలా ఉండాలో నేను చూపిస్తా. మీ నమ్మకాన్ని నా పనితో నిలబెట్టుకుంటా" అని తెలియచేశారు.గ్రామ అభివృద్ధి, తాగునీటి సమస్యలు, రోడ్ల మరమ్మత్తులు, వీధి దీపాలు, డ్రైనేజీ సమస్యలు, కోతుల బెడద, వీధి కుక్కల బెడద వంటి సమస్యలు త్వరితకాలంలోనే పరిష్కరిస్తా. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా అధికారులతో సంప్రదింపులు వంటి అనేక అంశాలపై వివరమైన ప్రణాళికను ప్రజలకు తెలియజేశారు. రాబోయే సంవత్సరాల్లో నంద తండా పూర్తి మార్పు దిశగా తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ర్యాలీ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు నినాదాలతో ఉత్సాహాన్ని రెట్టింపు చేశారు. నంద తండా పంచాయతీ ఎన్నికల్లో మంగీలాల్ ర్యాలీతో కాంగ్రెస్ కు కొత్త ఊపు చోటుచేసుకుంది. ఈ కార్యక్రమంలో అజ్మీర మంగీలాల్ తో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంతోటి పాల్ పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు.

# ఎడ్యుకేషన్, ఇరిగేషన్ అభివృద్ధితో తెలంగాణ అగ్రగామిగా ఎదుగుదల సీఎం రేవంత్ రెడ్డి

- సీతారామ ఎత్తిపోతల పథకం పెండింగ్ పనులు పూర్తి చేస్తాం
- డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- ఎడ్యుకేషన్, ఇరిగేషన్ అభివృద్ధితో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా ఎదుగుతుందని రాష్ట్ర
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.











**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇంచార్జి మంత్రి వర్యులు వాకాటి శ్రీహరి, వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు, రెవెన్యూ హౌసింగ్ శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపిలు బలరాం నాయక్, రామ సహాయం రఘురాం రెడ్డిలతో కలిసి పర్యటించారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి గారికి కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పి బి. రోహిత్ రాజు ఘన స్వాగతం పలికారు. కొత్తగూడెంలో నెలకొల్పిన డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల మద్దతుకు ఏర్పడ్డ ప్రజా ప్రభుత్వం రెండు సంవత్సరాలు గడుస్తున్న నేపథ్యంలో డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు మీద కొత్తగూడెం జిల్లాలో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. గతంలో కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ కోసం వందల ఎకరాల భూమి రైతులు ఇస్తే స్థానికులకు కాకుండా ఇతర ప్రాంతాల వారికి ఉపాధి లభించడంతో మొట్టమొదటిసారి తెలంగాణ ఉద్యమానికి పునాదులు పడింది పాల్వంచ ప్రాంతంలోనని, తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి ఈ ప్రాంతం అందించిందని అన్నారు. 60 సంవత్సరాల తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన ప్రధాని మన్మోహన్ సింగ్ పేరు ఈ విశ్వ విద్యాలయానికి పెట్టుకోవడం సంతోషంగా ఉందని అన్నారు.
భారతదేశ మొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశం అభివృద్ధి చెందడానికి ఎడ్యుకేషన్, ఇరిగేషన్ పాలసీ అమలు చేశారని, ప్రస్తుతం దేశంలో ఉన్న గొప్ప విశ్వ విద్యాలయాలు, ఇరిగేషన్ ప్రాజెక్టులు ఆనాటి ప్రధానమంత్రినెహ్రూ ప్రారంభించినవి అని అన్నారు.
బాక్రానంగల్ నుంచి నాగార్జునసాగర్ వరకు, శ్రీశైలం నుంచి శ్రీరామ్ సాగర్ వరకు నీటి పారుదల ప్రాజెక్టులను జవహర్ లాల్ నెహ్రూ నిర్మించారని తెలిపారు. దేశం మొదటి ప్రధాని స్ఫూర్తితో ఎడ్యుకేషన్, ఇరిగేషన్ తెలంగాణను దేశ పటం మీద మొదటి స్థానంలో నిలుపుతుందని తమ ప్రభుత్వం బలంగా విశ్వసిస్తుందని అన్నారు. ఖమ్మం జిల్లాలో ఉన్న అపారమైన ఖనిజ సంపదను గుర్తించి వాటి మీద పరిశోధనలు జరగాలని ఎర్త్ యూనివర్సిటీ కొత్తగూడెంలో పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. కొత్తగూడెంకు వైద్య కళాశాల, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి యంగ్ ఇండియా సమీకృత గురుకుల నిర్మాణం వంటి గొప్ప విద్యాలయాలను ఖమ్మం జిల్లాకు అందించాలని లక్ష్యంతో ముందుకు పోతున్నామని అన్నారు.
గోదావరి, కృష్ణ జలాలు ఖమ్మం జిల్లాకు వస్తాయని, ఇక్కడ ప్రాజెక్టులను పూర్తి చేసి రైతుల పొలాలకు నీరు ఇవ్వాలని ప్రభుత్వం సంకల్పించిందని, సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయడంతో పాటు పెండింగ్ ఉన్న మిగిలిన అన్ని ప్రాజెక్టులు పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. రాష్ట్ర పాలనకు ఆయువు పట్టు ఖమ్మం జిల్లాలో ఉందని, ఇక్కడ మంత్రులు అనుకుంటే సాధించలేనిది ఏమీ ఉండదని అన్నారు. ప్రజలకు రేషన్ కార్డు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ చీరలు ఇటువంటి అనేక కార్యక్రమాలను ఖమ్మం జిల్లా నుంచి ప్రారంభించామని అన్నారు. భద్రాద్రి శ్రీ రామ చంద్రుని సాక్షిగా ఖమ్మం జిల్లాను అభివృద్ధి చేసే బాధ్యతను తీసుకుంటున్నట్లు సీఎం తెలిపారు.
ప్రజలు వేసిన ఓటు ఫలితంగా రెండు సంవత్సరాల కాలంలో మంచి పాలన అందిస్తున్నామని తెలిపారు. గ్రామ సర్పంచ్ ఎన్నికలలో మంచి అభ్యర్థులను, పని చేయగలిగే వారిని ఎన్నుకోవాలని, డబ్బులకు మద్యం బాటిళ్లకు, ప్రలోభాలకు లొంగవద్దని సీఎం రేవంత్ రెడ్డి పిలుపు నిచ్చారు. డిసెంబర్ 8, 9 తేదీలలో జరిగే తెలంగాణ విజయోత్సవాలు, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమానికి ప్రధానమంత్రి రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, ప్రధాన మంత్రులను ఆహ్వానించేందుకు ఢిల్లీ వెళుతున్నానని, మరోసారి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వస్తానని, ఇక్కడ ప్రజలు అందించే ప్రేమ పూర్వకమైన స్వాగతం తనకు చాలా ఉత్సాహాన్ని ఇస్తుందని సీఎం తెలిపారు.
డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రభుత్వం ఇక్కడ ఏర్పాటు చేస్తుందని, భూమి పరిసరాలు, భూమి లోపల ఉన్న ఖనిజాల గురించి విశ్వవిద్యాలయంలో పరిశోధనలు జరుగుతాయని, ప్రపంచానికి జ్ఞానాన్ని అందించే విద్యాలయం లకు నేడు తొలి అడుగు వేసామని అన్నారు. దేశానికే దిక్సూచిగా తెలంగాణ రాష్ట్రం నిలుస్తుందని, ఎర్త్ సైన్స్ యూనివర్సిటీకి అవసరమైన వసతులు వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని అన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ, దేశానికే తలమానికంగా ఎర్త్ సైన్స్ విశ్వవిద్యాలయం డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు మీద కొత్తగూడెం జిల్లాలో ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. దేశంలో వినూత్న విశ్వవిద్యాలయాన్ని ఉమ్మడి ఖమ్మం జిల్లాకు కేటాయించి నందుకు ప్రజల తరఫున సీఎంకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగూడెం జిల్లాకు గోదావరి జలాలు, విద్యుత్ కేంద్రం రావాలని అన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం పూర్తి చేసేందుకు అదనంగా నిధులు మంజూరు చేశారని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెంకు విమానాశ్రయం ఏర్పాటు చేయాలని అన్నారు. రెవెన్యూ హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసిన ఆనాటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరిట ఎర్త్ సైన్స్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాల కాలంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తున్నామని, ప్రజలు పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వానికి తమ ఆశీర్వాదాలు అందించాలని అన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివరావు మాట్లాడుతూ, కొత్తగూడెం నియోజక వర్గంపై ప్రత్యేకమైన ప్రేమతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న, ఎర్త్ యూనివర్సిటీని ఈ ప్రాంతానికి ఇచ్చినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయని, 800 మెగా వాట్ల విద్యుత్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ఇటీవల క్యాబినెట్ ఆమోదం లభించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు విద్యా చందన, వేణుగోపాల్, ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్టా రాగమయి, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, ఆర్డీఓ మధు, ప్రిన్సిపాల్ జగన్మోహన్ రాజు, ప్రొఫెసర్లు, విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి






- అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

**చర్చ :- బ్యూరో కరీంనగర్ :** గ్రామపంచాయతీ ఎన్నికల నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం గ్రామపంచాయతీ ఎన్నికల నోడల్ అధికారులతో ఇప్పటివరకు తీసుకున్న చర్యలు, పోలింగ్ వరకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలలో ఎలాంటి పొరపాట్లకూ తావివ్వకుండా, పారదర్శకంగా సజావుగా నిర్వహించాలని అన్నారు. ఎన్నికలకు అవసరమైన అన్ని మెటీరియల్స్ సిద్ధంగా ఉండాలన్నారు. మొదటి విడత పోలింగ్ డిసెంబర్ 11న ,రెండవ విడత పోలింగ్ డిసెంబర్ 14 న, మూడో విడత పోలింగ్ డిసెంబర్ 17న జరగనున్న దృష్ట్యా పిఓ ,ఏపిఓలకు, సూక్ష్మ పరిశీలకులకు మరోసారి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. నోడల్ అధికారులు అవసరమైతే వారి కార్యాలయం నుండి లేదా ఇతర సిబ్బందిని సహాయకులుగా నియమించుకోవాలన్నారు. ఈ సందర్భంగా బ్యాలెట్ పేపర్ల ముద్రణ, మెటీరియల్ మేనేజ్మెంట్, ఎన్నికల సిబ్బంది, జోనల్ అధికారుల నియామకం గురించి చర్చించారు. ఎక్కడా అలసత్వానికి తావి వ్వవద్దని, ఎన్నికల పట్ల ఎవరైనానిర్లక్ష్యం వహిస్తే ఎన్నికల నియమాల ప్రకారం కఠిన చర్యలు ఉంటాయన్నారు. నోడల్ అధికారులు మరోసారి ఎన్నికల నియమ, నిబంధనలను క్షుణ్ణంగా సరిచూసుకొని పొరపాట్లు దొర్లకుండా విధులు నిర్వహించాలని ఆదేశించారు.
సమావేశంలో డిఆర్ఓ వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, పంచాయతీ ఎన్నికల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

## అమరవీరుల స్తూపాన్ని మళ్లీ పునర్నిర్మించాలి



**చర్చ:- హుస్నాబాద్:** ఆసియా ఖండంలోని అతిపెద్దదైన హుస్నాబాద్ అమరవీరుల స్తూపం నేటికీ 35 సంవత్సరాలు పూర్తయిన శుభ



సందర్భంలో స్థూపాన్ని. పుననిర్మానం చేయవలసిందిగా కోరారు. ప్రజాపాలన ఇందిరమ్మ రాజ్యం నిర్మాతగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కోరారు. ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్వాడి సుదర్శన్.. రాష్ట్ర అధ్యక్షులు మేకల చంద్రశేఖర్ యాదవ్. అనంతరం మాట్లాడుతూ. ఆసియా ఖండంలోని రెండవ స్థానం దేశంలోనే మొదటి స్థానంలో మన హుస్నాబాద్ స్తూపం ఉన్నదన్నారు ఈ స్థూపం లేనిది అడుగుల ఎత్తులో ఉన్నదని 88 అమరుల వీరుల పేర్లు ఉన్నాయి స్థూపాన్ని 88 అమరవీరుల కుటుంబాల పరిస్థితి ఏ విధంగా ఉన్నాయో పరిశీలించి ముఖ్యమంత్రి వారి కుటుంబాలకు ఆర్థికంగానూ చేయూతనివ్వాలని ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ అనే ఉద్యమ సంస్థ ద్వారా తెలియజేశారు. అలాగే మానవ హక్కుల కొరకు పోరాటాలు గానీ ఉద్యమాలు గానీ చేసిన వారిని నక్సలైట్లుగా ముద్ర వేసి గత ప్రభుత్వాలు వారిని ఎన్కౌంటర్లు చేశారని కానీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ప్రజాపాలన ఇందిరమ్మ రాజ్యం ద్వారా హుస్నాబాద్ స్తూపం పుణ నిర్మాణం చేయాలన్నారు ఈ కార్యక్రమానికి రాజకీయాలకు అతీతంగా అన్ని ప్రజా సంఘాలు కలిసికట్టుగా ఉండి పుననిర్మానం చేయాలని కోరారు.. అలాగే స్థూపం చారిత్రాత్మక కట్టడమని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది అన్నారు ఇది టూరిజం ప్రదేశంగా గుర్తించి మరియు మానవ హక్కుల కొరకు పోరాటాలు చేసి 88 మంది అమరులు అయ్యారన్నారు కాబట్టి హుస్నాబాద్ స్తూపం పునర్నిర్మాణం కొరకు అందరూ ప్రజలు కార్మికులు కర్షకులు మేధావులు వ్యాపారస్తులు ప్రజాసంఘాలు విద్యార్థులు సహకరించాలని కోరారు.. అలాగే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంలో మొదటి సంతకం ఇంద్రవెల్లి స్థూపం అమరవీరుల స్మృతి వానం ఏర్పాటు చేయుటకు రెండు ఎకరాలు భూమితో పాటు అభివృద్ధికై రెండు కోట్ల రూపాయలు కేటాయించారు ఇందులో మానవ హక్కుల కొరకు పోరాటం చేసిన ఆదివాసుల కుటుంబాలకు ఆర్థికంగా ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చారని తెలిపారు.. ఈ కార్యక్రమంలో యు టి పి ఎం రాష్ట్ర అధ్యక్షులు మేకల చంద్రశేఖర్ యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్వాడి సుదర్శన్, చింతల రామచంద్రం పాల్గొన్నారు.

## సీఎం సభలో ఆకట్టుకున్న చిన్నారి నైనిక రజువా

- పర్యావరణ పరిరక్షణకు పిలుపు
- ప్రజాప్రతినిధుల నుంచి ప్రశంసలు








**చర్చ,పాల్వంచ (భద్రాద్రి కొత్తగూడెం):** ఆక్సిజన్ కోసం మొక్కలు నాటి, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిదని పేర్కొంటూ చిన్నారి నైనిక రజువా మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జరిగిన సీఎం సభలో గట్టిగా చాటింది. పాల్వంచలోని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరైన సందర్భంగా సింగరేణియన్, ప్రకృతి హరితదీక్ష వ్యవస్థాపకులు, మన్‌కీ బాత్‌లో ప్రధాని మోడీచే ప్రశంసలందుకున్న కె.ఎన్.రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రకృతి హరితదీక్ష చేపట్టిన కొత్తగూడెం సెయింట్ మేరీస్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న నైనిక రజువా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. “ఈరోజు మొక్కలు నాటకపోతేం రేపు మొక్కలను వీపున మోయాల్సిన పరిస్థితి వస్తుంది” అంటూ ప్రజలకు అవగాహన కల్పించింది. ఒక చేతిలో ఫ్లకార్డు, భుజాలపై మొక్కతో నిలుచుని.. ప్రతి ఒక్కరూ “అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలని”, పుట్టిన రోజులు, పెళ్లిళ్లు వంటి శుభకార్యాల సందర్భంగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని సందేశం ఇచ్చింది. నైనిక ప్రదర్శన సీఎం సహా సభకు హాజరైన అందరినీ ఆకట్టుకుంది. పలువురు విద్యార్థులు, ప్రజలు ఆమెతో ఫోటోలు దిగుతూ అభినందనలు తెలిపారు. చిన్న వయసులోనే పెద్ద సందేశం ఇచ్చిన నైనికకు సభలో ప్రత్యేక ప్రశంసలు దక్కాయి. ఈ సభలో సీఎం రేవంత్‌తోపాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకాటి శ్రీహరి, వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, గృహ నిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీలు బలరాం నాయక్, రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, మట్టా రాగమయి దయానంద్, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం ఆలస్యంతో వెనుదిరిగిన జనం









**భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలోని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రావడం ఆలస్యమైంది. హైదరాబాద్ నుంచి రావాల్సిన హెలికాప్టర్‌కు సాంకేతిక లోపం తలెత్తడంతో సీఎం సభా ప్రాంగణానికి ఆలస్యంగా చేరుకున్నారు.
ఈలోగా కార్యక్రమానికి హాజరైన డ్వాక్రా మహిళలు సహా పలువురు జనం, భోజన సదుపాయం లేకపోవడంతో వెనుదిరిగి వెళ్లిపోయారు. దాంతో సభా ప్రాంగణం వెనుక భాగంలో కాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి.
కార్యక్రమం ప్రారంభానికి ముందే పెద్ద సంఖ్యలో ప్రజలు వెనుదిరగడంతో నిర్వాహకుల ు కూడా ఆందోళన వ్యక్తం చేశారు.


# బాధితులెవరు... బాగుపడుతున్నదెవరు...

## నేడు ఆర్కేపి ఓసి సెకండ్ ఫేస్ ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజలను మరోసారి మభ్య పెట్టడానికి సింగరేణి అధికారులు సిద్ధమయ్యారు. ఓసి వల్ల ఏ ఒక్కరికి ఇబ్బంది కలగదు., ఒక్క ఇంచు భూమి కూడా ప్రజల నుంచి తీసుకుంటలేము... అంటూ స్పష్టంగా చెబుతూనే.., తమను కలిసిన ప్రజలకు అన్ని సౌకర్యాలు అందజేస్తామంటూ హామీలు ఇస్తున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ ఎలాగోలా జరపడమే లక్ష్యంగా మీరు అక్కడికి వచ్చి మీకు ఏం కావాలో చెప్పండి అంటూ నవ్వుతూ గొంతుకోడానికి తయారయ్యారు. మందమరి ఏరియా అధికారి అయితే ప్రముఖులతో రహస్య సమావేశాలు ఏర్పాటు చేస్తూ, వారి చేతుల్లోనే భారం పెట్టినట్లు ప్రేమనొలకబోస్తూ పని పూర్తి చేసుకోవడానికి తన 'వంతు' ప్రయత్నం చేస్తున్నారు. ఇక ఆ సదరు ప్రముఖులు తమకు అదే మహాభాగ్యం అనుకుంటూ విజయోత్సాహంగా ఇళ్ళకు వచ్చేసారు. ఇక మెజార్టీ శాతం మీడియా అయితే ఓసి వ్యతిరేకుల గలాన్ని వినిపించడానికి గానీ, సొంతంగా స్టోరీలు రాయడానికి కానీ పెన్ను కదిలిస్తున్నట్టుగా కనిపించడం లేదు. మీడియా పేరిట స్థానిక మీడియా ఎప్పుడో దాసోహం అయినట్లే కనిపిస్తున్నది.

**నాడు..** 17 సంవత్సరాల క్రితం మొదటిసారి రామకృష్ణాపూర్ ఓపెన్ కాస్ట్ వన్ ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా ఆరు నెలల ముందు నుండే పతాక స్థాయికి చేరింది. ఓ దశలో ప్రజాభిప్రాయ సేకరణ జరగదేమో అన్నంత ఉదిత్త పరిస్థితి నెలకొన్నాయి. అప్పటి పరిస్థితులను పోలిస్తే ఇప్పుడు ఒక శాతం కూడా ఈ వ్యతిరేకత లేదని చెప్పవచ్చు. దానికి కారణాలు చెప్పుకుంటే చాలా ఉన్నాయి. అప్పుడు తెలంగాణ ఉద్యమం తీవ్ర స్థాయిలో ఉండడం కావచ్చు లేదా అప్పుడు అంటోకనకు నాయకత్వం వహించిన వర్తక సంఘం బాధ్యుల గట్టితనం అని అనుకోవచ్చు. ఆ పట్టదల వల్లే ఇప్పుడు బీజోన్ ప్రాంతం మనుగడలో ఉంది. ఇది స్పష్టం. అప్పుడు కూడా ప్రజాభిప్రాయ సేకరణ గురించి పెద్దగా ప్రచారం చేయకుండా, ప్రాజెక్ట్ డీటెయిల్ రిపోర్ట్ ఇవ్వకుండా ఎక్కడో ఒకకాడ ఫ్లెక్సీ ఒకటి మాత్రం కట్టి ముందుకు వచ్చిన పరిస్థితుల్లో, నేను నాకున్న పరిచయాలు ,అనుభవంతో ప్రాజెక్ట్ రిపోర్ట్ తెప్పించుకొని "ఈ ఊరి మీద మన్ను పోస్తారట" అంటూ ఆంధ్రజ్యోతిలో అప్పుడు ఒక కథనం రాసినాను. ఇది అప్పుడు దుమారమే లేపింది. రామకృష్ణాపూర్ బీజోన్ ఏరియా ను సింగరేణి సంస్థ మట్టితో కప్పడానికి సిద్ధపడ్డ విషయాన్ని బయట పెట్టాను. ఆ సమయంలో వర్తక సంఘం అధ్యక్షుడిగా ఉన్న నన్ను రెండు మీడియా సంస్థల తొలగించారు. ముందుగా స్థానిక మీడియా సింగరేణి భయంతో నన్ను పక్కన పెట్టింది. కరెంటు తొలగిస్తారని, రూములు ఖాళీ చేయిస్తారనో భయం అయి ఉండవచ్చు. ఆ తర్వాత పెద్ద ఉద్యమం జరిగింది. 42 స్థానిక కుల,ప్రజా సంఘాలు ఏకమయ్యాయి. దీంతో నన్ను పెద్ద ఎత్తున నిర్బంధానికి గురి చేశారు. తెలంగాణ విద్యావంతుల వేదిక తరఫున పిట్టల రవీందర్, గురజాల రవీందర్, సీనియర్ జర్నలిస్టుల తరఫున పాశం యాదగిరి తో పాటు చాలామంది ఈ వ్యతిరేక పోరాటంలో పాల్గొని గట్టిగా తమ వాదన వినిపించారు. చాలా బలంగా ఉద్యమం జరుగుతున్న క్రమంలో నేషనల్ మీడియా సైతం సహకరించింది. అసలు అప్పుడు ఓసి విషయాన్ని బయటకు రాకుండా ఉండడానికి యాజమాన్యం చాలా ప్రయత్నించింది. ఇప్పుడు కూడా కేవలం ఒకరోజు ముందుగా ఆటోకు మైకు కట్టి తింపడం, పలు సంఘాలను కూడగట్టడం, ఓపెన్ కాస్ట్ అభిప్రాయ సేకరణ జరిగే స్థలం వద్దకు పోలీసులతో బాధితులను పిలిపించి మాట్లాడించడం ఇవన్నీ చేశారు. అన్నిటికంటే ముఖ్యమైన విషయం ఏంటంటే 17 ఏళ్ల క్రితం ఊరును కాపాడే స్థాయిలో కొట్లాడి , డీజిల్ ప్రాంతాన్ని కాపాడుకున్న వర్తక సంఘం కమిటీని కూడా పిలిపించి తమకు ఓసి అంటే వ్యతిరేకం కాదు అని చెప్పించడానికి ఒప్పించడం గమనార్హం.

**బాగుపడ్డున్నదెవరు..** అయితే సింగరేణి యాజమాన్యం మొదటి నుంచి ఏదైతే బ్రిటిష్ పాలన సాగిస్తున్నదో 'డివైడ్ అండ్ రూల్' ను అప్పుడు కూడా అమలు చేసింది. కార్మికులను, కార్మిక నాయకులను, రాజకీయ నాయకులను గుప్పిట్లో పెట్టుకుని ప్రజలకు ఎంత ద్రోహం చేయాలో అంత చేసేసింది. ఉద్యమాన్ని ఎంత నీరుగార్చాలో అంత నీరు కార్చింది. ఎవరెవరిని డివైడ్ చేయాలో ఉద్యమం నుంచి అందరి డివైడ్ చేసింది.





ప్రజాభిప్రాయ సేకరణలో పెద్ద ఎత్తున పోలీసులను వినియోగించి,అరెస్టులు చేయించి నిజం మాట్లాడిన వారందరినీ జైల్లో పెట్టించి నెగ్గగలిగింది. ఆ తర్వాత తమకు సహకరించిన వారికి కాంట్రాక్టులు ఇచ్చామని ఇంకేదో ఇచ్చామని అధికారులు ప్రజలను కూడా మభ్యపెట్టారు. ఇక ఇప్పుడు ఉద్యమానికి కేవలం ఆ ప్రాంతవాసులు మాత్రమే ఉండేలా కుట్ర చేయగలిగారు. కేవలం ఆర్కె ఫోర్ గడ్డ వాళ్ళు మాత్రమే ఉండండి.., మీరు ఎవరిని నమ్మినా ఇబ్బంది పడతారు. గతంలో ఉద్యమం చేసిన వారికి వారి తరఫున కాంట్రాక్టులు ఇచ్చాము, స్థలాలు ఇచ్చాము, క్వార్టర్లు ఇచ్చాము అని అంటున్నట్టు తెలిసింది. అది కూడా స్పష్టత లేదు. కానీ అధికారులు ప్రజలను మోసం చేస్తున్నారన్న విషయం స్పష్టంగా ఇక్కడ తెలిసిపోతుంది. ఎందుకంటే అందరూ వస్తే మళ్లీ ఉద్యమం ఎక్కడ చేయి దాటి పోతోందో అని భయం. అందులో భాగంగానే కొంతమంది మాత్రమే అంటే స్థానికంగా ఉన్న మీడియాను, కొంతమంది ప్రముఖ పాత్రికేయులను, ప్రముఖులను మాత్రమే సమావేశాలకు ఆహ్వానించి, వారికి ఏదో సమాచారం ఇస్తున్నట్టు మభ్యపెట్టి వాళ్లకు మాత్రమే స్పష్టత ఇచ్చి, ప్రజాభిప్రాయ సేకరణకు మార్గం సుగమం చేసుకున్నారు. ఇదంతా పక్కన పెడితే ఇందులో ప్రధానంగా ఆలోచించాల్సింది ఇంకొకటి ఉంది.

**బాధితులెవరు..**

ఏ ప్రాజెక్టు అభివృద్ధి సందర్భంగా నైనా ఉద్యోగాలు రావాలి, స్థానికుల జీవనోపాధి పెరగాలని అందరూ కోరుకుంటారు. అలా జరగాల్సిందే. కానీ ఇప్పుడు సింగరేణి రెండో ఫేసులో ఉద్యోగాలు కల్పిస్తామని చెప్తున్న ఉద్యోగాలు ఎక్కడివి, కొత్తవారికి ఇస్తారా, ఉన్నవారిని అడ్జస్ట్ చేస్తారా. మొదటిసారి ప్రాజెక్ట్ 18 ఏళ్ల క్రితం కాబట్టి అప్పటి సింగరేణిలో ఉన్న కార్మికులతో, కొంతమందితో చేయించారు. ఇప్పుడు కార్మికులు ఎంతమంది ఉన్నారో ఎవరికి ఇస్తారో అనేది స్పష్టత లేదు. అలాగే గద్ద ప్రాంతంలో దాదాపు 350 కుటుంబాలు పడుతున్న బాధకి బాధ్యత ఎవరు, ఎవరిని బాధ్యులు చేస్తున్నారన్న విషయం తెలియదు. వాళ్ళని మాత్రం విభజించి ఓ పక్కన కూర్చోబెట్టారు. మరో విషయం అమరవాది గ్రామానికి ఎలాంటి బాధ కలగదని చెప్పి, సింగరేణి ప్రాంత అభివృద్ధిలో దాన్ని మస్తు అభివృద్ధి చేస్తామని చెప్పి నాశనం చేశారు. పది ఎకరాల చెరువు రెండెకరాలకి వచ్చింది. చెరువు మధ్యలో నుంచి కుట్ర పూరితంగా రోడ్డు వేశారు. వాళ్లు మొదటి నుంచి ఏ పనిని నమ్ముకున్నారో "డివైడ్ అండ్ రూల్" అలాగే దిగ్విజయంగా పూర్తి చేసి రోడ్డు వేసేసి ఊరు నాశనం చేశారు. ఆ తర్వాత అమరవాది గ్రామాన్ని పట్టించుకున్న పాపాన పోలేదు. అది మందమరి మండలంలోని రెవెన్యూ విలేజ్ గా ఉంది. ఆ తర్వాత ప్రజాప్రతినిధులు కొంతమంది సింగరేణి యాజమాన్యానికి సహకరిస్తూ ఉండడం వల్ల ఈ ప్రాంత ఉత్తులు ఎవరూ పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయింది. మళ్లీ మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ లో రెండో ఫేస్ తవ్వకాలకు సిద్ధమైన తరుణంలో ప్రస్తుతం ఉన్న జీఎం గారు అంతకు ముందు ఓసి ప్రాజెక్టు అధికారిగా ఉండటం వల్ల చాలా 'ఈజీ మార్గాలను' వెతికేసుకున్నారు. ఎవరితో మాట్లాడినట్టు చేయాలి.., ఎవరితో చెప్పినట్టు చేయాలి..., ప్రజలకు ఎలా పని చేసినట్టు చేయాలి.. , చేస్తారా, చేయరా అని తర్వాత విషయం. ఇలా చాలా లాజిక్ గా మంచి నవ్వు ముఖంతో అన్ని పనులు చక్కబెట్టుకుంటున్నారు. ఏదేమైనా రేపు జరగబోయే ప్రజాభిప్రాయ సేకరణ 90% సింగరేణికి అనుకూలంగా ఉండే అవకాశం ఉన్నప్పటికీ, ప్రజలు ఈ ఒక్క రోజులోనైనా సరిగా ఆలోచించి ప్రజాభిప్రాయ సేకరణ అనే కార్యక్రమం జరగకుండా చేస్తేనే వ్యతిరేకించినట్లు అనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. లేకపోతే మాత్రం మోసపోయినట్లే అని చెప్పవచ్చు. ఎందుకంటే ప్రజాభిప్రాయ సేకరణలో వ్యతిరేకంగా ఎంత మంది మాట్లాడతారో, అంతకంటే ఓ నలుగురుతో అనుకూలంగా మాట్లాడిస్తే సరిపోతుంది. దీని ఉదాహరణగా చాలా చెప్పుకోవచ్చు. రామకృష్ణపూర్ ఓసి తర్వాత, ఇందారం ఓసి అయింది. మందమర్రి ఓసి సందర్భంగా ఎర్రగుంటపల్లి వాసులు ఎంతగా కొట్లాడారో మాకు తెలుసు. స్వయంగా అక్కడికి వెళ్లి కొన్ని రోజులపాటు మేము మాట్లాడినం. ఉద్యమాన్ని రూపకల్పన చేశాం. హైదరాబాద్ నుంచి స్వచ్ఛంద సంఘాలు, పాత్రికేయ సంఘాలు, విద్యావంతుల వేదిక ద్వారా చాలా ప్రయత్నాలు చేశాము. అలాగే మళ్ళీ గోలేటి, కైరిగూడ ప్రాంతాల్లో కూడా ఇలాగే అయింది. ఏదేమైనా ప్రజలు సరైన నిర్ణయాలు సరైన సమయంలో తీసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు నాయకులు కూడా నిస్వార్థంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. లేదంటే ఎప్పటిలాగానే 'మసి'పూసి మాయ చేస్తారు.



- దుస్స శివప్రసాద్
సీనియర్ జర్నలిస్టు.

## పార్లమెంట్లో 'సంచార్ సాథీ' రగడ దేశ ప్రజల ప్రైవసీపై దాడి అంటూ విపక్షాల నిరసన



**ఢిల్లీ, నవంబర్ 2:** 'సంచార్ సాథీ' అంశం హాస్టింగతోపాటు, దేశవ్యాప్తంగా హాట్ టాపిక్ అయింది. దేశంలో విక్రయించే అన్ని కొత్త స్మార్ట్‌ఫోన్‌లలో సంచార్ సాథీ యాప్‌ను ప్రీ-ఇన్‌స్టాల్ (డిఫాల్ట్‌గా) చేయాలంటూ కేంద్రం ఇచ్చిన ఆదేశాలపై విపక్షాలు మండిపడుతు న్నాయి. పార్లమెంట్‌లో ఈ అంశంపై తీవ్ర స్థాయిలో చర్చ జరిగింది. ప్రధానంగా కాంగ్రెస్, శివసేన, టీఎంసీ తీవ్రంగా విమర్శిస్తూ, ఇది.. ప్రైవసీ ఉల్లంఘనే అంటూ సభా కార్యక్రమాలకు అడ్డుతగిలాయి. దీంతో సభలో తీవ్ర గందరగోళం ఏర్పడింది. విపక్ష కాంగ్రెస్ దీనిమీద వాయిదా తీర్మానం దాఖలు చేసి, సంచార్ సాథీపై విస్తృత చర్చ కావాలని డిమాండ్ చేశాయి. సంచార్ సాథీ యాప్ ఫోన్ యూజర్ల కదలికల్ని, మెసేజెస్, కాల్స్ మానిటర్ చేస్తుందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ %ఖఙ% వేణుగోపాల్ దీనిని ఇదొక డిస్టోపియన్ టూల్ అని.. ఇది ప్రతి భారతీయుడిని మానిటర్ చేయడమేకాకుండా. వారి ఆర్థిక హక్కులపై దాడిగా అభివర్ణించారు. దీని అమలు రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు. లోక్‌సభలో కాంగ్రెస్ రేణుక చౌదరి దీనిపై వాయిదా తీర్మానం దాఖలు చేశారు. శివ సేన ప్రియాంక చతుర్వేది దీనిపై మాట్లాడుతూ ఇది ఒక దారుణమైన పరిణామమని.. ఇది భవిష్యత్‌లో నియంతృత్వానికి దారితీస్తుందన్నారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాగరిక ఘోస్ కూడా దీనిని తీవ్రంగా తప్పుబట్టారు. ఇది ప్రభుత్వంపై నమ్మకాన్ని సన్నగిల్లేలా చేస్తుందని విమర్శించారు. విపక్షాల ఆందోళన నేపథ్యంలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు సంచార్ సాథీ యాప్ పై వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. సంచార్ సాథీ మీద చర్చకు ప్రభుత్వం వ్యతిరేకం కాదని, కానీ ఎజెండా ప్రకారం, సెషన్‌లో 14 బిల్లులపై ఫోకస్ పెడదామని సూచించారు. అటు, డిపార్ట్ మెంట్ ఆఫ్ టెలికాం (%ఐఓ%) కూడా దీనిపై స్పందించింది. సంచార్ సాథీ కేవలం ప్రజల సైబర్ సెక్యూరిటీ కోసం ఉద్దేశించింది మాత్రమేనని, ఇందులో ప్రైవసీ ఉల్లంఘన లేదంది. ఈ యాప్ యూజర్ డేటా రక్షిస్తుందని తెలియజేసింది.

## కాల్పుల విరమణ విజ్ఞప్తి పాకిస్థాన్ నుంచే వచ్చింది



**న్యూ ఢిల్లీ:** ఆపరేషన్ సిందూర్ సమయంలో నౌకాదళం దాడుల ముప్పును గ్రహించే పాకిస్తాన్, కాల్పుల విరమణకు విజ్ఞప్తి చేసినట్లు నౌకాదళం వైస్ అడ్మిరల్ కె.స్వామినాథన్ తెలిపారు. నౌకాదళ వార్షికోత్సవానికి ముందు మీడియాతో మాట్లాడిన వైస్ అడ్మిరల్ స్వామినాథన్ ఆపరేషన్ సిందూర్ సందర్భంగా అతితక్కువ సమయంలో 30కిపైగా నౌకలను, జలాంతర్గాములను సమీక రించినట్లు చెప్పారు. విక్రాంత్ క్యారియర్ బ్యాటిల్ గ్రూప్‌లో భాగంగా మక్రాన్ తీరంలో నౌకలను ముందు వరుసలో నిలిపినట్లు వెల్లడించారు. 'ఏప్రిల్‌లో వరుసగా ఆయుధ పేలుళ్ల విజయవంతంగా నిర్వహించడం సహా భారత నౌకాదళం మోహరింపు వల్ల పాకిస్థాన్ నౌకాదళం తన తీరప్రాంతానికే పరిమితమైంది. భారత నౌకాదళం దాడుల ముప్పును గ్రహించి పాకిస్థాన్ కాల్పుల విరమణకు విజ్ఞప్తి చేయటానికి ఒక కారణం.' అని స్వామినాథన్ చెప్పారు.

## తీరు మార్చుకోని పాక్ భారత గగనతలంలోకి విమానాలను అనుమతించినా



**న్యూ ఢిల్లీ:** దిత్వా తుపానుతో ఇబ్బందుల్లో పడిపోయిన శ్రీలంకను ఆదుకునేందుకు భారత్ రంగంలోకి దిగింది. ఆపరేషన్ సాగర్ బంధు పేరిట మానవతాసాయాన్ని అందిస్తోంది. ఇక శ్రీలంకకు తామూ సాయం చేస్తామన్న పాక్‌కు కూడా భారత్ సహకరించింది. పాక్ విమానాలు భారత గగనతలం మీదుగా శ్రీలంక చేరేందుకు అడిగిన వెంటనే అనుమతించిందిఅయితే, భారత్‌పై దుష్ప్రచారమే పనిగా పెట్టుకున్న పాక్ మరోసారి తన కుయుక్తులను ప్రయోగించింది. పాక్ మీడియా భారత్‌పై ఫేక్ వార్తలను వండివార్చింది. మానవతా సాయానికి ఉద్దేశించిన విమానాలను కూడా భారత్ తన గగనతలంలోకి అనుమతించలేదంటూ వార్తలను ప్రచురించింది. పాక్ దుష్ప్రచారాన్ని భారత్ వర్గాలు వెంటనే ఖండించాయి. పాక్ అడిగిన వెంటనే కావాల్సిన అనుమతులు ఇచ్చామని తెలిపాయి. ప్రామాణిక పద్ధతులు, సాంకేతిక అంశాలు, భద్రతా పరమైన సమస్యలను పరిగణలోకి తీసుకుని అనుమతులు ఇచ్చామని తెలిపాయి. భారత వర్గాల ప్రకారం, సోమవారం మధ్యాహ్నం 1 గంటకు పాక్ అధికారికంగా అనుమతిని కోరింది. సంక్షోభంలో ఉన్న శ్రీలంక ప్రజలను దృష్టిలో పెట్టుకుని భారత్ అత్యంత వేగంగా స్పందించింది. కేవలం నాలుగు గంటల వ్యవధిలోనే కావాల్సిన అనుమతులు జారీ చేసింది. పాక్ మీడియా వార్తల్ని అసత్యాలేనని భారత వర్గాలు తేల్చి చెప్పాయి. ఇక శ్రీలంకను ఆదుకునేందుకు భారత్ 53 టన్నుల వివిధ రకాల సహాయక సామగ్రిని పంపించింది. శ్రీలంక ఎయిర్ ఫోర్స్‌తో కలిసి భారత నేవీ పలు సహాయక చర్యల్లో పాల్గొంటోంది. జాతీయ విపత్తు నిర్వహణ బృందం, వైద్య బృందాన్ని కూడా శ్రీలంకకు పంపించింది. ఈ నేపథ్యంలో శ్రీలంక భారత్‌కు ధన్యవాదాలు కూడా తెలిపింది. మరో దిత్వా బారిన పడి ఇప్పటివరకూ 360 మంది కన్నుమూశారు. మరో 370 మంది గల్లంతయ్యారు. నిరాశ్రయులుగా మారిన సుమారు 2 లక్షల మందిని ప్రభుత్వం తాత్కాలిక వసతి కేంద్రాలకు తరలించింది. కండి, బదుల్లా, నువారా ఎలియా, మటాలే జిల్లాలో తుఫాను బీభత్సం అధికంగా ఉంది.

## రాజ్‌భవన్ కాదు ఇక నుంచి లోక్ భవన్

**న్యూ ఢిల్లీ:** కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోంది.. ముఖ్యంగా.. పాలన భవన కేవలం పరిపాలనాపరమైనది కాదు. ఇది సాంస్కృతిక వైభవాన్ని తెలపడంతోపాటు.. నైతికమైనది అని గుర్తుచేసేలా.. వలసవాద పేర్లు, చిహ్నాలను రద్దు చేస్తోంది.. అంతేకాకుండా.. భారత ప్రజాస్వామ్య అధికారం కంటే బాధ్యతను, 'హోదా' కంటే సేవను ఎంచుకుంటోంది.. అనేలా.. పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోంది.. అందులో భాగంగా.. గవర్నర్ల అధికారిక నివాసాలైన రాజ్ భవన్ పేర్లను ఇకపై లోక్ భవన్‌గా పిలవనున్నారు.. 'ప్రజా సేవ' అనే ప్రభుత్వ నినాదానికి అనుగుణంగా ఈ మార్పు చేయాలని కేంద్రం నిర్ణయించుకుంది.. దీనికి అనుగుణంగా.. కేంద్ర హోం శాఖ కీలక ప్రకటన చేసింది.. దేశవ్యాప్తంగా గవర్నర్ల అధికారిక నివాసం, కార్యాలయ భవనంగా ఉన్న 'రాజ్ భవన్' పేరును 'లోక్ భవన్'గా మార్చు చేస్తున్నట్లు ఈ నెల 25వ తేదీన జారీ చేసిన అధికారిక ఉత్తర్వుల్లో పేర్కొంది.. దేశంలో ఎక్కడా 'రాజ్ భవన్' అనే పదం అధికారికంగా ఉపయోగించరాదని కేంద్రప్రభుత్వం స్పష్టం చేసింది. రాజ్యాంగంలో గవర్నర్ పదవి రాజ్యాంగ ప్రతీక



కాదని, ప్రజల ప్రతినిధిగా పనిచేసే వ్యవస్థ అనే ఉద్దేశంతో 'లోక్ భవన్' అంటే.. ప్రజల భవనం గా ఈ కొత్త పేరును ఎంచుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ మార్పు ద్వారా రాజ్యాంగ గణతంత్ర విలువలను మరింత బలపరుస్తున్నట్లు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కీలక నిర్ణయాలు నిశ్శబ్దంగా.. లోతైన మార్పునకు గురవుతున్నాయి. పాలన భవన కేవలం పరిపాలనాపరమైనది కాదు. ఇది సాంస్కృతిక .. నైతికమైనది.. అంటూ మోదీ ప్రభుత్వం గుర్తుచేస్తోంది.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో, పాలనా స్థలాలు కర్తవ్యం పారదర్శకతను ప్రతిబింబించేలా పునర్నిర్మాణం చబడ్డాయి. ప్రతి పేరు, ప్రతి భవనం, ప్రతి చిహ్నం ఇప్పుడు ఒక సాధారణ ఆలోచనను సూచిస్తుంది.. ప్రభుత్వం ప్రజలకు సేవ చేయడానికి ఉంది.. అనేలా ప్రతి నిర్ణయం ప్రతిబింబిస్తోంది. అంతకు ముందు రాజ్ పథ్ .. కర్తవ్య మార్గంగా మారింది. ఒక మైలురాయి వీధి కాదు. ఇది ఒక విధి. వలసవాద పేర్లు, చిహ్నాలను రద్దు చేస్తామని ప్రధాని మోదీ చెప్పిన విధంగా.. ఇండియా గేట్ వద్ద ఉన్న నేతాజీ విగ్రహం నుంచి రాష్ట్రపతి భవన్ వరకు ఉన్న మార్గాన్ని కర్తవ్యపథ్‌గా నామకరణం ఎమోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధానమంత్రి అధికారిక నివాసాన్ని 2016లో మార్చారు.. ఇది ప్రత్యేకతను కాదు, సంక్షేమాన్ని తెలియజేసే పేరు. ఎన్నికైన ప్రతి ప్రభుత్వానికి ముందున్న పనికి గుర్తుగా అభిప్రాయపడ్డారు. ప్రధాని కార్యాలయాన్ని సేవా తీర్థ్ అని నామకరణం చేశారు. సేవా స్ఫూర్తిని ప్రతిబింబించేలా %-% జాతీయ ప్రాధాన్యతలు రూపుదిద్దుకునేలా కార్యాలయాన్ని రూపొందించారు. కేంద్ర సచివాలయానికి కర్తవ్య భవన్ అని పేరు పెట్టారు. ప్రజా సేవ అనేది ఒక నిబద్ధత అనే ఆలోచన చుట్టూ నిర్మించబడిన విశాలమైన పరిపాలనా కేంద్రం..

## విపక్ష పార్టీల ఫ్లోర్ లీడర్లతో స్పీకర్ ఓంబిర్లా సమావేశం



**న్యూ ఢిల్లీ:** పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో తొలి రెండు రోజులు ఎలాంటి చర్చ లేకుండా ముగిశాయి. ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను వ్యతిరేకిస్తూ ఉభయసభల సభ్యులు ఆందోళనకు దిగడంతో గందరగోళం నెలకొంది. మంగళ వారం కూడా ముందుగా వందేమాతరం పై చర్చకు ప్రభుత్వం పూనుకోగా.. పై చర్చకు ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. తీవ్ర గందరగోళం కారణంగా లోక్‌సభ రేపటికి వాయిదాపడింది. ఇకముందు కూడా ఉభయసభలు సజావుగా సాగే అవకాశం లేకపోవడంతో స్పీకర్ ఓంబిర్లా విపక్ష పార్టీల ఫ్లోర్ లీడర్లతో సమావేశమై పరిస్థితిని చక్కదిద్దాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. పార్లమెంట్ హౌస్‌లోని స్పీకర్ చాంబర్‌లో ఈ సమావేశం జరుగనున్నట్లు సమాచారం.

# పరిశ్రమల సృష్టికర్త చంద్రబాబు



**అనంతపురం:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశ్రమల సృష్టికర్త అని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. రొద్దం మండలంలోని సానిపల్లిలో వృద్ధులు, వికలాంగులకు ఇంటింటికి వెళ్లి పింఛన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాటాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతినెలా ఇంటివద్దకే వెళ్లి పింఛన్లు అందిస్తున్నామని పేర్కొన్నారు. కియా లాంటి పరిశ్రమలో వేలాది మంది నిరుద్యోగులు ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ఎంఎస్ఎంఈలతో రాష్ట్రానికి కుప్పలు తెప్పలుగా పరిశ్రమలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పాల్గొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరు చేస్తామనీ మంత్రి సవిత అన్నారు. సోమవారం రొద్దంలోని వెలుగు కార్యాలయంలో డివిజన్‌స్థాయి ఫిర్యాదుల దినోత్సవం నిర్వహించారు. ప్రజా సమస్యలపై వందలాది మంది తరలిరాగా మంత్రి ప్రతి ఒక్కరి సమస్య వింటూ సంబంధిత శాఖాధికారులతో సమస్యకు పరిష్కారం చూపారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, తహసీల్దార్ ఉదయశంకర్‌రాజు, ఎంపీడీఓ ఆనంద్ ప్రసాద్, టీడీపీ నాయకులు మాధవనాయుడు, వెంకటరామిరెడ్డి, వీరాంజనేయులు, హరీష్, పవన్, శ్రీనాథ్‌చౌదరి, అరుణ్‌కుమార్ రెడ్డి, అశ్వత్థనారాయణ, తిరుపాల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# రాజధానిలో రెండో విడత భూ సమీకరణకు ఆదేశాలు జారీ



**అమరావతి, డిసెంబర్ 02:** రాజధాని అమరావతి నిర్మాణానికి సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. రాజధాని అభివృద్ధి కోసం రెండో విడత భూ సమీకరణ చేపట్టేందుకు ప్రభుత్వం ఇప్పటికే అనుమతించింది. అందుకు సంబంధించిన ఆదేశాలను మంగళవారం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ జారీ చేశారు. ఏడు గ్రామాల్లో మొత్తం 16,666.57 ఎకరాల పట్టా, అసైన్డ్ భూమి సమీకరణ బాధ్యతను సీఆర్డీఏకు అప్పగిస్తున్నట్లు ఆ ఆదేశాల్లో స్పష్టం చేశారు.పల్నాడు జిల్లా అమరావతి మండలంలోని నాలుగు గ్రామాల పరిధిలో.. వైకుంఠపురంలో 1,965 ఎకరాలు,పెదమద్దూరులో 1,018 ఎకరాల పట్టా, యండ్రాయి గ్రామ పరిధిలో 1,879 ఎకరాలు పట్టా, 46 ఎకరాల అసైన్డ్ భూమితోపాటు కర్లపూడి, లేమల్లే 2,603 ఎకరాలు పట్టా భూమి, 51 ఎకరాల అసైన్డ్ భూమి సమీకరించనుంది.ఇక గుంటూరు జిల్లాలోని తుళ్లూరు మండలంలోని 3 గ్రామాల పరిధిలో.. వడ్డమానులో 1,763.29 ఎకరాల పట్టా, 4.72 అసైన్డ్ భూమి.. హరిశ్చంద్రాపురంలో 1,448.09 ఎకరాలు పట్టా, 2.29 అసైన్డ్ భూమి.. పెదపరిమిలో 5,886.18 ఎకరాల పట్టా భూమి సమీకరణ చేపట్టాలని ఆ ఆదేశాల్లో స్పష్టం చేసింది. 7 గ్రామాల్లో కలిపి 16,562.52 ఎకరాల పట్టా భూములు, 104.01 ఎకరాల అసైన్డ్ భూమిని సమీకరించాలని సీఆర్ డీఏ కమిషనర్‌ను ఆదేశించింది. ఈ భూ సమీకరణలో 3828.30 ఎకరాలు ప్రభుత్వ భూమి కూడా ఉంది

# డ్రైవర్‌తో గొడవ స్కూల్ బస్సుకు నిప్పంటించిన క్లీనర్.



**ప్రకాశం జిల్లా :** అర్ధవీడు మండలంలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. స్కూల్ బస్సుపై క్లీనర్ పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటన అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. అర్ధవీడు మండలం పాపినేని పల్లిలో మంగళవారం ఉదయం ఈ ఘటన జరిగింది.మంగళవారం ఉదయం ఆ స్కూల్ బస్సును నడుపుతున్న డ్రైవర్, క్లీనర్ మధ్య ఏదో విషయమై గొడవ జరిగింది. దీంతో క్లీనర్ తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. పెట్రోల్ తీసుకొచ్చి బస్సుపై వేసి నిప్పంటించాడు. దీంతో బస్సు మంటల్లో చిక్కుకుని పూర్తిగా కాలిపోయింది. అప్పటికింకా పిల్లలెవరూ బస్సు ఎక్కకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ నభికి మంటలు అంటుకుని స్వల్పంగా గాయాలయ్యాయి . అతడిని స్థానికులు వెంటనే సమీపంలోని హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకున్నారు. పెట్రోల్ పోసి నిప్పంటించిన క్లీనర్ గోపాల్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# శ్రీశైలం టోల్‌గేట్ వద్ద రివాల్వర్ కలకలం పోలీసుల విచారణ



**నంద్యాల జిల్లా, డిసెంబర్ 02:** శ్రీశైలం టోల్‌గేట్() వద్ద రివాల్వర్ కలకలం రేపుతోంది. దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది వాహనాల తనిఖీలు చేపట్టగా.. ఓ వ్యక్తి నుంచి 9 ఎంఎం పిస్టల్(9ఒకటి బయటపడింది. దీంతో సదరు తుపాకీ()ని స్వాధీనం చేసుకున్న పోలీసులు.. విచారణ చేపట్టారు.కాగా.. రివాల్వర్ తీసుకువచ్చిన వ్యక్తిని మధ్యప్రదేశ్‌వాసిగా గుర్తించారు శ్రీశైలం ఆలయ అధికారులు. ఆ రాష్ట్రానికి చెందిన సైబర్ క్రైమ్ ఎస్ఐ(అని ఆయన పోలీసులకు చెప్పుకున్నట్టు తెలుస్తోంది. అయితే.. ఈ ఘటనపై విచారణలో భాగంగా.. సదరు వ్యక్తి నుంచి రివాల్వర్ సహా ఐడెంటిటీ కార్డు(ను స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టినట్టు శ్రీశైలం సీఐ ప్రసాదరావు(పేర్కొన్నారు.

# మొంథా తుఫాన్ డ్యామేజ్ కేంద్రానికి నివేదిక సమర్పించిన మంత్రి లోకేష్, అనిత



**ఢిల్లీ:** ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న మంత్రులు లోకేష్, వంగలపూడి అనిత కేంద్ర హోంమంత్రి అమిత్ షా, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌లతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఏపీలో 'మొంథా' తుపాను సృష్టించిన బీభత్సానికి వాటిల్లిన నష్టంపై నివేదిక సమర్పించారు. ఆంధ్రప్రదేశ్‌కి తీవ్ర నష్టం మిగిల్చిన మొంథా తుపాను కారణంగా రాష్ట్రంలో అన్నిరంగాలకు కలిపి రూ.6,352 కోట్ల మేర నష్టం వాటిల్లిందని వారు కేంద్రమంత్రికి వివరించారు. తుపాను కారణంగా ప్రజలు తీవ్ర మైన ఇబ్బందులు ఎదుర్కొనడమే కాకుండా మౌలిక సదుపాయాలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయని చెప్పారు. మొంథా తుపాను వల్ల రాష్ట్రంలో మొత్తం 3,1 09 గ్రామాలు ప్రభావితమయ్యాయని తెలిపారు. అక్టోబర్ 28వ తేదీ రాత్రి కాకినాడ సమీపంలో తుపాను తీరం దాటిందని.. ఆ సమయంలో గంటకు 100 కి.మీ. వేగంతో గాలులు భారీవర్షం కురవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెనువెంటనే అప్రమత్తమై 1.92 లక్షల మందిని 2,471 పునరావాస శిబిరాలకు తరలించింది. వారికి అవసరమైన ఆహారం, తాగునీరు, పాలు, ఇతర వస్తువులను అందించడంతో ప్రమాద తీవ్రతను తగ్గించినట్టు తెలిపారు.ప్రతి ప్రభావిత కుటుంబానికి తక్షణ సాయంగా రూ.3వేలు అందించామని.. ఇదే సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కూలిన చెట్ల తొలగింపు, తాత్కాలిక నివాస సౌకర్యాలు, నీటి సరఫరా పునరుద్ధరణ వంటి పలు చర్యలను చేపట్టిందని వివరించారు. తక్షణ సహాయం కింద రూ.60 కోట్ల రూపాయల ఆర్థిక సహాయం అందించినట్టు స్పష్టం చేశారు. మొత్తం మీద రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.271 కోట్లు, గృహ నష్టం రూ.7 కోట్లు, రహదారులు, మౌలిక సదుపాయాలకు రూ.4,324 కోట్లు, విద్యుత్ రంగానికి రూ.41 కోట్లు, నీటి వనరులు, నీటిపారుదల ప్రాజెక్టులకు రూ.369 కోట్లు, శాశ్వత నిర్మాణాలకు రూ.1,302 కోట్లు, సామూహిక ఆస్తులకు రూ.48కోట్ల ఇలా మొత్తంగా రూ.6,356 కోట్ల నష్టం వాటిట్టు పేర్కొన్నారు. మార్గదర్శకాల ప్రకారం రూ.902 కోట్లు తక్షణ ఉపశమనం, తాత్కాలిక పునరుద్ధరణ కోసం అర్హమైనవని.. ఈనెల 12వ తేదీన తాము సమర్పించిన నివేదికపై కేంద్రమంత్రుల బృందం () ద్వారా క్షేత్రస్థాయి పరిశీలన కూడా జరిపిందని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. అమిత్ షాను కలిసిన వారిలో హోం మంత్రి అనిత, రాష్ట్రానికి చెందిన ఎంపీలు ఉన్నారు.

# విశాఖపట్నంలో వెంటనే ఆ నిర్మాణాలను కూల్చేయండి



**విశాఖపట్నం:** పడింది. ఈ విషయాన్ని ఏపీ అపార్ట్‌మెంట్స్ చట్టంలోని సెక్షన్-9 స్పష్టం చేస్తోందని హైకోర్టు ప్రస్తావించింది.విశాఖపట్నం ఈస్ట్ పాయింట్ కాలనీలోని మాధురి మనోర్ అపార్ట్‌మెంట్ ఉంది. అయితే జీవీఎంసీ అధికారులు అక్కడ స్టిల్ట్ ఫ్లోర్‌లో అక్రమంగా నిర్మించిన షాపుల్ని కూల్చివేయాలని నోటీసులు జారీ చేశారు. జీవీఎంసీ ఈ నోటీసుల్ని పలువురు సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. తమ ఆరు షాపులు సెల్లార్/స్టిల్ట్ ఫ్లోర్‌లో ఉన్నాయని.. వాటికి తాము యజమానులమని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆ షాపులను క్రమబద్ధీకరించుకోవచ్చని ఏపీ మున్సిపల్ కార్పొరేషన్ చట్టం సెక్షన్ 455ఏ ప్రకారం కోర్టుకు వివరించారు. షాపులు క్రమబద్ధీకరించేవడానికి దరఖాస్తు అధికారుల పరిశీలనలో ఉందన్నారు. కానీ కోర్టు మాత్రం వారి పిటిషన్‌ను కొట్టివేసింది.విశాఖపట్నం డబుల్ డెక్కర్ బస్సులు ఆ స్టాప్ వరకు పొడిగింపువిశాఖ గ్లాస్ బ్రిడ్జ్ ప్రారంభం.. ఫుల్ థ్రిల్లింట్ ఫ్లోర్‌లో షాపులు ఉన్నాయి.. 26 ఏళ్లుగా తమ ఆదీనంలో ఉన్నాయంటూ క్రమబద్ధీకరించాలని కోరడం సరికాదని హైకోర్టు తెలిపింది. ఇది చట్టబద్ధం కాదని.. జీవో 225 కూడా అనుమతించదన్నారు. సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన తీర్పు కూడా ప్రస్తావించారు. పార్కింగ్ ప్రాంతం అపార్ట్‌మెంట్ వాసుల అవసరాలకే ఉపయోగించాలని.. వాణిజ్య కార్యకలాపాలకు అమ్ముకోకూడదని సుప్రీం కోర్టు స్పష్టంగా చెప్పిందని గుర్తు చేశారు. ఈ కేసులో అనధికార షాపుల్ని కూల్చివేయాలని హైకోర్టు అధికారుల్ని ఆదేశించింది. నాలుగు వారాల్లోగా ఆ ప్రాంతాన్ని పార్కింగ్‌కు వీలుగా మార్చేలా అప్పగించాలని ఆదేశించారు జస్టిస్ హరినాథ్. పిటిషనర్లు సమర్పించిన శాంక్షన్ ప్లాన్ నిజమైనది కాదని, వ్యాజ్యం దాఖలు చేసేందుకు అనువుగా దానిని తయారు చేశారని జీవీఎంసీ తరఫు లాయర్ కోర్టుకు తెలిపారు. ఫ్యాబ్రికేట్ చేసిన శాంక్షన్ ప్లాన్‌ను కోర్టుకు సమర్పించారని తప్పుపట్టారు.

# కూటమితోనే అభివృద్ధి



**శ్రీకాకుళం జిల్లా :** డబుల్ ఇంజన్ సర్కారు తోడ్పాటుతో ఏపీ రెట్టింపు వేగంతో మరింత అభివృద్ధి వైపు పయనిస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా గార మండలంలో శనివారం ఎమ్మెల్యే గొండు శంకర్ తో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా పలు ప్రారంభోత్సవాలు, శంకు స్థాపన కార్యక్రమాల్లో రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు.తొలుత వమరవల్లి డైట్ పాఠశాలలో అదనపు భవనాలకు 2.4 కోట్లు మంజూరు చేసి నిర్మాణాలు పూర్తయిన అదనపు తరగతి గదులను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్ తో కలసి ఆయన ప్రారంభించారు. నూతన భవనాల్లో ఏర్పాటు చేసిన వసతులను అడిగి తెలుసుకున్నారు. ఎక్కువ మంది విద్యార్థులకు సేవలు అందే విధంగా పలు సూచనలు చేశారు. అదనపు తరగతి గదుల్లో బోధనా గదులు 2, స్మార్ట్ క్లాస్ గదులు 2, కంప్యూటర్ ల్యాబ్ కమ్ ఐటి ల్యాబ్, సైన్స్ ల్యాబ్, మ్యాథ్స్ ల్యాబ్ లాంగ్వేజ్ ల్యాబ్, సోషల్ సైన్సెస్ ల్యాబ్, వర్క్ ఎక్స్పీరియన్స్ కు ల్యాబ్, ఫిజికల్ లిటరసీ ల్యాబ్, గర్ల్స్ వాల్టింగ్ హాల్ లతో కలిపి ఈ భవనాలను 2.40 కోట్ల రూపాయలతో నిర్మించారు.భవనంలోని గదులు పరిశీలించిన కేంద్ర మంత్రి.. అందించిన వసతులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఇదే ప్రాంగణంలో ఆడిటోరియం, రెండు డార్మిటరీలు గ్రౌండ్ ఫ్లోర్ లో అన్ని వసతులతో కూడిన 4 గదులు, మొదటి అంతస్తులో 4 గదుల డిజైన్ తో 6.06 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న భవన సముదాయానికి కేంద్ర మంత్రి శంకుస్థాపన చేశారు.అనంతరం ఎన్.ఆర్.ఈ.జీ.ఎస్ నిధులు 40 లక్షలతో గార మండల కేంద్రంలో నిర్మించిన సచివాలయ భవనాన్ని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు.పార్క్ పరిసరాలను కలియతిరిగి నిర్మాణం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో నియోజవర్గ కూటమి శ్రేణులు ఎక్కడికక్కడ ఘన స్వాగతాలు పలికారు. ఈ సంధర్భంగా పలు చోట్ల ఆలయాలను కేంద్ర మంత్రి సందర్శించారు. ఈ పర్యటనలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జగన్‌పై ఎమ్మెల్యే ఫైర్ రూ. వెయ్యి పెంచేందుకు ఆయనకు ఐదేళ్లు పట్టింది



**అనంతపురం:** పింఛన్ సొమ్ము రూ.వెయ్యి పెంచేందుకు జగన్‌కు ఐదేళ్ల పట్టిందని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ విమర్శించారు. రాజీవ్ కాలనీ పంచాయతీలోని మరాఠీకాలనీ, 16వ డివిజన్‌లోని బాబానగర్, 38వ డివిజన్‌లోని కోవూరు నగర్‌లో ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ... జగన్ ప్రభుత్వంలో ర్రారాష్ట్రానికి ఎలాంటి పెట్టుబడులు రాలేదని, ఆఖరికి విశాఖపట్నంలో ప్రభుత్వ ఆఫీసులను తాకట్టు పెట్టారని, ఆయన మరోసారి సీఎం అయి ఉంటే రాష్ట్రాన్ని పూర్తిగా తాకట్టు పెట్టేవారని ఈ సందర్భంగా దుయ్యబట్టారు.ఏడాదిలో నగర రూపురేఖలు మార్చేస్తాంఅనంతపురం క్లాక్‌టవర్: ఏడాదిలో నగర రూపురేఖలు మార్చేస్తామని, అందుకు ప్రణాళికను అమలు చేయబోతున్నామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. 38వ డివిజన్‌లోని విద్యారణ్య పాఠశాల వద్ద రూ.39 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని భూమిపూజ చేశారు. అలాగే 27వ డివిజన్‌లో రూ.70లక్షలతో పూర్తి చేసిన అశోక్‌నగర్ మెయిన్ రోడ్డును శిలాఫలకం ఆవిష్కరించి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదన్నారు.కూటమి వచ్చాక నగరంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు. గుంతల రోడ్లును బాగు చేస్తూ.. మురుగు కాలవల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. ఏడాదిలోపు నగర రూపురేఖలు మార్చే ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో నగరపాలక సంస్థ కమిషనర్ బా లస్వామి, ఎస్ఈ రాజశేఖర్, ఈఈ షాకీర్, ఎంపీడీఓ దివాకర్, మాంసాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రకాషనాయుడు, వీర శైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ స్వప్న,టీడీపీ జిల్లా అధికారప్రతినిధి సరిపూటి రమణ, మాజీ కార్పొరేటర్ బల్లాపల్లవి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గాజుల ఆదెన్న, భావన, రాష్ట్ర కార్యదర్శులు ఆదినారాయణ, రాయల్ మురళి, సుధాకర్‌నాయుడు, నెట్టెం బాలకృష్ణ, బీజేపీ నాయకుడు లలిత్‌కుమార్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, ఉపాధ్యక్షుడు రమేష్, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు భవానీ రవికుమార్, పీఎల్ఎన్ మూర్తి, పోతుల లక్ష్మీనరసింహులు, కడియాల కొండన్న, పరమేశ్వర్, శివ, పవన్‌తోపాటు నాయకులు పాల్గొన్నారు.విధుల్లోకి తీసుకోవాలని వినతనగర పాలక సంస్థలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను వయోపరిమితి సాకుతో తొలగించడం దారుణమని, తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఎస్సీ మున్సిపల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు అజయ్‌బాబు డిమాండ్ చేశారు. ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఎమ్మెల్యేని కలిసి వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు తిరుపాలు, ఉపాధ్యక్షులు సురేషబాబు, వెంకటప్ప, చిరంజీవి, ఓబుళేసు, రాఘవ, గంగాధర్, అంజి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మాఫియా లేడీ డాన్ కామాక్షమ్మ ఇంటిని కూల్చివేసిన స్థానికులు



**అమరావతి, డిసెంబర్ 02:** నెల్లూరులో సీపీఎం నేత హత్య కేసులో ప్రధాన నిందితురాలు, గంజాయి మాఫియా లేడి డాన్ కామాక్షమ్మకు చెందిన ఐదు ఇళ్లను మంగళవారం స్థానికులు నేలమట్టం చేశారు. నేరస్తులను పెంచి పోషించడంతోపాటు గంజాయి మాఫియా నడుపుతూ.. కామాక్షమ్మ తమను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేసిందని ఈ సందర్భంగా స్థానికులు మండిపడ్డారు. తమ పిల్లలకు గంజాయి అలవాటు చేసి.. వారి జీవితాలతో చెలగాటం ఆడిందని వారు వాపోయారు. ఇదేమిటని ప్రశ్నించిన వారిపై ఆమె అనుచరులు తీవ్రంగా దాడి చేయడమే కాకుండా హత్యాయత్నాలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచలయ్య హత్య కేసులో కామాక్షమ్మతోపాటు ఇతర నిందితులను కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.స్థానిక ఆర్డీటీ కాలనీలో కూల్చివేసిన ఇళ్లలో కామాక్షమ తన తల్లి సోదరులతో నివాసం ఉంటుంది. ఈ కాలనీలోని నివాసాలను కేంద్రంగా చేసుకుని ఆమె పలు అరాచకాలకు పాల్పడిందని స్థానికులు వివరించారు. సీపీఎం నేత పెంచలయ్య హత్య కేసులో ప్రధాన నిందితులంతా కామాక్షమ్మతోపాటు ఆమె అనుచరులేనని స్థానికులు వివరిస్తు న్నారు. కొన్ని ఏళ్లుగా కామాక్షమ్మతోపాటు ఆమె అనుచరులు ఇక్కడే ఉంటూ.. ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా వీరంతా.. యువతకు గంజాయి అలవాటు చేసి తమ నేర సామ్రాజ్యాన్ని విస్తరించారని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో కామాక్షమ్మ, ఆమె మరిదితోపాటు పలువురు అనుచరులపై వివిధ నేరాల కింద పోలీసులు కేసులు నమోదు చేశారని స్థానికులు వివరించారు. ఎన్నో ఏళ్లుగా ఆమె చేస్తున్న అరాచకాలు భరిస్తున్నామని పేర్కొన్నారు. ఇటీవల ఆమెను పోలీసులు అరెస్ట్ చేశారు. దాంతో స్థానికులు, సీపీఎం నేతల ఆగ్రహం ఒక్కసారిగా కట్టలు తెంచుకుంది. దాంతో కామాక్షమ్మతోపాటు ఆమె బంధువులు, అనుచరుల కూలగొట్టారు.

# నర్సింగ్ విద్యార్థినిపై కెమికల్ దాడి - హనుమకొండ జిల్లాలో కలకలం



**హనుమకొండ జిల్లా :** ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఓ నర్సింగ్ కళాశాల విద్యార్థిని కాళ్లపై అకస్మాత్తుగా గుర్తు తెలియని రసాయనం పడి గాయాలైన ఘటన హనుమకొండ జిల్లా కాజీపేట సమీపంలోని కడిపికొండ ప్రాంతంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలానికి చెందిన విద్యార్థిని తన అమ్మమ్మ వద్ద ఉంటోంది. ఈ విద్యార్థిని హనుమకొండలోని ఓ ప్రైవేటు నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతోంది. రోజూ బస్సులో కళాశాలకు వెళ్లే విద్యార్థిని, సోమవారం తన స్కూటీపై వెళ్లి, అక్కడి నుంచి తిరిగి అమ్మమ్మ ఇంటికి తిరుగు ప్రయాణమైంది.కాలు భాగంలో గాయం : కడిపికొండ మీదుగా ప్రయాణిస్తున్న సమయంలో గ్రామ పంచాయతీ పాత భవనం వద్దకు రాగానే కాళ్లపై ఏదో పడినట్లుగా ఆమెకు అనిపించింది. ఆగి చూసుకోగా మొదట చల్లగా, ఆ తర్వాత కాళ్లపై మంటగా అనిపించింది. చుట్టుపక్కలవారు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ఆమెను 108 వాహనంలో ఎంజీఎం ఆసుపత్రికి సదరు వ్యక్తి విద్యార్థిని ఏ మార్గంలో ప్రయాణిస్తుందనే సమాచారాన్ని మరో వ్యక్తికి మొబైల్? ఫోన్లో చేరవేసినట్లుగా అనుమానిస్తున్నారు. ఈ క్రమంలోనే ఎదురుగా మరో వాహనంపై వచ్చిన ముగ్గురు యువకుల్లో ఇద్దరు వాహనం ఆపి విద్యార్థిపై రసాయనం చల్లినట్లుగా కూడా స్థానికంగా ప్రచారం జరుగుతోంది. విద్యార్థిని హెల్మెట్? ధరించడంతో తల భాగంలో మాత్రం ఎలాంటి గాయం కాలేదంటున్నారు. యాసిడ్ దాడిగా ప్రచారం జరగటంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది.

# సిద్దిపేట జిల్లా లో బీఆర్ఎస్‌లోకి వలసల వెల్లువ కాంగ్రెస్, బీఎస్పీ ఖాళీ



**సిద్దిపేట జిల్లా :** కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, కేసీఆర్ అభివృద్ధి పాలనను కోరుకుంటూ సిద్దిపేట జిల్లాలో బీఆర్ఎస్ పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయి. కుకునూరుపల్లి, గజ్వేల్, జగదేవ్‌పూర్ మండలాలకు చెందిన కాంగ్రెస్, బీఎస్పీ పార్టీల కీలక నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు గజ్వేల్‌లో మాజీ మంత్రి హరీశ్ రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి హరీశ్ రావు గులాబీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. అవ్వ తాతలకు నెలకు 4 వేల పెన్షన్ ఇస్తామని బాండ్లు రాసిచ్చి, అధికారంలోకి వచ్చాక మొండిచేయి చూపారని విమర్శించారు. రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. యాసంగి రైతుబంధు పడలేదని, 2 లక్షల రుణమాఫీ సగం మందికి కూడా పూర్తి కాలేదని.. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం గోస పెడుతుందని మండిపడ్డారు. ఎన్నికలప్పుడు కాంగ్రెస్ నాయకులు ఆర్భాటంగా ఆడబిడ్డ పెళ్లికి లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పారని హరీశ్‌రావు గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చి రెండేళ్లు అయిందని.. ఒక్కరికైనా తులం బంగారం ఇచ్చారా? అని ప్రశ్నించారు. కొత్తవి దేవుడెరుగు, ఉన్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను కూడా నెలల తరబడి పెండింగ్ లో పెట్టి పేదల పెళ్లిళ్లకు సాయం చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు.గతంలో సర్పంచ్‌లు చేసిన పనులకు బిల్లులు ఆపివేసి వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని తెలిపారు. బిల్లులు ఇవ్వాలని అడిగిన పాపానికి సర్పంచ్‌లను కాంగ్రెస్ ప్రభుత్వం జైలు పాలు చేసిందని పేర్కొన్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసినా ఎన్నికలు నిర్వహించకుండా, ప్రత్యేక అధికారుల పాలన తెచ్చి గ్రామాలను ఆగం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు



**రాయపోల్, డిసెంబర్ 02 :** గ్రామపంచాయతీ ఎన్నికల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని తొగుట సీఐ లతీఫ్ అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని రాంసాగర్, వడ్డేపల్లితోపాటు పలు గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంలో ప్రజలకు పూర్తి భరోసా కల్పించడానికే గ్రామంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరుగుతుందన్నారు.ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ప్రజలు నిర్భయంగా పోలింగ్‌లో పాల్గొనాలని తెలిపారు. ఎన్నికల నియమావళిని ప్రతీ ఒక్కరూ ఖచ్చితంగా పాటించాలన్నారు. ఎలాంటి ప్రలోభాలు, బెదిరింపులకు పాల్పడరాదని ప్రజలను హెచ్చరించడమైనది. ఎవరైనా ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏదైనా ర్యాలీ లేదా బహిరంగ సభ నిర్వహించాలంటే తప్పనిసరిగా సంబంధిత మండల తహసీల్దార్, పోలీస్ వారి నుండి ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు.

# మల్కెపల్లి షెడ్యూల్ ఏరియాపై హై కోర్టులో వాదనలు




**కాసిపేట, డిసెంబర్ 2 :** మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని మల్కెపల్లి గ్రామ పంచాయతీ షెడ్యూల్ ఏరియాపై పలువురు గ్రామస్తులు హై కోర్టును ఆశ్రయించగా మంగళవారం వాదనలు కొనసాగాయి. వచ్చే వారంలో తీర్పు విలువడే అవకాశం ఉందని ఈ కేసును వాదిస్తున్న హై కోర్టు న్యాయవాది వెంటేశ్వర్లు తెలిపారు. రెవెన్యూ రికార్డులకు విరుద్ధంగా నాన్ షెడ్యూల్ ఏరియాగా ఉన్న మల్కెపల్లి గ్రామాన్ని అధికారులు షెడ్యూల్ ఏరియాగా కొనసాగించడం అన్యాయమని, దీనిపై చర్యలు తీసుకొని మల్కెపల్లి గ్రామ పంచాయతీని నాన్ షెడ్యూల్ ఏరియాగా ప్రకటించాలని కోరుతూ గ్రామానికి చెందిన కసాడి శ్రీనివాస్, పలువురు గ్రామస్తులు హై కోర్టును ఆశ్రయించారు.ఈ మేరకు నాన్ షెడ్యూల్ ఏరియా ఉన్నటువంటి అన్ని ఆధారాలు సమర్పించినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా అధికారుల నుంచి ఎటువంటి సమాధానం రాకపోవడంతో అన్ని ఆధారాలు ఉండగా వచ్చే వారం తుది తీర్పు వచ్చే అవకాశం ఉందని, నాన్ షెడ్యూల్ ఏరియాగా ప్రకటించే విధంగా అనుకూలంగా వచ్చే అవకాశం ఉందని న్యాయవాది తెలిపారు.

# హరీష్ రావు చేతిలోకి బీజేపీ సామ రామ్మోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు!



**హైదరాబాద్, 2 డిసెంబర్:** తెలంగాణ రాజకీయాల్లో త్వరలో సంచలనం జరగబోతుందని టీపీసీసీ మీడియా అండ్ కమ్యూనికేషన్స్ ఛైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు చేతిలోకి తెలంగాణ బీజేపీ రిమోట్ కంట్రోల్ వెళ్లిపోయిందని సంచలన ఆరోపణలు చేశారు. హరీష్ రావు చేతిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, బీజేఎల్పీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి కీలు బొమ్మల్లా మారిపోయారని అన్నారు. ఇక నుంచి హరీష్ కార్యక్రమాలను కేటీఆర్ కంటే ఎక్కువగా ప్రచారం వచ్చే విధంగా బీజేపీ రాష్ట్ర నాయకత్వం ప్రణాళిక చేస్తోందని చెందారు. తెలంగాణ రాజకీయాల్లో ఇద్దరు కీలక నేతలు.. హరీష్ రావు, ఈటల రాజేందర్ వ్యూహంలో ఇప్పుడు బీజేపీ చిక్కిందని అన్నారు. ప్రస్తుతం సామ చేసిన ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో హీట్ పెంచింది. మరోసారి హరీష్ రావు బీజేపీ తీర్థం పుచ్చుకుంటారనే వార్తలకు ఆద్యం పోసినట్టయింది.గులాబీ గూటి నుంచి.హరీష్ రావు బీజేపీలో చేరుతారంటూ వస్తున్న వార్తలు కొత్తేమి కాదు. గతంలో కూడా హరీష్ గులాబీ గూటి నుంచి ఎగిరిపోయి కాషాయ జెండా కప్పుకుంటున్నారని అనేక వార్తలు వచ్చాయి. ఈ వార్తలపై హరీష్ రావు పలుమార్లు స్పందించారు. ఆ వార్తలను ఖండించారు. తాను రాజకీయాల్లో ఉన్నంత వరకు బీఆర్ఎస్ పార్టీలోనే ఉంటానని క్లారిటీ ఇచ్చారు. అయితే ఇటీవల బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయబడ్డ ఎమ్మెల్సీ కవిత హరీష్ రావుపై సంచలన ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. హరీష్ రావుతో జాగ్రత్తగా ఉండాలని కేసీఆర్, కేటీఆర్ లకు కవిత సూచనలు చేశారు. కాగా కవిత కూడా హరీష్ రావు బీజేపీ నేతలతో టచ్ లో ఉన్నారని పరోక్షంగా హింట్ ఇచ్చిన విషయం తెలిసిందే. మరి త్వరలో తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిమాణాలు జరుగుతాయని సామ రామ్మోహన్ రెడ్డి చేసిన ట్వీట్ నిజమవుతుందా? లేదా? అనేది వేచి చూడాలి.

# మంత్రిగా చెబుతున్నా ఒక్క థియేటర్‌లోనూ పవన్ సినిమా రిలీజ్ కాదు



**హైదరాబాద్, 2 డిసెంబర్:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇటీవల చేసిన 'కోనసీమ కామెంట్స్' తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. గోదావరి జిల్లాలు మొత్తం పచ్చదనంతో అందంగా ఉంటాయని.. కోనసీమలో కొబ్బరి చెట్లు ఎండి పోవడానికి తెలంగాణ ప్రజల దిష్టి తగలడమే కారణమంటూ పవన్ కళ్యాణ్ చేసిన వ్యామెంట్స్‌పై తెలంగాణ మంత్రులు, నాయకులు తీవ్రంగా స్పందించారు. తాజాగా.. తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పవన్ కళ్యాణ్‌పై తీవ్రస్థాయిలో ఫైరయ్యారు. పవన్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.అసలు వివాదంలోకి వెళితే.. ఇటీవల పవన్ కోనసీమ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భ ంగా కొబ్బరి తోటలు ఎండిపోతున్న దుస్థితిని ప్రస్తావిస్తూ.. 'కోనసీమ కొబ్బరి తోటలకు తెలంగాణ వాళ్ల దిష్టి తగిలింది' అంటూ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల తో పాటు రాజకీయ వర్గాల్లోనూ తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. తెలంగాణ ప్రజలను ఉద్దేశించి చేసిన ఈ వ్యాఖ్యలపై రాష్ట్రవ్యా ప్తంగా నిరసన వ్యక్తమైంది. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా పవన్ మాట్లాడారనే విమర్శలు వచ్చాయి.పవన్ వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తాజాగా తీవ్రంగా స్పందించారు. పవన్ కళ్యాణ్‌కు మంత్రిగా వార్నింగ్ ఇచ్చారు. తెలంగాణ ప్రజలకు పవన్ కళ్యాణ్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని.. లేదంటే పవన్ కళ్యాణ్ నటించిన ఒక్క సినిమా కూడా తెలంగాణలోని ఒక్క థియేటర్‌లో కూడా విడుదల కానివ్వనని హెచ్చరించారు. కోనసీమ కొబ్బరి చెట్లకు తెలంగాణ ప్రజల దిష్టి తగల లేదని.. ఆంధ్ర పాలకుల నిర్లక్ష్యం వల్లే తెలంగాణ ప్రజలు ఫ్లోరైడ్ విషం నీటిని తాగారన్నారు. దశాబ్దాల పాటు తెలంగాణ వెనుకబాటుకు కారణమైన ఆంధ్ర పాలకులను ప్రశ్నించకుండా.. తెలంగాణ ప్రజలపై నిందలు వేయడం సరికాదని ఘాటుగా విమర్శించారు.మంత్రిగా పవన్ కళ్యాణ్‌కు అనుభవం లేకపోవడం వల్లే ఇటువంటి అపరిపక్వ వ్యాఖ్యలు చేస్తున్నారని కోమటిరెడ్డి విమర్శించారు. ఇక తెలంగాణ ప్రజల మనోభావాలను గాయపరిచేలా మాట్లాడిన పవన్ క్షమాపణ చెప్పాల్సిందేనని బీఆర్ఎస్‌తో సహా ఇతర పార్టీల నాయకులు కూడా డిమాండ్ చేస్తున్నారు. ఈ వివాదం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య రాజకీయ సంబంధాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# పంతం నెగ్గించుకున్న రాజగోపాల్ రెడ్డి ఊరి బయటే మద్యం దుకాణాలు



**మునుగోడు :** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.. నిత్యం ఏదో ఒక అంశం మీద స్పందిస్తూ వార్తల్లో నిలుస్తుం టారు. ఈక్ర మంలో గతంలో మద్యం దుకాణాల టెండర్ల ప్రక్రియ సంద ర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. వైన్ షాపులు దక్కించుకున్న వారు.. గ్రామానికి చివర మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలని.. అలానే ఉదయం నుంచే వైన్స్ తెరవద్దని.. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాతే మద్యం అమ్మకాలు ప్రారంభించాలని సూచి ంచారు. దీనితో పాటుగా.. అసలు పర్మిట్ రూములకు అనుమతి ఇవ్వొద్దని.. ఒకవేళ ఇవ్వా ల్సి వస్తే.. సాయంత్రం ఆరు గంటల తర్వాతే వాటిల్లోకి అనుమ తివ్వాలని సూచించిన సంగతి తెలిసి ందే. దీనిపై అప్పట్లో పెద్ద గందరగోళమే చెలరేగింది. కానీ ఈ అంశంలో రాజగోపాల్ రెడ్డి తన మాట నెగ్గించుకున్నారు. మద్యం షాపుల నిర్వహణలో ఆయన సూచనలు అమలు చేస్తున్నారు దుకాణాదారులు. మునుగోడు నియోజకవర్గంలో మద్యం దుకాణాలు దక్కించుకున్న వైన్స్ యజమానులు.. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సూచన మేరకు ఊరి బయటే మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారు. అలానే ప్రతి రోజు మధ్యాహ్నం ఒంటిగంట తర్వాతే మద్యం విక్రయాలు మొదలుపెడుతున్నారు. సాయంత్రం 6 గంటలకు పర్మిట్‌రూంలోకి అనుమతి ఇస్తున్నారు. దీంతో ఎమ్మెల్యే రాజగో పాల్ రెడ్డి తన మాట నెగ్గించుకున్నారని కామెంట్ చేస్తున్నారు స్థానికులు. అన్ని గ్రామాల్లో ఇదే అనుసరిస్తే.. చాలా బాగుం టుందని అభిప్రాయపడుతున్నారు.మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునే సమయంలోనే ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి.. మునుగోడు నియోజకవర్గంలోని మద్యం దుకాణాల యజమానులతో కీలక భేటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మద్యం షాపు ఓన ర్స్‌కు కీలక సూచనలు చేశారు. బెల్ట్ షాపులు నిర్వహించొద్దని, సిండికేట్ ఏర్పడకూడదని.. ఊరి చివరే మద్యం అమ్మకా లు జరపాలని.. అలానే పర్మిట్‌రూంలకు పర్మిషన్ ఇవ్వొద్దని ఎమ్మెల్యే రాజగోపా ల్‌రెడ్డి వారికి సూచించిన సంగతి తెలిసిందే.అనంతరం మద్యం దుకాణాలు దక్కించుకున్న యజమానులతో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి.. హైదరాబాద్‌లోని తన నివాసంలో ప్రత్యేక భేటీ నిర్వహించారు. ఆయన పెట్టిన కండీషన్లకు మద్యం దుకాణాదారులు, వ్యాపారులు ఆమోదం తెలిపారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఊరి బయటే మద్యం షాపులను ఏర్పాటు చేయగా.. తాజాగా సోమవారం వాటిని ప్రారంభించారు. అలానే ఎమ్మెల్యే సూచించనట్లుగానే మధ్యాహ్నం ఒంటి గంట తర్వాతనే మద్యం విక్రయాలు ప్రారంభించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# రాష్ట్రంలోని ఆ 5 పంచాయతీలు, 133 వార్డుల్లో సర్పంచ్ ఎన్నికలు లేనట్లే




**హైదరాబాద్, 2 డిసెంబర్:** తెలంగాణ పంచాయతీ ఎన్నికల హాడావుడి మొదలైంది. ఈక్రమ ంలో తొలి విడత పంచాయతీలకు సంబంధించి నామినేషన్ల పర్వం ముగిసింది. ఇక తొలి విడతలో భాగంగా 4,236 పంచా యతీలకు, 37, 179 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. వీటికి సంబంధించి నామినేషన్ల పర్వ ముగిసింది. ఈ క్రమంలో తొలి విడతలో భాగంగా 5 పంచాయతీలకు, 133 వార్డులకు ఎన్నికలు జరిగే అవకాశం లేదని తెలుస్తోంది. కారణం ఇక్కడ నామినేషన్లు వేయలేదు.తొలి విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక వివరాలు వెల్లడించింది. తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో 5 సర్పంచ్ స్థానాలకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని ఎస్ఈసీ తెలిపింది. అలాగే 133 వార్డుల్లోనూ పోటీకి ఎవరూ ముందుకు రాలేదని.. ఒక్క నామినేషన్ దాఖలు కాలేదని అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని మొత్తం 37, 440 వార్డులకు గాను 133 మినహా మిగతా 37,179 స్థానాలకు.. 85,428 మంది నామి నేషన్లు వేశారుతొలి విడత పంచాయతీ ఎన్నికల్లో 4,236 పంచా యతీల్లో.. 5 మినహా మిగతా 4,231 సర్పంచ్ స్థానాలకు గాను 22,330 మంది నామినేషన్లు వేశారు. ఇదిలా ఉంటే.. 129 సర్పంచ్ స్థానాలకు ఒక్కొక్కరే నామినేషన్లు వేయడంతో అవి ఏకగ్రీవం కానున్నాయి. నామినేషన్ల పరిశీలన పూర్తయిన తర్వాత ఈ వివరాలను ఎన్నికల సంఘం ప్రకటించింది.ఈ నెల 3వ తేదీ వరకు నామినేషన్లు ఉపసంహరించుకోవడానికి గడువు ఉంది. అలానే రెండో విడత ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. మంగళవారంతో ఈ గడువు ముగియనుంది. ఇక తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో 129 సర్పంచి స్థానాలకు ఒక్కొక్కరే నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల ఉపసంహరణ తర్వాత ఏకగ్రీవాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు అధికారులు.సర్పంచ్ పదవికి ఒకే ఒక్క నామినేషన్ దాఖలైన పంచాయతీల విషయానికి వస్తే.. ఆదిలాబాద్ జిల్లా అత్యధిక ఏకగ్రీవాలతో ప్రథమ స్థానంలో ఉంది. ఆదిలాబాద్ జిల్లాలో ఏకంగా 30 చోట్ల ఒక్కొక్కరే నామినేషన్లు వేశారు. ఆ తర్వాత స్థానాల్లో వికారాబాద్ (16), నిర్మల్ (9), కుమురం భీం ఆసిఫాబాద్, మెదక్, నారాయణపేట, సిద్దిపేట, నిజామాబాద్ 6 చొప్పున ఉన్నాయి. ఇక కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, జనగామ జిల్లాల్లో 5 చొప్పున ఏకగ్రీవా లయ్యాయి. ఆ తర్వాత ఖమ్మం, రంగారెడ్డి (4), నాగర్ కర్నూల్, భద్రాద్రి కొత్తగూడెం, వనపర్తి (3), వరంగల్, మంచిర్యాల, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, (2), ఉమ్మడి వరంగల్‌లోని గ్రామాలు, జగిత్యాలఒక్కొక్కటి చొప్పున ఏకగ్రీవం అయ్యాయి.

# ఆర్టీసీకి చెల్లించాల్సిన 2072 కోట్లు తక్షణమే చెల్లించాలి




ఆర్టీసీని కాంగ్రెస్ ప్రభుత్వం మరింత అప్పుల ఊబిలోకి నెట్టివేస్తోందని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.బాబు, ఈదురు వెంకన్న ఆరోపించారు. మహాలక్ష్మీ పథకంలో భాగంగా జారీ చేసిన జీరో టికెట్లకు సంబంధించి ప్రతి నెల రూ.350 కోట్లు ఆర్టీసీకి చెల్లిస్తామని హామీ ఇచ్చి, ప్రతి నెల అరకొర నిధులను విడుదల చేస్తున్నారని మండిపడ్డారు.ఆర్టీసీలో రెండేండ్లుగా మహాలక్ష్మీ పథకం విజయవంతంగా అమలు జరుగుతోందని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు. దీనికి సంబంధించి ఆర్టీసీకి రాష్ట్ర ప్రభుత్వం రూ. 8,700 కోట్లు ఇవ్వాల్సి ఉండగా, కేవలం 6,620 కోట్లే విడుదల చేసి మొత్తం చెల్లించినట్లుగా ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని విమర్శించారు. కానీ ఆర్టీసీకి చెల్లించాల్సిన సొమ్ము సుమారు 2,072 కోట్లు ఇవ్వకుండా, ఆ భారాన్ని ఆర్టీసీ మీదనే ప్రభుత్వం రుద్ది చేతులు దులుపుకోవడం సమంజసం కాదని అన్నారు. అలాగే ఆర్టీసి ఉద్యోగులకు చెల్లించాల్సిన 2017 వేతన సవరణ బకాయిలు.. 2021, 2025 వేతన సవరణలు అమలుకు నోచుకోవడం లేదని తెలిపారు. ఆర్టీసీకి బకాయి పడ్డ డబ్బులను వెంటనే విడుదల చేసి ఇచ్చిన మాట నిలుపుకోవాలని కోరారు.మహాలక్ష్మి పథకం అమలు సజావుగా అవుతున్నదని సంబరాలు చేసుకుంటున్న ప్రభుత్వం.. పథకానికి అవసరమయ్యే బస్సులను సమకూర్చడంలో, సిబ్బందిని నియమించడంలో, ఈ పథకం వల్ల ఎదురయ్యే ఇబ్బందులను నివారించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఆర్టీసీలో రిటైర్ అయిన ఉద్యోగులు క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీలో పొదుపు చేసుకున్న మొత్తాలకు చెల్లించాల్సిన వడ్డీ 15 నెలలుగా చెల్లించకపోవడం వలన కార్మికులు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆర్టీసీపై సవతి ప్రేమను విడనాడి తక్షణమే 2,072 కోట్ల రూపాయలను విడుదల చేసి ప్రభుత్వం చిత్తశుద్ధి చాటుకోవాలన్నారు.

# పార్లమెంటులో విపక్షం రచ్చ రాజకీయం !



పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఊహించినట్లుగానే వాయిదాలతో మొదలయ్యాయి గతానికి భిన్నాంగా సమావేశాలు ప్రారంభం కాలేదు. గతంలోనూ ఇలాగే వాయిదాల మీద వాయిదాలు పడుతూ..మధ్యమధ్యలో ప్రభుత్వం తనకు కావాల్సిన ఎజెండాను పూర్తి కానిచ్చుకుని, నిరవధికంగా వాయిదా వేస్తూ వస్తోంది. ఇదే తంతు గత కొన్నేళ్లుగా చూస్తున్నాం. గొడవ చేయడం, తాము పట్టిన అంశంపైనే చర్చించాలని విపక్షం పట్టుబట్టడం..ప్రభుత్వం ససేమిరా అనడం..వాయిదా పడడం కూడా గత సమావేశాల్లో చూశాం. ఇప్పుడు కూడా అందుకు భిన్నంగా ఏమీ జరగడం లేదు. విపక్షాలు ఇదే పెద్ద విజయంగా భావిస్తున్నాయి. కోరుకున్న అంశంపై ఎలా చర్చించాలో తెలియని వారంతా పార్లమెంటులో ఎంపిలుగా ఉన్నారు. ఏ రూల్ కింద కోరితే చర్చకు వస్తుందో అందరికీ తెలుసు. కానీ రూల్ బ్రేక్ చేసి, పట్టుబట్టి చర్చించాలని కోరుకోవడం దుర్మార్గం. పార్లమెంటులో ప్రజల సమస్యలపై చర్చించడం ద్వారా ప్రతిపక్షం ప్రధాన బాధ్యతను తీసుకోవాలి. కానీ గత దశాబ్దకాలంగా అలాంటి సంప్రదాయం తుంగలో తొక్కారు. గొడవ చేయడం విపక్షం వంతయితే..వాయిదా వేయడం ప్రభుత్వం విధానంగా మారింది. ఈ క్రమంలో సోమవారం ప్రారంభమైప పార్లమెంట్ శీతాకాల సమావేశాలు తొలిరోజే వాయిదాతో మొదలయ్యాయి. పార్లమెంటు కార్యకలాపాలను శాంతియుతంగా ముందుకు తీసుకెళ్లకుండా మొండిగా వ్యవహరించడంలో ఇరుపక్షాలు తమవంతు పాత్రను సమర్థంగా నిర్వహించాయి. ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ పక్రియపై అత్యవసర చర్చ జరపాలని, ప్రతిపక్షాలు డిమాండ్ చేయడం, దానిని తిరస్కరించడం ద్వారా విలువైన పార్లమెంట్ సమయం తొలిరోజు, మలిరోజు ఢిల్లీ కాలుష్యంలో కలిసి పోయాయి. సర్ ద్వారా నకిలీ, చనిపోయిన వారి ఓట్లను తొలగిస్తే విపక్షాలకు అభ్యంతరం ఎందుకన్నది మొదట చర్చించాలి. దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన వారు ఇక్కడ ఓటు ఎలా పొందారన్నది రెండో ప్రశ్న. ఈ రెండింటికీ విపక్షాల వద్ద సమాధానం లేదు. ఒక రాజ్యాంగా సంస్థ ఎన్నికల సంఘం చేపట్టిన ప్రక్రియను అడ్డుకోవడం రాజ్యాంగాన్ని వ్యతిరేకించడమే అవుతుంది. రాజ్యాంగ బుక్‌ను పట్టుకుని ఊరేగుతున్న రాహుల్, ఆయన అనుచరగణానికి ఇది కూడా తెలియకపోవడం మూర్ఖత్వంగానే చూడాలి. రాజ్యాంగ ప్రసాదించిన హక్కుల గురించి మాట్లాడుతున్న రాహుల్ పరివారం దీనిని ఎందుకు వ్యతిరేకిస్తున్నారో చెప్పాలి. రాజ్యాంగ సంస్థ అయిన ఎన్నికల సంఘాన్ని తక్కువ చేసి మాట్లాడడం, వారు చేసే ప్రక్రియలను అడ్డుకోవడం రాజ్యాంగ రక్షణ అవుతుందా అన్నది రాహుల్ చెప్పాలి. ఓట్ల తొలగింపు ప్రక్రియలో ఎవరి ఓటయినా గల్లంతయితే నిలదీయా లి. ఇప్పటికే సుప్రీం గడప దొక్కిన రాహుల్ ఒక్క ఓటుపైనా అఫిడవిట్ దాఖలు చేసి ఆధారాలు చూపలేక పోయారు. బీహార్‌లో ఓటమి అన్నది రాహుల్ స్వయంకృతం తప్ప మరోటి కాదు. ఇవన్నీ కూడా తెలిసి చేస్తున్నవే తప్ప మరోటి కాదు. ఇందులో ప్రజలపై వారికి ఎలాంటి ప్రేమా లేదు. కేవలం అధికార దాహంతో చేస్తున్నవే. అలా కానట్లయితే పార్టమెంటులో చర్చకు నోటీస్ ఇచ్చి, తగిన సమయంలో చర్చించవచ్చు. కానీ అలా చేయడం లేదంటే..రచ్చ చేయడం వారి లక్ష్యంగా కనిపిస్తోంది. ఇటీవల చనిపోయిన వారి ఆధార్ నంబర్లు దాదాపు 2కోట్లను ఉడాయ్ రద్దు చేసింది. అంటే అది తప్పుచేసినట్లుగా భావించాలా చనిపోయిన వారి ఓట్లు, ఊరుమారిన వారి ఓట్లు, అక్రమంగా దేశంలో ఓటర్లుగా నమోదైన విదేశీయుల ఓట్లను అలాగే ఉంచుమంటారా అన్నది రాహుల చెప్పాలి. నిజానికి అధికారంలోకి రావడమే లక్ష్యంగా రాహుల్ చేస్తున్న యాగీలో భాగమే ఈ ఓటు రచ్చ. ప్రజలు ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలను పక్కన పెట్టి తొలిరోజే పార్లమెంటరీ సాంప్రదాయాలను ప్రతిపక్షాలు తుంగలో తొక్కాయి. ఫలితంగా లోక్‌సభ వరుసగా రెండ్రోజులు పూర్తిగా స్తంభించిపోయింది. రాజ్యసభలో ప్రతిపక్షాలు వాకౌట్ చేశాయి. ఇది ఇలాగే కొనసాగుతుంది తప్ప కొత్తగా వీరినుంచి ఆశించడానికి ఏమీ ఉండదు. ఎందుకంటే..ఎస్ఐఆర్‌పై పార్లమెంటు దద్దరిల్లింది. ప్రతిపక్షాల ఆందోళనతో లోక్‌సభలో వాయిదాల పర్వం నడిచింది. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీసాం..అని చెప్పుకోవడానికి తప్ప మరోటి కాదు. అందుకే తొలిరోజే.. ఎస్ఐఆర్‌పై చర్చించాలని పట్టుపడుతూ ప్రతిపక్ష సభ్యులు సభా వేదిక వద్దకు దూసుకెళ్లారు. ఇలా వారు అధికారంలో ఉ న్నప్పుడు బిజెపి కూడా చేసిన తతంగమే. ఇది కూడా తమ పోరాటంగా వారు భావిస్తున్నారు. పార్లమెంటు ను స్తంభింప చేయడం అన్నది ఓ విజయంగా భావిస్తున్నారు. సర్‌పై ఎలాగూ ప్రభుత్వం వెంటనే చర్చకు అనుమతించదు. ఎందుకంటే వాయిదా తీర్మానం అన్నది కొంపలు మునిగే సమయంలో మాత్రమే అనుమతిస్తారు. అందుకే విపక్షాలు ఇచ్చిన తీరర్మానాన్ని స్పీకర్ ఓంబిర్లా తిరస్కరించడంతో వేదిక వద్దనే ప్రతిపక్ష ఎంపీలు ఆందోళనకు దిగారు. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, ఎస్ఐఆర్ ను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయొద్దంటూ నినదించారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలపై స్పీకర్ ఓం బిర్లా స్పందిస్తూ అన్ని అంశాలపై చర్చకు సిద్ధమే నని స్పష్టం చేశారు. ప్రజలు మిమ్మల్ని పార్లమెంట్‌కు పంపింది. నినాదాలు, ఆందోళనలు చేయడానికి కాదని స్పష్టం చేశారు.. ఇలా రెండోరోజూ ఇదే సీన్ రిపీట్ అయ్యింది. గతంలో ఆదానీ విసయంలో కూడా ఇలాగే చేశారు. పార్లమెంట్‌ను స్తంభింప చేయడం విజయమనుకుంటే ప్రజలకు జవాబు చెప్పాలి. పార్లమెంట్ అన్నది ప్రజల సొత్తు. కవలం 20,30 మంది ఎంపిలది కాదని గుర్తించాలి. ప్రతిపక్షాలు ఎస్ఐఆర్ అంశంపై అత్యవసర చర్చకు డిమాండ్ చేశాయి. ప్రతిపక్షాల డిమాండ్‌ను పరిశీలిస్తున్నామని, అత్యవసర చర్చ సాధ్యం కాదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. ఆందోళన చేస్తున్నారంటే రాజకీయం తప్ప మరోటి కాదు. ఇలాంటి విపక్షాల వల్లనే పార్లమెంటులో ఏ సమస్యా చర్చకు రావడం లేదు. ప్రభుత్వం కూడా ఇదే కోరుకుంటోంది.

# కర్నాటకలో బ్రేక్‌ఫాస్ట్ రాజకీయాలు

**డికె ఇంటికి వచ్చి అల్పాహారం చేసిన సిద్దు**

**అధిష్టానం కోరుకుంటే డికె సిఎం అవుతారని కామెంట్**



**బెంగళూరు,డిసెంబర్ 2:** కర్ణాటకలో నాయకత్వ మార్పు ఊహాగానాలు కొనసాగుతున్నాయి. ఈ ఊహాగానాల వేళ బ్రేక్‌ఫాస్ట్ రాజకీయాలు తెరపైకి వచ్చాయి. సీఎం మార్పుపై జరుగుతున్న ప్రచారం వేళ రెండు రోజుల క్రితం సీఎం సిద్ధరామయ్య నివాసానికి డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ వెళ్లిన విషయం తెలిసిందే. తాజాగా ఇప్పుడు డీకే ఇంటికి సీఎం సిద్ధూ బ్రేక్‌ఫాస్ట్‌కు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. తన ఇంటికి వచ్చిన సీఎంకు డీకే ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరూ కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశారు. బ్రేక్‌ఫాస్ట్ మీట్‌లో పలు అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది కర్ణాటకలో సీఎం సీటుపై రగడ కొనసాగుతున్న వేళ.. మరోసారి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశారు. మంగళవారం ఉదయం ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నివాసానికి సీఎం సిద్ధరామయ్య వెళ్లారు. అనంతరం డీకే శివకుమార్‌కు సీఎం పదవిపై సిద్ధరామయ్య మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. అధిష్ఠానం ఎప్పుడు ఆదేశిస్తే.. అప్పుడే డీకే సీఎం అవుతారన్నారు. ప్రస్తుతం తమ పార్టీ 2028 ఎన్నికలు, స్థానిక ఎన్నికల పైనే ప్రధానంగా దృష్టిసారించినట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలే పార్టీ ప్రధాన లక్ష్యమని ఇరువురు నేతలు పేర్కొన్నారు. అల్పాహారం అనంతరం డీకేతో అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం, రైతుల సమస్యలు సహా పలు ఇతర విషయాలపైనా చర్చించినట్లు సిద్ధరామయ్య తెలిపారు. ఈ విషయాల్లో చర్చలు జరపడానికి పార్టీ హైకమాండ్ పిలిస్తే తాము ఇద్దరం దిల్లీకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వంలోని నేతలంతా ఐక్యంగా ఉన్నామని.. రాష్ట్రాభివృద్ధి కోసం కలిసి పని చేస్తున్నామన్నారు. 2028 ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ముందుకు వెళు న్నామన్నారు. డిసెంబర్ 8న కాంగ్రెస్ ఎంపీల సమావేశం నిర్వహించడానికి ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇటీవల డీకే శివకుమార్ సిద్ధరామయ్య నివాసానికి వెళ్లి.. అల్పాహారం చేసిన విషయం తెలిసిందే. అనంతరం ఇరువురు మీడియాతో మాట్లాడుతూ.. నాయకత్వ మార్పుపై కొద్ది రోజులుగా అందరిలో ఉన్న గందరగోళానికి తెరదించేందుకే ఈ బ్రేక్‌ఫాస్ట్ భేటీ జరిగిందన్నారు. భాజపా-జేడీఎస్ తమపై అసత్య ప్రచారాలు చేస్తోందని దుయ్యబట్టారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను ఉమ్మడిగా ఎదుర్కొంటామన్నారు. తమ మధ్య గతంలో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని.. ఇకముందు కూడా ఉండబోవని స్పష్టంచేశారు. ఇందులోభాగంగానే నేడు మరోసారి డీకే నివాసంలో భేటీ అయ్యారు.

# ఇమ్రాన్ పరిస్థితిపై ఆందోళన

**రోడ్డుపైకి వచ్చిన పార్టీ కార్యకర్తలు**

**రావల్పిండిలో ఆందోళనలు..నిషేధాజ్ఞలు అమలు**



**లాహోర్,డిసెంబర్ 2:** పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ మృతి చెందినట్లు వస్తోన్న వార్తల నేపథ్యంలో పాక్‌లో ప్రజాందోళన మిన్నంటింది. ఇమ్రాన్ ఖాన్‌ను ఎందుకు దాస్తున్నారంటూ ప్రజలు రోడ్డెక్కింది ఆందోళనకు దిగారు. దీంతో రావల్పిండిలో తీవ్ర ఉద్రిక్త పరిస్తితులు ఏర్పడ్డాయి. అయితే ఇమ్రాన్ మృతిని ఆ దేశ ప్రభుత్వం ఖండించిన సంగతి తెలిసిందే. అయితే ఇమ్రాన్‌ఖాన్‌ను చూసేందుకు ఆయన కుటుంబసభ్యులను అనుమతించకపోవడం, అతని ఆరోగ్య పరిస్థితిపై ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో ఇమ్రాన్ పార్టీ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ కార్యకర్తలు దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. మంగళవారం మాజీ ప్రధానికి అనుకూలంగా భారీ ర్యాలీకి రంగం సిద్ధం చేశారు. ఆందోళనకారులను అడ్డుకొనేందుకు ప్రభుత్వం రావల్పిండిలో సెక్షన్ 144 విధించింది. ప్రజా భద్రత దృష్ట్యా బుధవారం వరకు అన్ని బహిరంగ సభలు, ర్యాలీలు నిషేధిస్తూ.. ఉత్తర్వులు జారీ చేసింది. కొన్ని గ్రూపులు రావల్పిండిలో శాంతిభద్రతలకు భంగం కలిగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు జిల్లా ఇంటెలిజెన్స్ కమిటీ వెల్లడించింది. ఈ పరిణామాల వేళ ఇమ్రాన్‌ఖాన్ కుమారులు ఖాసీం, సులేమాన్ మీడియాతో మాట్లాడుతూ.. తమ తండ్రి విషయంలో ఏదో జరగకూడనిది జరిగినట్లు అనుమానం వ్యక్తంచేశారు. ఆయన సురక్షితంగా ఉన్నారా, లేదా ఆరోగ్యంగా ఉన్నారా, మరణించారా అనే విషయాలు వెల్లడించకుండా జైలు అధికారులు తమను మానసికంగా హింసిస్తున్నారన్నారు. కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ.. తమ తండ్రిని చూసేందుకు అనుమతించట్లేదన్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై తమకు ఎలాంటి సమాచారం అందట్లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గత నెలన్నర రోజుల నుంచి ఆయనను ఎవరూ కలవకుండా 'డెత్ సెల్'లో ఒంటరిగా నిర్బంధించినట్లు వస్తున్న వార్తలు తమను ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. ఇమ్రాన్ ఖాన్ 2023 ఆగస్టు నుంచి అడియాలా జైలులో ఉన్న విషయం తెలిసిందే. అయితే, ఆయన మృతి చెందినట్లు సోషల్‌మీడియాలో ఒక్కసారిగా వదంతులు తెర పైకి వచ్చాయి. బలూచిస్థాన్ రెబల్స్‌కు చెందిన 'ఎక్స్' ఖాతాలో దీనికి సంబంధించిన పోస్ట్ చేసింది. పాక్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ అసీమ్ మునీర్, నిఘా విభాగం ఐఎస్ఐ కలిసి ఆయన్ని హతమార్చినట్లు వార్తలు వస్తున్నాయని రాసుకొచ్చింది. అలాగే పలు మీడియా సంస్థలు కూడా దీనికి సంబంధించి వార్తలను ప్రచురించినట్లు సామాజిక మాధ్యమాల్లో పలువురు పోస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో ఇమ్రాన్ సోదరీమణులు ఇటీవల జైలు వద్దకువెళ్లి ఆయనను కలిసేందుకు ప్రయత్నించగా.. పోలీసులు


# గంజాయి డాన్ కామాక్షమ్మకు చెక్

**● ఆమె ఐదు ఇళ్లను నేలమట్టం చేసిన జనం**

**నెల్లూరు,డిసెంబర్ 2:** నెల్లూరులో సీపీఎం నేత హత్య కేసులో ప్రధాన నిందితురాలు, గంజాయి మాఫియా లేడి డాన్ కామాక్షమ్మకు చెందిన ఐదు ఇళ్లను మంగళవారం స్థానికులు నేలమట్టం చేశారు. నేరస్తులను పెంచి పోషించడంతోపాటు గంజాయి మాఫియా నడుపుతూ.. కామాక్షమ్మ తమను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేసిందని ఈ సందర్భంగా స్థానికులు మండిపడ్డారు. తమ పిల్లలకు గంజాయి అలవాటు చేసి.. వారి జీవితాలతో చెలగాటం ఆడిందని వారు వాపోయారు. ఇదేమిటని ప్రశ్నించిన వారిపై ఆమె అనుచరులు తీవ్రంగా దాడి చేయడమే కాకుండా హత్యాయత్నాలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచలయ్య హత్య కేసులో కామాక్షమ్మతోపాటు ఇతర నిందితులను కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.స్థానిక ఆర్డీటీ కాలనీలో కూల్చివేసిన ఇళ్లలో కామాక్షమ్మ తన తల్లి సోదరులతో నివాసం ఉంటుంది. ఈ కాలనీలోని నివాసాలను కేంద్రంగా చేసుకుని ఆమె పలు అరాచకాలకు పాల్పడిందని స్థానికులు వివరించారు. సీపీఎం నేత పెంచలయ్య హత్య కేసులో ప్రధాన నిందితులంతా కామాక్షమ్మతోపాటు ఆమె అనుచరులేనని స్థానికులు వివరిస్తున్నారు. కొన్ని ఏళ్లుగా కామాక్షమ్మతోపాటు ఆమె అనుచరులు ఇక్కడే ఉంటూ.. ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా వీరంతా.. యువతకు గంజాయి అలవాటు చేసి తమ నేర సామ్రాజ్యాన్ని విస్తరించారని పేర్కొన్నారు. నేపథ్యంలో కామాక్షమ్మ, ఆమె మరిదితోపాటు పలువురు అనుచరులపై వివిధ నేరాల కింద పోలీసులు కేసులు నమోదు చేశారని స్థానికులు వివరించారు. ఎన్నో ఏళ్లుగా ఆమె చేస్తున్న అరాచకాలు భరిస్తున్నామని పేర్కొన్నారు. ఇటీవల ఆమెను పోలీసులు అరెస్ట్ చేశారు.



# అతిశయోక్తులు, అవాస్తవాలు




విశాఖపట్టణంలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ నిర్మిస్తున్న ఒక గిగావాట్ హైపర్ స్కేల్ ఏఐ డేటా సెంటర్, మౌలిక సదుపాయాల ప్రాజెక్టు ఏర్పాటు గురించి నవంబర్ 19న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన గుత్తా రోహిత్ వ్యాసంలో అనేక అతిశయోక్తులు, అవాస్తవాలు ఉన్నాయి. మొదటగా గూగుల్ డేటా సెంటర్ ప్రాజెక్టులో అదానీ, ఎయిర్‌టెల్ కేవలం సహాయకులే (ఎనేబ్లర్లు) కానీ భాగస్వాములు కాదు. డేటా సెంటర్ స్థాపనకు అవసరమైన నిర్మాణాలు, గ్రీన్ ఎనర్జీ, మౌలిక వసతుల కల్పన అదానీ గ్రూప్ ఏర్పాటు చేస్తే, సముద్ర గర్భ కేబుల్స్, అంతర్జాతీయ డేటా ట్రాన్సిట్, అంతర్జాల సదుపాయాలను ఎయిర్‌టెల్ సమ కూరుస్తుంది. నిజానికి యూఎస్‌ఏలోని 50 రాష్ట్రాలలో 5,426 డేటా సెంటర్లు, చైనా, యూరోప్, సింగపూర్ తదితర దేశాలలో వందలాది డేటా సెంటర్లు ఉన్నాయి. భారతదేశంలో ప్రభుత్వ డిజిటల్ ఇండియా కార్యక్రమం, డేటా లోకలైజేషన్ విధానాలు, ఇంటర్నెట్ విస్తరణ, స్మార్ట్‌ఫోన్లు, ఈ%-%కామర్స్, డిజిటల్ సేవల విస్తరణ వల్ల డేటా ఉత్పత్తి పరిమాణం విపరీతంగా పెరిగి డేటా సెంటర్ పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రపంచ డేటాలో భారత్ 20శాతం ఉత్పత్తి చేస్తున్నా, ప్రపంచ డేటా సెంటర్ సామర్థ్యంలో దాని వాటా కేవలం మూడు శాతం మాత్రమే. మన డేటా వేరే దేశాల్లో ఉండకూడదని ఇటీవల ప్రభుత్వం విధించిన నిబంధన వల్ల మన దేశంలో డేటా సెంటర్ల ఏర్పాటు అనివార్యం అయ్యింది.గూగుల్ అమెరికా వెలుపల ఇంత భారీ స్థాయి పెట్టుబడులతో భారతదేశంలో తొలి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్ విశాఖలో ఏర్పాటు చేయడం సామాన్య విషయం కాదు.

# టీమ్ఇండియాలో ఏం జరుగుతోంది
# బీసీసీఐ ఆందోళన




ముంబై: స్వదేశంలో దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్ ఆడుతున్న కీలక తరుణంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి .. టీమ్ఇండియా హెడ్‌కోచ్ గౌతం గంభీర్‌తో పాటు చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌తో కీలక సమావేశం ఏర్పాటుచేసింది. బుధవారం రాయ్‌పూర్‌లో జరగాల్సిన రెండో వన్డేకు ముందు ఈ ఇద్దరితోనూ సమావేశమవనున్నట్టు బోర్డు వర్గాలు తెలిపాయి. ఏడాదికాలం వ్యవధిలో భారత టెస్టు జట్టుకు రెండు వైట్‌వాష్‌లు ఎదురవడం, డ్రెస్సింగ్ రూమ్‌లో విభేదాలకు తోడు సీనియర్లు రోహిత్, కోహ్లీతో గంభీర్ కమ్యూనికేషన్ గ్యాప్‌పై వదంతులు వ్యాపిస్తున్న వేళ ఈ సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది. బీసీసీఐ సెక్రటరీ దేవ్‌జిత్ సైకియా, సంయుక్త కార్యదర్శి ప్రభ్‌తేజ్ సింగ్ భాటియా ఈ మీటింగ్‌కు హాజరవనున్నారు. అయితే బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ ఈ మీటింగ్‌కు హాజరవుతాడా? లేదా? అన్నదానిపై మాత్రం స్పష్టత లేదు.నిరుడు టీ20లకు వీడ్కోలు పలికిన రోహిత్, కోహ్లీ.. ఈ ఏడాది టెస్టులకూ గుడ్‌బై చెప్పారు. ఈ దిగ్గజాల రిటైర్మెంట్ వెనుక పరో క్షంగా గంభీర్ హస్తమున్నదని గతంలో పుకార్లు షికార్లు చేశాయి. అదీగాక ఒక్క ఫార్మాట్‌లోనే ఆడుతున్న రోకోతో గంభీర్‌కు విభేదాల కారణంగా డ్రెస్సింగ్ రూమ్‌లో వాతావరణం దెబ్బతింటున్నదన్న విమర్శలూ లేకపోలేదు. ఇది జట్టు ప్రదర్శనపై పడే ప్రభావం ఉండటంతో బీసీసీఐ తక్షణ చర్యలకు ఉపక్రమించినట్టు సమాచారం.అదీగాక రోకో భవిష్యత్‌పైనా ప్రశ్నలు తలెత్తుతున్న నేపథ్యంలో బుధవారం నాటి మీటింగ్‌లో దీనిపై చర్చించే అవకాశమున్నట్టు తెలుస్తున్నది. ఇక టెస్టుల్లో గంభీర్ అనుసరిస్తున్న వ్యూహాలు, జట్టు ప్రదర్శన నానాటికీ తీసికట్టుగా మారుతున్న వేళ.. బీసీసీఐ అతడి నుంచి వివరణ కోరనుందని బోర్డు వర్గాల వినికిడి! టెస్టులకు కోచ్‌గా గంభీర్‌ను తప్పించాలన్న విమర్శలు ఎక్కువవుతున్న నేపథ్యంలో ఈ సమావేశంలో ఏయే అంశాలు చర్చకు వస్తాయనేది ఆసక్తికరం.ఇదే విషయమై బీసీసీఐ ప్రతినిధి ఒకరు మాట్లాడుతూ.. 'స్వదేశంలో టెస్టుల సందర్భంగా మైదానం లోపల, వెలుపల జట్టు వ్యూహాలు గందరగోళపరిచే విధంగా ఉన్నాయి. భారత జట్టు తదుపరి టెస్టు సిరీస్ 8 నెలల తర్వాత ఆడనుంది. ఈ నేపథ్యంలో మేం మరింత స్పష్టత, ముందస్తు ప్రణాళికను కోరుతున్నాం' అని తెలిపాడు. అంతేగాక వచ్చే ఏడాది టీ20 వరల్డ్ కప్, 2027లో వన్డే వరల్డ్ కప్ జరగాల్సి ఉన్న నేపథ్యంలో ఆ టోర్నీల నాటికి జట్టు అంతర్గత సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించుకోవాలని తాము భావిస్తున్నట్టు ఆయన చెప్పాడు.

# కేన్ విలియమ్సన్ ఖాతాలో భారీ రికార్డు




న్యూజిలాండ్ స్టార్ ఆటగాడు కేన్ విలియమ్సన్ ఓ భారీరికార్డును సొంతం చేసుకున్నాడు. క్రైస్ట్‌చర్చ్‌లో (డిసెంబర్ 2)వెస్టిండీస్, కివీస్ మధ్య తొలి టెస్ట్ ప్రారంభమైంది. ఈ మ్యాచ్‌తొలి ఇన్నింగ్స్‌లో 102 బంతుల్లో 6 ఫోర్ల సాయంతో 52 పరుగులు చేసి కేన్ విలియమ్సన్ ఔటయ్యాడు. ఈ క్రమంలో విండీస్‌పై టెస్ట్‌ల్లో 1000 పరుగులు పూర్తి చేసుకున్న రెండో న్యూజిలాండ్ ఆటగాడిగా కేన్(1022) రికార్డుల్లోకెక్కాడు. కేన్‌కు ముందు రాస్ టేలర్(1136) మాత్రమే ఈ ఘనత సాధించాడు. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్ లోనే కేన్ మరో ఘనత కూడా సొంతం చేసుకున్నాడు. టెస్ట్‌ల్లో విండీస్‌పై అత్యధిక 50 ప్లస్ స్కోర్లు చేసిన ప్లేయర్‌గా నాథన్ ఆస్టల్ రికార్డును సమం చేశాడు. కేన్, నాథన్ ఇద్దరూ కరేబియన్ జట్టుపై టెస్టుల్లో చెరో 8 అర్ధ శతకాలు చేశారు.వెస్టిండీస్‌పై తరపున అత్యధిక టెస్ట్ పరుగులు రాస్ టేలర్- 1136 కేన్ విలియమ్సన్ - 1022 గ్లెన్ టర్నర్ - 855 కాంగ్డన్ - 764 నాథన్ ఆస్టల్ - 715ఇక ఈ మ్యాచ్ విషయానికి వస్తే.. తొలి టెస్టులో న్యూజిలాండ్ తడబాటుకు లోనైంది. 120 పరుగులకే సగం వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఓపెనర్ డెవాన్ కాన్వే డకౌటయ్యాక కేన్ విలియమ్సన్, కెప్టెన్ లాథమ్ (24) కాసేపు నిలకడగా బ్యాటింగ్ చేశారు. 94 పరుగుల జట్టు స్కోర్ వద్ద కేన్ ఔట్ కావడంతో పరిస్థితి మారిపోయింది. ఆ తరువాత వెంటనే లాథమ్ కూడా పెవిలియన్ చేరాడు. మరో 8 పరుగుల వ్యవధిలో రచిన్ రవీంద్ర (3) కూడా జేడెన్ సీల్స్ ఔట్ చేశాడు. మరో 17 పరుగుల తర్వాత విల్ యంగ్ (14) కూడా పెవిలియన్‌కు చేరాడు. విండీస్ బౌలర్లలో రోచ్, సీల్స్, లేన్, ఓజే షీల్డ్స్ తలో వికెట్ తీయగా.. గ్రీవ్స్ 2 వికెట్లు పడగొట్టాడు. ప్రస్తుతం 60 ఓవర్లకు ఆరు వికెట్లు కోల్పోయి కివీస్ జట్టు 192 పరుగలు చేసింది. ప్రస్తుతం క్రీజ్ లో బ్రేస్‌వెల్(31), నాథన్ స్మిత్(18) క్రీజ్‌లో ఉన్నారు.

# ఐపీఎల్‌కు మరో స్టార్ ప్లేయర్ దూరం




పీఎల్(2026)కి ముందు మరో ఊహించని పరిణామం ఎదురైంది. కేకేఆర్ స్టార్ ఆల్‌రౌండర్ మొయిన్ అలీ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఐపీఎల్ వేలానికి ముందు ఐపీఎల్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించాడు. ఇప్పటికే కేకేఆర్ డేంజరెస్ ప్లేయర్ ఆండ్రీ రస్సెల్‌కూడా ఐపీఎల్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా మొయిన్ అలీ కూడా అదే బాటలో వెళ్లాడు. ఇటీవల రిటెన్షన్ ప్రక్రియలో భాగంగా రస్సెల్ తో పాటు మొయిన్ అలీని కేకేఆర్ వదిలేసింది. కేకేఆర్ ఫ్రాంచైజీ తనను వదిలించుకోవడం( 2026)తో ఐపీఎల్ మొత్తానికే గుడ్‌బై చెప్పేశాడు. తదుపరి సీజన్ వేలంలోనూ తన పేరు కూడా నమోదు చేసుకోలేదుకేకేఆర్ వద్దనుకోవడంతో మొయిన్ మనస్థాపం చెందినట్లున్నట్లు సమాచారం. ఐపీఎల్ 2025)లో అతను ఆరు మ్యాచ్‌ల్లో మాత్రమే ఆడి.. కేవలం ఐదు పరుగులు మాత్రమే చేశాడు. అలానే కేవలం ఆరు వికెట్లు మాత్రమే తీసుకున్నాడు. ఇలా గత సీజన్ లో మొయిన్ పూర్తిగా విఫలమయ్యాడు. దీంతో రాబోయే సీజన్ కోసం అతన్ని రిటైన్ చేసుకోవకూడదని ఫ్రాంచైజీ నిర్ణయించుకుంది. గత ఐపీఎల్ మెగా వేలంలో మొయిన్ అలీని కేకేఆర్ రూ. 2 కోట్లకు కొనుగోలు చేసింది. కాగా మరోవైపు మొయిన్ అలీ ఐపీఎల్‌ను కాదని పాకిస్థాన్ సూపర్ లీగ్ ఆడేందుకు సిద్ధమయ్యాడు. ఈమేరకు తన ఇన్‌స్టా ఖాతాలో ఓ పోస్ట్ చేశాడు. పీఎస్ఎల్ 2026కి అందుబాటులో ఉంటానని స్పష్టం చేశాడు.ఈ ఇంగ్లాండ్ స్టార్ ఆల్ రౌండర్ ఐదేళ్ల తర్వాత పాకిస్థాన్ సూపర్ లీగ్()లో ఆడనున్నాడు. 2020లో చివరిగా అతను ముల్తాన్ సుల్తాన్స్ జట్టు తరఫున ఆడాడు. కాగా, ఐపీఎల్ 2026కు ముందు కోల్‌కతా నైట్ రైడర్స్ మొయిన్ అలీ, ఆండ్రీ రసెల్‌తో పాటు చాలామంది స్టార్ ఆటగాళ్లను వదిలేసింది. ఆ ఫ్రాంచైజీ విడుదల చేసిన ఆటగాళ్లలో గత సీజన్( 2025) వేలంలో రూ. 23.75 కోట్ల రికార్డు ధర దక్కించుకున్న వెంకటేష్ అయ్యర్‌ను సైతం కేకేఆర్ వదిలేసింది. వీరితో పాటు టీ20 స్పెషలిస్ట్‌లు అయిన డికాక్, స్పెన్సర్ జాన్సన్, నోర్జే, రహ్మానుల్లా గుర్బాజ్‌ను కూడా వేలానికి వదిలేసింది.

# కేంద్రం సంచలన నిర్ణయం ఇక ఇండియాలో నాలుగు బ్యాంకులే




కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. బ్యాంకింగ్ రంగంలో మరో భారీ మార్పుకు శ్రీకారం చుడుతోంది. బ్యాంకుల మలి విడత విలీన ప్రక్రియను చేపట్టేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. ఐదేళ్ల క్రితం 27 ప్రభుత్వ రంగ బ్యాంకులను విలీనం చేసి 12కు తగ్గించారు. అయితే ఈ 12 బ్యాంకుల విలీన ప్రక్రియ చేపట్టి నాలుగు బ్యాంకులుగా చేయాలని కేంద్ర ఆర్థికశాఖ సమాలోచనలు చేస్తోంది. 2026-27 ఆర్థిక సంవత్సరం కల్లా ఈ నిర్ణయాన్ని అమల్లోకి తీసుకురావాలని సన్నాహాలు చేస్తోంది. బ్యాంకింగ్ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్న కేంద్రం.. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని చూస్తోంది. అందుకనుణంగా అడుగులు వేస్తోంది.విలీనం తర్వాత కేవలం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా-యూనియన్ బ్యాంక్ విలీనం తర్వాత ఏర్పడే మరో బ్యాంక్ మాత్రమే ఉండనున్నాయి. అంటే ఇండియాలో ఇక నాలుగు ప్రభుత్వ రంగ బ్యాంకులను మాత్రమే మనం చూడనున్నామన్నమాట. తొలుత చిన్న బ్యాంకులను పెద్ద బ్యాంకుల్లో విలీనం చేయనున్నారు. ఆనంతరం వాటిని నాలుగు బ్యాంకులను ఏర్పాటు చేయనున్నారు. ఎస్‌బీఐలో ఇండియన్ బ్యాంక్, యూకో బ్యాంక్ విలీనం చేయనుండగా.. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలను కలిపి ఒకే బ్యాంక్‌గా మార్చనున్నారు. ఇక ఎస్‌బీఐ, పీఎన్‌బీ, బీఓబీల్లో విలీనం చేసే అవకాశం ఉందని అంటున్నారు. ఆర్థికశాఖ విలీన ప్రక్రియ ఎలా చేపట్టాలనే దానిపై కసరత్తు చేస్తుండగా.. అనంతరం కేబినెట్ ఆమోదానికి పంపనున్నారు.కేబినెట్ ఆమోదం తెలిపిన తర్వాత ప్రధానమంత్రి కార్యాలయానికి ఫైల్ వెళ్లనుంది. అంతేకాకుండా బ్యాంకుల విలీనంపై సెబీ నుంచి ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రణాళికలు తయారుచేస్తున్నారు. భారత్‌కు ప్రపంచస్థాయి బ్యాంకులు అవసరమంటూ ఇటీవల ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆమె వ్యాఖ్యలతో బ్యాంకుల విలీనంపై మళ్లీ చర్చ మొదలైంది. బ్యాంకుల మలి విడత విలీనం మళ్లీ ఉంటుందని నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలు మరింత బలం చేకూర్చాయి.

# 20 ఏళ్ల హోమ్ లోన్ ఈఎంఐ 11 ఏళ్లకే క్లోజ్



సొంతింటి కల అందరికీ ఉంటుంది. మంచి ఇల్లు కట్టుకుని కుటుంబంతో హాయిగా గడపాలని కలలు కంటూ ఉంటారు. ధరలన్నీ పెరిగిన క్రమంలో సొంత ఇల్లు కట్టుకోవాలంటే లక్షలతో కూడుకున్న పని. సామాన్య, మధ్యతరగతి ప్రజలకైతే సొంతిల్లు నిర్మించుకోవడం పెద్ద కష్టమేనని చెప్పాలి. కొంతమంది అప్పు తెచ్చుకుని లేదా బ్యాంక్ నుంచి హోమ్ లోన్ తీసుకుని ఇల్లు నిర్మించుకుంటారు. హోమ్ లోన్ కావాలంటే మీ స్థిరాస్తులు తాకట్టు పెట్టాల్సి ఉంటుంది. ఇందుకోసం చాలా ప్రాసెస్ ఉంటుంది. హోమ్ లోన్ ఈఎంఐ 20 ఏళ్ల వరకు ఉంటుంది. ఇన్ని సంవత్సరాలు కట్టాలన్నా మీకు భారమే అనిపిస్తుంది. అయితే కొన్ని ట్రిక్స్ పాటిస్తే 20 ఏళ్ల ఈఎంఐని కేవలం 11 ఏళ్లలోనే మీరు పూర్తి చేయొచ్చు. దీని వల్ల మీకు డబ్బులు కూడా ఆదా అవుతాయి.ఈఎంఐ పెంచుకోండిమీ జీతం ప్రతీ సంవత్సరం పెరుగుతుంటే.. ఈఎంఐ కూడా పెంచుకోండి. ఇలా ప్రతీ ఏడాది మీరు పెంచుకోవడం వల్ల మీ లోన్‌ను వీలైనంత తక్కువ సంవత్సరాల్లో తీర్చవచ్చు. ఏడాదికి 5 శాతం పెంచుకుంటూ వెళ్లండి. అంతేకాకుండా మీరు 20 ఏళ్లు ఈఎంఐ రూపంలో చెల్లించాలంటే వడ్డీ కూడా ఎక్కువ కట్టాల్సి ఉంటుంది. అదేకాకుండా ముందే క్లోజ్ చేసుకుంటే మీకు వడ్డీ మిగులుతుంది. ఉదాహరణకు మీరు హోమ్ లోన్ రూ.60 లక్షల లోన్ తీసుకుని కాల వ్యవధి 20 ఏళ్లు నిర్ణయించుకున్నారనుకుందాం. మీరు కట్టే ఈఎంఐలో ఎక్కువ భాగం వడ్డీకే పోతుంది. అసలు చాలా స్లోగా తగ్గుతూ ఉంటుంది. ఇలా కట్టుకుంటూ పోతే వడ్డీ పోనూ పదేళ్ల తర్వాత కూడా రూ. 42 లక్షల 60వేలు చెల్లించాల్సి ఉంటుంది. అయతే ప్రతీ ఏడాది ఈఎంఐ కట్టే అమౌంట్ పెంచుకుంటూ పోతే మీరు 11 ఏళ్లల్లోనే లోన్ కంప్లీట్ చేసే అవకాశం ఉంటుంది.అదనపు ఈఎంఐ చెల్లించండిఇక మీరు కట్టాల్సిన ఈఎంఐ కంటే ప్రతీ ఏడాదిలో ఒక అదనపు ఈఎంఐ చెల్లించండి. దీని వల్ల మీ లోన్ టెన్యూర్ తగ్గిపోవడమే కాకుండా త్వరగా చెల్లించడం ద్వారా వడ్డీ కూడా ఆదా అవుతుంది. మీరు బ్యాంక్ బ్రాంచ్‌ను సంప్రదిస్తే మీ ఈఎంఐ అమౌంట్‌ను పెంచుతారు. మీకు హోమ్ లోన్ ఉండి ఈఎంఐ ఎక్కువ కట్టే స్తోమత ఉంటే ఈ ట్రిక్ పాటించడం బెటర్. దీని ద్వారా మీకు డబ్బులు చాలా ఆదా అవ్వడమే కాకుండా లోన్ త్వరగా తీరిపోతే మీకు టెన్షన్ తగ్గుతుంది.

# భయపెట్టిన బంగారం, వెండి ధరలు



ప్రపంచ ఆర్థిక పరిణామాలకు అనుగుణంగా దేశీయంగా బంగారం, వెండి ధరల్లో హెచ్చుతగ్గులు కొనసాగుతున్నాయి. డిసెంబర్ 2, 2025 నాటికి హైదరాబాద్, విజయవాడ, ముంబై, ఢిల్లీ, చెన్నైతో పాటు ఇతర ప్రధాన నగరాల్లో పసిడి, వెండి ధరలు ఎలా ఉన్నాయో ఒకసారి పరిశీలిద్దాం.ఈ ధరల్లో జీఎస్‌టీ, టీసీఎస్, ఇతర స్థానిక పన్నులు, తయారీ ఛార్జీలు చేర్చలేదు. జ్యువెలరీ షాపులను బట్టి ధరల్లో స్వల్ప (హైదరాబాద్/విజయవాడలో 1 గ్రాము ధర) ఈరోజు బంగారం ధరలు నిన్నటితో పోలిస్తే స్వల్పంగా పెరిగాయి.24 క్యారెట్లు (1 గ్రాము): నిన్నటి ధర రూ.12,982 కాగా, నేడు రూ.13,049 (౦రూ. 67) వద్ద ట్రేడ్ అవుతోంది.22 క్యారెట్లు (1 గ్రాము): నిన్నటి ధర రూ. 11,900 కాగా, నేడు రూ. 11,960 (౦రూ. 60) వద్ద ఉంది.తెలుగు రాష్ట్రాలలోని ముఖ్య నగరాలైన హైదరాబాద్, విజయవాడతోపాటు దేశంలోని పలు నగరాల్లో బంగారం ధరలు ఎలా ఉన్నాయో ఓసారి చూద్దాం..ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,36,640 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,19,760 ఉంది.ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,30,490 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,19,610 వద్ద ఉంది.హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,30,490 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,19,610 వద్ద ఉంది.విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,30,490 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,19,610 వద్ద ఉంది.చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,31,680 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,20,710 వద్ద ఉంది.బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,30,490 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,19,610 వద్ద ఉంది.గమనిక: పైన పేర్కొన్న ధరలు పన్నులు, తయారీ ఛార్జీలు లేకుండా ప్రామాణిక ధరలు మాత్రమే. స్థానిక నగల దుకాణాలలో ధరలు కొద్దిగా మారవచ్చు.ఈ క్రమంలో బంగారం ధరలపై మరో షాకింగ్ న్యూస్ వచ్చింది. మరికొన్ని వారాల్లో బంగారం ధరలు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆరు నుంచి ఏడు వారాల తర్వాత బంగారం ధరలు మరింత చేయనున్నాయని బిజినెస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. గత వారం బంగారం ధరలు 3 శాతం పెరిగాయి. ఈ వారం సరికొత్త రికార్డును సృష్టించే అవకాశముందని చెబుతున్నారు. పది గ్రాములకు రూ.5 వేల వరకు పెరగొచ్చనే అభిప్రాయాలు వెలువడుతున్నాయి. ఇండియాలో పెళ్లిళ్ల సీజన్‌తో పాటు %ఖూ% సెంట్రల్ బ్యాంక్ త్వరలో వడ్డీ రేటును తగ్గించే అవకాశముంది. ఇక రష్యా, నాటో, ఉక్రెయిన్ మధ్య వివాదం ముదురుతోంది. ఈ కారణాలు బంగారం ధరల పెరుగుదలకు దారితీయవచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి.ఈ సంవత్సరంలో బంగారం ధరలు 60 శాతం పెరిగాయి. అక్టోబర్ 17న దేశ ఫ్యూచర్స్ మార్కెట్లో బంగారం ఆల్‌టైమ్ గరిష్ట స్థాయికి చేరుకుంది.ఈ వారంలో మరింత గరిష్ట స్థాయికి చేరుకునే ఛాన్స్ ఉందని బిజినెస్ వర్గాలు అంచనా కడుతున్నాయి. ఒకవేళ ఇదే జరిగితే బంగారం ప్రియులకు షాక్‌గా చెప్పుకోవచ్చు.వెండి ధరలు.బంగారంతో పాటు వెండి ధరలు కూడా పెరుగుదల ధోరణిని కొనసాగిస్తున్నాయి.కిలో వెండి ధర: రూ. 1,88,0001 గ్రాము వెండి ధర: రూ. 188 మార్కెట్ ట్రెండ్స్.డిసెంబర్ 2025 నెల ప్రారంభంలోనే బంగారం, వెండి ధరలు బలమైన పెరుగుదలను కనబరుస్తున్నాయి.ధరల పెరుగుదలకు కారణాలు: పెరుగుతున్న అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు (), ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకుల () నుంచి భారీ స్థాయిలో బంగారం కొనుగోళ్లు పెరగడం, ద్రవ్యోల్బణం () భయాలు వంటివి విలువైన లోహాల ధరలను పెంచడానికి దోహదపడుతున్నాయి.భవిష్యత్ అంచనాలు: మార్కెట్ నిపుణుల అంచనాల ప్రకారం, డిసెంబర్ నెలలో బంగారం ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ నెలలో 10 గ్రాముల పసిడి ధర ఆల్ టైమ్ రికార్డును చేరుకోవచ్చని, రాబోయే రోజుల్లో రూ. 1,35,000 మార్కును కూడా దాటే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.వెండి డిమాండ్: పారిశ్రామిక రంగంలో (ముఖ్యంగా సోలార్ ప్యానెల్స్, ఎలక్ట్రిక్ వాహనాలు) వెండికి డిమాండ్ పెరగడం వలన దాని ధరలు కూడా భారీగా పెరుగుతున్నాయి.పసిడి, వెండి ధరలు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. కొనుగోలు చేసే ముందు స్థానిక జ్యువెలరీ షాపులలో

నిజాలు నిగ్గు తేల్చే
చర్చ
తెలుగు దిన పత్రిక



# 'మోగ్లీ 2025' ట్రైలర్ విడుదల..

## ఆకట్టుకున్న సుమ తనయుడు రోషన్




ప్రముఖ యాంకర్ సుమ కనకాల తనయుడు, యువ నటుడు రోషన్ కనకాల హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మోగ్లీ 2025'. ఈ సినిమా విడుదల తేదీని చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. డిసెంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్నట్టు తెలుపుతూ, సినిమా ప్రమోషన్లలో భాగంగా తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది.జాతీయ అవార్డు గ్రహీత, 'కలర్ ఫోటో' ఫేమ్ సందీప్ రాజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. విడుదలైన ట్రైలర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది.ఈ సినిమాలో రోషన్ కనకాల సరసన సాక్షి సాగర్ మదోల్కర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, వైవా హర్ష కీలక పాత్రలో కనిపించనున్నారు. టాలీవుడ్ యువ సంగీత సంచలనం కాలా భైరవ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. వినూత్నమైన కథాంశంతో వస్తున్న ఈ సినిమాతో రోషన్ మంచి విజయాన్ని అందుకుంటాడని చిత్ర బృందం ధీమా వ్యక్తం చేస్తోంది.



# హిందీలో స్టార్‌డమ్ చూపిస్తేనే గౌరవం

ఇస్టారని వ్యాఖ్య లేకపోతే కనీసం కూర్చోవడానికి కుర్చీ కూడా దొరకదని విమర్శ భాషతో సంబంధం లేకుండా పాన్-ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ నటుడు దుల్కర్ సల్మాన్ బాలీవుడ్ పనితీరుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. హిందీ, మలయాళ చిత్ర పరిశ్రమల మధ్య పని సంస్కృతిలో చాలా వ్యత్యాసం ఉందని ఆయన అన్నారు. హిందీలో పెద్ద స్టార్ అనిపించుకోకపోతే తీవ్రమైన నిర్లక్ష్యానికి గురికావాల్సి వస్తుందని తన అనుభవాలను పంచుకున్నారు. ఓ తాజా ఇంటర్వ్యూలో దుల్కర్ మాట్లాడుతూ.. "బాలీవుడ్‌లో నటించేటప్పుడు, నేను స్టార్ అని అందరినీ నమ్మించాల్సి వచ్చేది. నా చుట్టూ ఇద్దరు వ్యక్తులు ఎప్పుడూ ఉండేవారు. మనం లగ్జరీ కారులో వస్తేనే మనల్ని స్టార్‌గా గుర్తిస్తారు. అలా లేకపోతే సెట్‌లో కనీసం కూర్చోవడానికి కుర్చీ కూడా ఇవ్వరు, మానిటర్ చూడటానికి కూడా స్థలం కేటాయించరు" అని అన్నారు. 2018లో 'కార్వాన్' చిత్రంతో దుల్కర్ హిందీ పరిశ్రమలోకి అడుగుపెట్టారు.మలయాళ చిత్ర పరిశ్రమ ఇందుకు పూర్తి భిన్నంగా ఉంటుందని దుల్కర్ వివరించారు. "మా ఇండస్ట్రీలో సినిమాలకు ఎక్కువ ఖర్చు ఉండదు. ఇక్కడ లగ్జరీకి ఎవరూ ప్రాధాన్యం ఇవ్వరు. రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో షూటింగ్ చేస్తాం. చాలా వస్తువులు ఇంటి నుంచే తెచ్చుకుంటాం" అని రెండు పరిశ్రమల మధ్య ఉన్న తేడాను స్పష్టం చేశారు.ఇక దుల్కర్ సినిమాల విషయానికొస్తే, ఆయన ఇటీవలే 'కాంత' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా డిసెంబర్ 12 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రసారం కానున్నట్లు తెలుస్తోంది.



# మరణాలను మీమ్స్‌గా మార్చడం పాపం

## : జాన్వీ కపూర్ ఆవేదన

అతిలోక సుందరి, దివంగత శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ సోషల్ మీడియాలో నెలకొన్న ఓ దారుణమైన ధోరణిపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖుల మరణాలను సైతం వినోదం కోసం మీమ్స్‌గా మార్చే సంస్కృతిపై ఆమె తీవ్రంగా స్పందించారు. ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ, ఈ తీరు మానవ నైతికతను దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.తన తల్లి శ్రీదేవి మరణం గురించి మాట్లాడాల్సి వచ్చిన ప్రతీసారి ఎంతో జాగ్రత్తగా ఉంటానని జాన్వీ తెలిపారు. "అమ్మ మరణాన్ని అడ్డం పెట్టుకుని పబ్లిసిటీ సంపాదించుకోవాలని చూస్తున్నానని ప్రజలు అనుకుంటారేమోనన్న భయంతో చాలాసార్లు ఆ విషయంపై మాట్లాడటానికే వెనుకాడాను. ఆ సమయంలో నేను అనుభవించిన బాధ, భావోద్వేగాలు పూర్తిగా వ్యక్తిగతమైనవి. వాటిని మాటల్లో చెప్పలేను" అని ఆమె తన ఆవేదనను పంచుకున్నారు. ప్రస్తుత జర్నలిజం, సోషల్ మీడియా తీరు ప్రమాదకరంగా మారుతోందని జాన్వీ అన్నారు. "ఇటీవల ధర్మేంద్ర గారు చనిపోయారంటూ వదంతులు సృష్టించి, దానిపైనా మీమ్స్ చేశారు. ఒకరి మరణాన్ని మీమ్‌గా మార్చడం ఎంతో పాపం. ఈ పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది" అని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

2018 ఫిబ్రవరి 24న దుబాయ్‌లోని ఓ హోటల్‌లో బాత్‌టబ్‌లో ప్రమాదవశాత్తు పడి శ్రీదేవి కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఆ విషాదం జరిగిన కొద్ది నెలలకే జాన్వీ బాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. తల్లిని కోల్పోయిన బాధలో ఉన్న తమ కుటుంబాన్ని మీడియా ప్రశ్నలు, సోషల్ మీడియా మీమ్స్ మరింత వేదనకు గురిచేశాయని ఆమె గుర్తుచేసుకున్నారు.

# యానిమల్ ఛాన్స్ వచ్చివుంటే తిరస్కరించే దాన్ని

## : రసిక దుగల్




బాలీవుడ్ నటి రసిక దుగల్ మరోసారి తన సంచలన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచింది. పితృస్వామ్యాన్ని ప్రోత్సహించే సినిమాలను తాను ఎప్పటికీ అంగీకరించబోనని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా బాలీవుడ్‌లో భారీ విజయం సాధించిన 'యానిమల్' వంటి సినిమా ఆఫర్ తనకు వస్తే తాను 'నో' చెప్పేదానినని తెలిపింది. 'మీర్జాపూర్', 'ఢిల్లీ క్రైమ్' వంటి పాపులర్ వెబ్ సిరీస్‌లతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రసిక దుగల్.. సినిమాలను ఎంచుకునే విషయంలో తన విధానాన్ని తాజాగా ఒక ఇంటర్వ్యూలో పంచుకుంది. నేను ఎంచుకునే ప్రతి సినిమా యొక్క రాజకీయాలు నాకు చాలా ముఖ్యం. కేవలం పైపైన చూడడం కాకుండా, అది నా నిర్ణయాలకు మూలస్తంభంగా నిలుస్తుంది. ఒకవేళ నాకు 'యానిమల్' వంటి సినిమాలో అవకాశం వచ్చి ఉంటే దానికి నేను ఖచ్చితంగా 'నో' చెప్పేదాన్ని. ఎందుకంటే పితృస్వామ్యాన్ని ప్రోత్సహించే ప్రాజెక్ట్‌ను నేను ఒకరోజు అంగీకరిస్తానేమోననేదే నా అతిపెద్ద భయం అని రసిక దుగల్ అన్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

----------

# బాహుబలి నిర్మాతలతో రామ్..

## కెరీర్ లోనే ఫస్ట్ టైమ్ ఇలా!



: ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని అంటేనే మాస్ స్టెప్పులు, లవర్ బాయ్ లుక్స్ గుర్తొస్తాయి. 'ఇస్మార్ట్' ఎనర్జీతో బాక్సాఫీస్ ను షేక్ చేయడం అతని స్టైల్. అయితే ఎప్పుడూ ఒకే రకమైన కథలు చేస్తే కిక్ ఏముంటుంది? అందుకే ఈసారి రామ్ రూటు మార్చారు. ఆడియెన్స్ ను ఎంటర్టైన్ చేయడం మాత్రమే కాదు, ఈసారి సీటు అంచుల మీద కూర్చోబెట్టి భయపెట్టడానికి రెడీ అవుతున్నారు. ప్రస్తుతం 'ఆంధ్రా కింగ్ తాలూకా' సక్సెస్ ను ఎంజాయ్ చేస్తున్న రామ్, తన తర్వాతి సినిమా కోసం ఒక షాకింగ్ డెసిషన్ తీసుకున్నారు. రొటీన్ కమర్షియల్ సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చి, కెరీర్ లోనే మొట్టమొదటిసారిగా ఒక 'హార్రర్' కథను ఎంచుకున్నారు. రామ్ పోతినేని హార్రర్ సినిమా చేయడం అంటేనే ఒక సెన్సేషన్. ఈ క్రేజీ ప్రాజెక్ట్ కు సంబంధించి మరో ఇంట్రెస్టింగ్ అప్డేట్ ఏంటంటే.. ఈ సినిమాను నిర్మిస్తోంది సాక్షాత్తూ బాహుబలి లాంటి దృశ్యకావ్యాలను అందించిన 'ఆర్కా మీడియా వర్క్స్'. ఇండియాలోనే టాప్ ప్రొడక్షన్ హౌస్ గా పేరున్న ఆర్కా మీడియా, రామ్ తో సినిమా చేస్తుందంటే ఆ స్కేల్ ఏ రేంజ్ లో ఉంటుందో ఊహించుకోవచ్చు. ఇంత పెద్ద బ్యానర్, స్టార్ హీరో కాంబినేషన్ లో సినిమా అంటే బడా డైరెక్టర్ ఉంటారని అనుకోవడం సహజం. కానీ ఇక్కడే అసలు ట్విస్ట్ ఉంది. ఈ సినిమాతో 'కిషోర్' అనే కొత్త దర్శకుడు ఇండస్ట్రీకి పరిచయం కాబోతున్నారు. ఒక డెబ్యూ డైరెక్టర్ చెప్పిన కథకు రామ్, ఆర్కా నిర్మాతలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారంటే ఆ స్క్రిప్ట్ లో విషయం ఏ రేంజ్ లో ఉందో అర్థం చేసుకోవచ్చు. గతంలో విరుపాక్ష లాంటి సినిమాలు హార్రర్ జానర్ లో టాలీవుడ్ స్థాయిని పెంచాయి. ఇప్పుడు రామ్ లాంటి స్టార్ హీరో ఈ జానర్ లోకి రావడం కచ్చితంగా మంచి విషయమే. కొత్త దర్శకుడు కిషోర్ ఈ కథను కేవలం భయపెట్టడానికే కాకుండా, ఒక బలమైన ఎమోషన్ తో రాసుకున్నారని ఇన్ సైడ్ టాక్. 'ఆంధ్రా కింగ్ తాలుకా'లో ఎమోషనల్ గా టచ్ చేసిన రామ్, నెక్స్ట్ ఆర్కా మీడియా ప్రాజెక్ట్ తో ఆడియెన్స్ లో భయం పుట్టించడానికి సిద్ధమయ్యారు.

# అడల్ట్ కామెడీతో సైక్ సిద్ధార్థ

టాలీవుడ్ యువ నటుడు నందు, యామిని భాస్కర్ జంటగా నటిస్తున్న సినిమా 'సైక్ సిద్దార్థ'. మీలాంటి యువకుడి కథ అనేది ఉపశీర్షిక. అడల్ట్ కామెడీతో తెరకెక్కుతున్న ఈ మూవీకి వరుణ్ రెడ్డి దర్శకత్వం వహిస్తుండగా ప్రియాంక రెబెకా శ్రీనివాస్, సాక్షి అత్రి, మౌనిక తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. నిర్మాత శ్యామ్ సుందర్ రెడ్డితో పాటు నందు కూడా ఈ చిత్ర నిర్మాణంలో భాగస్వామిగా ఉన్నారు. ఈ చిత్రం డిసెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ చూస్తుంటే అడల్ట్ కామెడీగా ఈ చిత్రం రాబోతుందని తెలుస్తుంది.




Published by Goli Sammi reddy , Owned by VIJETHA PUBLICATIONS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209, Printed at VIJETHA GRAPHICS & OFFSET PRINTERS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 and Published at H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 Editor: Pittala Ravinder, Associate Editor NAYANI RAJESH, RNI.No.APTEL/1998/02685, email: charcha123@gmail.com